సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 87

మంగళవారం 12-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



వరుణుడు కరుణిస్తేనే!

భారత్, దక్షిణాఫ్రికాల మధ్య నేడు రెండో టి20 మ్యాచ్ - 12లో



70,000 వాలా!

కొత్త శిఖరంపై సెన్సెక్స్.. 21 వేలకు చేరువలో నిఫ్టీ ముగింపు - 13లో



సుప్రీంకోర్టులో మహువా పిటిషన్

తనను లోక్‌సభ నుంచి బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ నేత మహువా మొయిత్రా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

వివరాలు 6లో ▸



జార్ఖండ్ సీఎంకు సమన్లు

భూకుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్‌కు ఈడీ మళ్లీ సమన్లు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్

మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ఓబీసీ వర్గం నాయకుడు మోహన్ యాదవ్‌ను బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది.

వివరాలు 6లో ▸



రాలిపోని ఆత్మవిశ్వాసం..

అలోపేసియా వ్యాధి కారణంగా జుట్టు మొత్తం ఊడినా కుంగిపోకుండా హెయిర్‌లెస్ మోడల్‌గా రాణిస్తున్న కేతకీ జానీపై కథనం.

వివరాలు 11లో ▸

ఆర్టికల్ 370 రద్దు సబబే

జమ్మూకశ్మీర్‌పై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు

- మోదీ ప్రభుత్వ నిర్ణయం సమర్థనీయమేనని స్పష్టీకరణ
- 370 తాత్కాలిక ఏర్పాటు: సీజేఐ
- లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయడమూ సబబే.. కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి
- అసెంబ్లీకి వచ్చే సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలి.. మెజారిటీ తీర్పులో జస్టిస్ డి.వై.చంద్రచూడ్
- కశ్మీర్లో హక్కుల హననంపై దర్యాప్తుకు కమిషన్: జస్టిస్ కౌల్
- గట్టి కారణాలుంటేనే కేంద్రపాలిత ప్రాంతాలు: జస్టిస్ ఖన్నా
- 370 రద్దు రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల కొట్టివేత

6లో



ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఈ ఆర్టికల్‌ను రద్దు చేయడం సబబేనని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేస్తూ ఏకగ్రీవంగా 3 తీర్పులు వెలువరించింది. అది తాత్కాలిక ఏర్పాటేనని, దాని రద్దుకు రాష్ట్రపతికి పూర్తి అధికారాలున్నాయని స్పష్టం చేసింది. లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడాన్ని సమర్థించింది. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించి సెప్టెంబర్ 30లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. కశ్మీర్లో మానవ హక్కుల హననంపై స్వతంత్ర కమిషన్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరగాలంటూ జస్టిస్ సంజయ్ కిషన్ విడి తీర్పు వెలువరించారు. కేంద్రపాలిత ప్రాంతాల ఏర్పాటుకు సహేతుక కారణాలు ఉండి తీరాల్సిందేనని జస్టిస్ సంజీవ్ ఖన్నా తీర్పులో పేర్కొన్నారు.

> ఆర్టికల్ 1 ప్రకారమే కాకుండా ఆర్టికల్ 370ని బట్టి చూసినా జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే. దానికి ప్రత్యేక సార్వభౌమాధికారమంటూ ఏమీ ఉండబోదు. హక్కుల విషయంలోనూ మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది సమానమే. ప్రత్యేకతేమీ ఉండబోదు.
> - సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

ఏమిటీ ఆర్టికల్ 370? 6లో

సామాజిక న్యాయంతో కొత్త సమన్వయకర్తలు

11 నియోజకవర్గాలకు కొత్తవారిని నియమించిన సీఎం జగన్

- మంగళగిరిలో ఆళ్ల స్థానంలో సమన్వయకర్తగా చేనేత నాయకుడు గంజి చిరంజీవి
- గాజువాకలో దేవన్‌రెడ్డి స్థానంలో బీసీ వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావు
- గుంటూరు పశ్చిమ సమన్వయకర్తగా మంత్రి విడదల రజని
- చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా మల్లెల రాజేష్‌నాయుడు

ముగ్గురు మంత్రులకు స్థానచలనం



ఆదిమూలపు సురేష్ (కొండెపి)



మేరుగు నాగార్జున (సంతనూతలపాడు)



విడదల రజని (గుంటూరు పశ్చిమ)

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయం అనేది నినాదం కాదు.. అనుసరించాల్సిన విధానమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి చాటి చెప్పారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చి రాజ్యాధికారంలో వాటా కల్పించి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పిన సీఎం జగన్ తాజాగా 11 నియోజకవర్గాలకు నూతన సమన్వయకర్తల నియామకంలోనూ అదే విధానాన్ని పాటించారు. ప్రస్తుతం అగ్రవర్ణాలకు చెందిన ఎమ్మెల్యేలు

మిగతా 2వ పేజీలో ▶

మెరుగైన ఫలితాల కోసమే మార్పులు

- 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తల నియామకంపై మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చు..
- అందరికి సముచిత స్థానం ఇవ్వాలనేది సీఎం జగన్ ఆలోచన

2లో

ఫ్యాక్ట్‌చెక్

లెక్కల్లో మరీ ఇంత వీకా!

- ప్రముఖ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీపై విషం కక్కుతున్న రామోజీ
- అవాస్తవ కథనాన్ని ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నం
- రూ. 47,809 కోట్లు దోచి పెట్టేస్తున్నారంటూ ఏడుపుగొట్టు కథనం
- నిబంధనల మేరకే పరిశ్రమలకు రాయితీలు ఉంటాయని తెలిసినా వక్రరాతలు

- వివరాలు 3లో

అప్పులపాలైనా అభాండాలేనా!?

- వ్యక్తిగత కారణాలతో టీచర్ ఆత్మహత్యాయత్నాన్ని జగన్ సర్కారుకు ముడిపెట్టిన 'రామోజీ' వికృతానందం
- టీచర్ మల్లేష్ రూ.25.60 లక్షలు అప్పులు చేశాడు
- బెట్టింగులో రూ.6 లక్షలు పోగొట్టుకుని నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యాయత్నం
- అవన్నీ ప్రస్తావించకుండా ఒక్క సీపీఎస్‌కి ముడిపెట్టి ఈనాడు బరితెగింపు
- సీపీఎస్ రద్దు చేయబోనని చంద్రబాబు తెగేసి చెప్పినా ఈనాడుకు పట్టింపులేదు

- వివరాలు 3లో

కుట్ర బుద్ధితో కుంగిపోయారు

- రాష్ట్రంలో 88.09% పెరిగిన కూరగాయల ఉత్పాదకత
- 42 లక్షల టన్నుల నుంచి పదేళ్లలో 79 లక్షల టన్నులకు దిగుబడులు
- ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి
- తోటబడులతో రైతులకు నిరంతర శిక్షణ కార్యక్రమాలు
- అన్నదాతకు పంట నష్ట పరిహారం, పంటల బీమా పరిహారం

- వివరాలు 14లో

కొత్తగా 850 ఎంబీబీఎస్ సీట్లు



- వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి..
- 2025-26లో మరో 7 వైద్య కళాశాలలు ప్రారంభించేలా ప్రణాళికలు

10లో

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు



- జీతాలతోపాటే అలవెన్సుల చెల్లింపు
- క్రమశిక్షణ చర్యలపై అప్పీళ్లకు అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పదోన్నతులకు త్వరలో మార్గదర్శకాలు

10లో

వైఎస్సార్ లా నేస్తం చెక్కును న్యాయవాదులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



పేదల పక్షాన నిలవండి

అడ్వొకేట్ సోదరులు, చెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్ పిలుపు

- వారి పట్ల ఔదార్యం చూపాలని ఒక స్నేహితుడిగా, ఒక అన్నగా కోరుతున్నా..
- ప్రభుత్వం మీకు ఎలా తోడుగా నిలబడుతోందో మీరు కూడా పేదల పట్ల అలానే ఉండాలి
- అడ్వొకేట్లందరూ తొలి రోజుల్లో నిలదొక్కుకునేందుకే 'వైఎస్సార్ లా నేస్తం'
- రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ విడుదల
- కంప్యూటర్‌లో బటన్ నొక్కి రూ.7,98,95,000 వారి ఖాతాల్లో జమ
- న్యాయవాదుల బాగు కోసం రూ.100 కోట్లతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్

2లో

డూప్లి'కేట్స్'..!

నెల్లూరులో టీడీపీ నకిలీ ఓట్ల గుట్టలు

టీడీపీ సానుభూతిపరులకు పలు చోట్ల ఓట్లు



- తాజాగా ఉదయగిరి నియోజకవర్గం పామూరుపల్లిలో వెలుగులోకి
- సర్పంచ్ ఎన్నికల్లో ఒక్క ఓటుతో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి
- సర్వేపల్లి, నెల్లూరు పరిధిలో సోమేపల్లి బ్యాచ్ నిర్వాకాలు ఇప్పటికే బహిర్గతం
- 12 వేల ఓట్లను ఫామ్ 7 ద్వారా తొలగించేందుకు నారాయణ బృందం కుట్రలు

14లో



> ఈ ఫొటోలోని చంద్ర సరళ ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పదవిలో ఉన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో తెనాలి మున్సిపాలిటీ 31వ వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ఈమె నెల్లూరు జిల్లా పామూరుపల్లి కోడలు. అయితే పుట్టినిల్లైన తెనాలిలోనూ ఆమెకు ఓటుంది. ఇంటి పేరు మార్పుతో రెండు చోట్లా ఓటరుగా కొనసాగుతున్నారు. జాస్తి సరళ పేరుతో తెనాలిలో ఓటరుగా నమోదు చేసుకోగా చంద్ర సరళ పేరుతో పామూరుపల్లిలో ఓటు హక్కు పొందారు.


పెళ్లి ఖర్చు రూ.4.20 లక్షల కోట్లు!

ఈ సీజన్‌లో వివాహ ఖర్చు కొత్త రికార్డులను సృష్టిస్తుందని అంచనా

- డిసెంబర్‌లోపు దేశవ్యాప్తంగా జరగనున్న 35 లక్షల వివాహాలు
- గతేడాది ఇదే సీజన్‌లో 32 లక్షల పెళ్లిళ్లు జరిగినట్టు అంచనా
- కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) సర్వేలో వెల్లడి


పెళ్లిళ్లకు భారతీయులు ఖర్చు చేస్తున్నట్టు ప్రపంచంలో మరే దేశంలోనూ చేయడం లేదు. ఏటా పెరుగుతున్న వివాహ మహోత్సవ వ్యయం ఈ ఏడాది సరికొత్త రికార్డులను సృష్టిస్తుందని అంచనా వేస్తున్నారు. నెల రోజుల విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో దేశంలో రికార్డు స్థాయిలో వివాహాలు జరగడమే కాకుండా.. వ్యయం కూడా భారీగా నమోదు కానుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) తాజాగా విడుదల చేసిన సర్వేలో వెల్లడించింది. డిసెంబర్ 15వ తేదీలోపు ముగిసే ఈ పెళ్లిళ్ల సీజన్‌లో దేశవ్యాప్తంగా 35 లక్షలకు పైగా వివాహాలు జరుగుతాయని సీఏఐటీ అంచనా వేసింది. గతేడాది ఇదే సీజన్‌లో సుమారు 32 లక్షల వివాహాలు జరిగితే.. ఈసారి మరో మూడు లక్షలకుపైగా వివాహాలు ఎక్కువ నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సీఏఐటీ చైర్మన్ ఆచార్య దుర్గేష్ తారే ఆ నివేదికలో పేర్కొన్నారు.

- సాక్షి, అమరావతి



వివాహాల నిర్వహణ కోసం ఆయా కుటుంబాలన్నీ కలిపి రూ.4.20 లక్షల కోట్లు వ్యయం చేస్తాయని, దీనివల్ల దేశీయ రిటైల్ మార్కెట్ వేగంగా విస్తరిస్తుందని అంచనా వేస్తున్నట్టు నివేదికలో తెలిపారు. వస్త్రాలు, బంగారం, ఆహార పదార్థాలు, రంగులు, రవాణా, గృహోపకరణాలు ఇలా అన్ని రంగాల్లో అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయని అంచన వేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 35 లక్షల వివాహాల్లో రూ.కోటి అంతకంటే ఎక్కువ వ్యయం చేసేవారు 50 వేలకు పైగా ఉంటే.. మరో 50 వేల మంది రూ.కోటి నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు చేసే వారు ఉంటారని అంచనా వేస్తున్నారు. 6 లక్షల మంది రూ.25 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని, 12 లక్షల మంది రూ.10 లక్షల వరకు వెచ్చిస్తారని అంచనా వేశారు. మరో 10 లక్షల మంది రూ.6 లక్షల వరకు వ్యయం చేస్తారని అంచనా వేస్తున్నట్టు సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేవాల్ పేర్కొన్నారు.

ఇది మామూలు ఖర్చు కాదండోయ్!





40% ఖర్చు ఆహారానికే..

మొత్తం పెళ్లి ఖర్చులో అత్యధికంగా 40 శాతం కేవలం ఆహార పదార్థాలు, పానీయాలకే ఖర్చు చేస్తున్నట్టు సీఏఐటీ సర్వే వెల్లడించింది. అల్పాహారం, భోజనాలకు వివిధ ఆహార పదార్థాలు, విదేశీ పండ్లను చేరుస్తుండటంతో వ్యయం భారీగా పెరిగిపోతోంది. మన రాష్ట్రంలో సాధారణ మధ్య తరగతి వారే భోజనాల కోసం రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని.. ధనవంతుల ఇళ్లలో వివాహాలకు ఈ వ్యయం మూడు నుంచి నాలుగు రెట్లు పెరుగుతోందని విజయవాడకు చెందిన క్యాటరింగ్ సంస్థ ప్రతినిధి సుధాకర్ పేర్కొన్నారు. ఆ తర్వాత గృహాలు, కల్యాణ మండపాల అలంకరణకు 10 శాతం, నూతన వస్త్రాలకు మరో 10 శాతం ఖర్చు చేస్తుంటే.. 8 శాతం బంగారు ఆభరణాలకు ఖర్చు చేస్తున్నట్టు సర్వే పేర్కొంది. పెళ్లి సందర్భంగా ఇంటి మరమ్మతులు, పెయింటింగ్ కోసం మరో 5 శాతం ఖర్చు అవుతుంటే, రిటర్న్ గిఫ్టులు, ఇతర వ్యయాల కోసం మిగిలిన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. మన రాష్ట్రంలో రెండు రోజుల క్రితం నుంచి పెళ్లిళ్ల సీజన్ మొదలు కాగా.. ఉత్తరాదిలో నవంబర్ 23 నుంచి ప్రారంభం కానుంది.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

నా బతుక్కు ఆసరా దొరికింది

అప్పటి వరకు సజావుగా సాగుతున్న మా బతుకు ఒక్కసారిగా తల్లకిందులైంది. నా భర్త చిన్న శంకర్ కూలిపని చేసే వారు. ఉన్నంతలో ఇల్లు గడిచేది. మాకు రాజేష్, హేమసుందర్ సంతానం. ఒక రోజు నా భర్త తీవ్ర అనారోగ్యం వల్ల ఈ లోకాన్ని వీడారు. దీంతో ఏమి చేయాలో అర్థం కాలేదు. అప్పటికే పెద్దోడు రాజేష్ ఒకరి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కొద్దిపాటి ఆదాయం సంపాదిస్తున్నాడు. ఇంటికి ఈ ఒక్క ఆదాయమే దిక్కయింది. హేమసుందర్ బీఫార్మసీ పూర్తి చేసి, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇంటి అద్దె రూ.3,500. కుటుంబ పోషణ భారమైంది. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్ ఆసరా పథకం నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఏడాదికి 17,200 చొప్పున మూడు దఫాలుగా ఇప్పటి వరకు రూ.51,600 నా పొదుపు ఖాతాలో జమ అయ్యింది. ఈ సాయంతో రూ.4 వేలతో ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని, వస్త్ర వ్యాపారం ప్రారంభించా. చీరలు,



పిల్లల దుస్తులను పొద్దుటూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి రైలు ద్వారా తీసుకొని వస్తున్నా. బంధువులు, స్నేహితుల సహకారంతో వ్యాపారం సంతృప్తిగానే సాగుతోంది. దుకాణానికి అద్దె, కరెంటు బిల్లు రూ.800 పోను నెలకు సుమారు రూ.10 వేలు ఆదాయం ఉంటుంది. దీంతో మా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కింది.

– రాగిమాను రామేశ్వరి, కురువపేట, నంద్యాల

(కొత్తపేట ద్వారకానాథ్, విలేకరి, నంద్యాల)

కళ్లెదుటే మార్పు కనిపిస్తోంది

గతంలో జూన్ వస్తోందంటే భయం వేసేది. పుస్తకాలు, బట్టల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వచ్చేది. మాది తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామం. జగనన్న పాలనలో ఏటా అమ్మఒడి పథకం కింద సాయం అందుతుండటంతో ఆర్థిక వెసులుబాటు కలిగింది. బడులు ప్రారంభం కాగానే విద్యాకానుక కిట్లు ఇచ్చారు. రోజుకో రకం కూరగాయలతో మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. చిక్కీ, రాగిజావ ఇస్తున్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ఇష్టపడే వారు కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రైవేటు కాన్వెంట్ల కంటే ప్రభుత్వ బడులే బాగున్నాయి. ఉపాధ్యాయుల కొరత లేకుండా చేశారు. రాష్ట్ర చరిత్రలో చదువుకు ఇంత ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వాన్ని ఇంత వరకు చూడలేదు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా అమ్మఒడి ఉపయోగపడుతోంది. మా పిల్లలు



సత్య చైతన్య 8వ తరగతి, సాయిలక్ష్మి వర్షిత 6వ తరగతి ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. ఇప్పటి వరకు నాలుగుసార్లు అమ్మఒడి పథకం ద్వారా సుమారు రూ.60 వేలు ఆర్థిక సాయం అందించారు. పిల్లలు కూడా గతంలో పాఠశాలలకు వెళ్లడానికి మారాం చేసేవారు. ఇప్పుడు మా కంటే ముందే నిద్రలేచి, స్నానం ముగించుకుని పాఠశాలకు వెళుతున్నారు.

– యర్రావుల వెంకటదుర్గ, అనంతపల్లి

(తాళూరి సత్యనారాయణ, విలేకరి, నల్లజర్ల)

సంతోషాల పంట పండింది

విత్తనాలు, ఎరువుల కోసం ఇదివరకు పట్నాలకు పరిగెత్తేవాళ్లం. గంటల తరబడి వాటి కోసం నిరీక్షించేవాళ్లం. నకిలీలు, బ్లాక్ మార్కెట్‌లతో నిండా మునిగిపోయే వాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం పండుగలా మారింది. నాది బాపట్ల జిల్లా జె. పంగులూరు మండలం జనకవరం. నాకు 3 ఎకరాల భూమి ఉంది. శనగ పంట సాగు చేస్తున్నా. గతంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలంటే ఇంకొల్లు, అద్దంకి పట్టణాలకు పరుగు పెట్టాల్సి వచ్చేది. అక్కడ గంటల తరబడి క్యూలో వేచి ఉన్నా చేతికి సరుకు అందేది కాదు. మళ్లీ ఇంకో రోజు వెళ్లాల్సి వచ్చేది. మండలానికి ఒక్క వ్యవసాయ అధికారే ఉండేవారు. ఆయన కూడా సరిగా అందుబాటులో ఉండక పోవడంతో సరైన సూచనలు, సలహాలు లేక పంటలు నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని సేవలను ఒకేచోట అందజేయడం చాలా బాగుంది. మా గ్రామంలోని కొంత మంది రైతులతో కలిసి శ్రీమన్నారాయణ రైతు గ్రూపు ఏర్పాటు చేసుకున్నాం. మా గ్రూపునకు వ్యవసాయ యంత్ర పరికరాల పథకం కింద 50 శాతం సబ్సిడీతో రూ.15 లక్షల రుణం మంజూరైంది. మా గ్రూపు సభ్యులు మూడు



ట్రక్కులు, రోటవేటర్ తీసుకున్నారు. నేను ట్రాక్టర్, ట్రక్కు, రోటవేటర్ తీసుకున్నా. ట్రాక్టర్‌కి రూ.2 లక్షలు, ట్రక్‌కు రూ.40 వేలు, రోటవేటర్‌కి రూ.30 వేలు సబ్సిడీ కింద ప్రభుత్వం నాకు అందించింది. ఈ యంత్ర పరికరాల ద్వారా నా 3 ఎకరాల పొలం సాగు చేసుకుంటూనే ఇతర రైతుల పొలాల్లో నా పరికరాలను వినియోగిస్తూ అదనపు ఆదాయం కూడా పొందుతున్నాను. రైతు భరోసా ద్వారా కూడా లబ్ధి పొందాను. ఈ క్రాప్ ద్వారా ఇన్సూరెన్స్ డబ్బులు కూడా వచ్చాయి. ఆర్బీకే ద్వారా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఎన్నో కొత్త విషయాలు తెలుస్తున్నాయి. వీటన్నింటి వల్ల దిగుబడి కూడా పెరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే సంతోషాల పంట పండింది.

– గుర్రం దేవేంద్ర, జనకవరం

(గోగులమూడి చంద్రయ్య, విలేకరి, జె.పంగులూరు)

పేదల పక్షాన నిలవండి

అడ్వొకేట్ సోదరులు, చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: పేదల పక్షాన అడ్వొకేట్ సోదరులు, చెల్లెమ్మలు ఔదార్యం చూపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఒక స్నేహితుడిగా, ఒక అన్నగా ప్రతి అడ్వొకేట్‌ను ఇదే కోరుతున్నానని, దీనిని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ లా నేస్తం పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ విడుదల చేశారు.

నెలకు రూ.5,000 చొప్పున 2023 జూలై–డిసెంబర్ వరకు 6 నెలలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.30,000 మేరకు మొత్తం రూ.7,98,95,000 కంప్యూటర్‌లో బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ రకంగా మీకు తోడుగా నిలబడుతోందో, అదే రీతిన మీరంతా పేద వాడి పక్షాన నిలవాలన్నారు. వారి పట్ల మానవతా దృక్పథం చూపించాలని కోరారు. లా డిగ్రీ పూర్తి చేసుకుని, న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకునే సమయంలో వారికి ప్రోత్సాహకంగా నిలుస్తూ వరుసగా గత నాలుగేళ్లుగా వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. నెలకు రూ.5 వేలు స్టైఫండ్ చొప్పున, సంవత్సరానికి రూ.60 వేలు, మూడేళ్లకు రూ.1.80 లక్షలు ఇస్తున్నామన్నారు. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేందుకు ఈ కార్యక్రమం ద్వారా తోడుగా నిలిచామని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించి రెండో విడతలో 2,807 మంది అడ్వొకేట్‌లకు మంచి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నాలుగేళ్లలో రూ.49.51 కోట్లు

- 'ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ లా నేస్తం ద్వారా మొత్తంగా 6,069 మంది జూనియర్ అడ్వొకేట్లకు మంచి చేస్తూ.. మనందరి ప్రభుత్వం రూ.49.51 కోట్లు సాయం చేసింది. ఈ మంచిని



లా నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

జ్ఞాపకం ఉంచుకొని పేదవాళ్ల పట్ల అదే ఔదార్యం చూపించే మంచి సంస్కృతికి ఈ కార్యక్రమం ముందడుగు అవుతుంది. అడ్వొకేట్లందరూ బాగుండాలని, వారి కోసం మనసారా ఆలోచనలు చేసి మంచి జరగాలని తపిస్తూ వైఎస్సార్ లా నేస్తమే కాకుండా రూ.100 కోట్లతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును స్థాపించాం. అడ్వొకేట్ జనరల్ ఆధ్వర్యంలో, లా సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ ఇద్దరినీ సభ్యులుగా ఆ ట్రస్టులో ఉంచాం.
- ఈ కేటాయింపు వల్ల కోవిడ్ సమయంలో వీళ్లందరికీ చాలా మంచి జరిగింది. వీళ్లలో 643 కుటుంబాలకు రూ.52 లక్షలు ఇచ్చాం. ఆ సమయంలో ఇబ్బందుల్లో ఉన్న అడ్వొకేట్స్‌ను ఆదుకుంటూ మరో 7,733 మందికి రూ.11.56 కోట్ల రుణాలు ఇచ్చారు. మరో 14,848 మంది అడ్వొకేట్లకు మెడిక్లెయిమ్ పాలసీ కింద మరో రూ.11.41 కోట్లు చెల్లించాం. అదే టైంలో దాదాపు రూ.25 కోట్లు ఈ ఫండ్ నుంచి అడ్వొకేట్ కమ్యూనిటీకి ఇచ్చి, వారికి తోడుగా నిలబడగలిగాం.
- నా పాదయాత్రలో నా దగ్గరకొచ్చి వీళ్లంతా వినతిపత్రం ఇచ్చినప్పుడు మాట ఇచ్చాను. ఆ మేరకు వాళ్లందరికీ తోడుగా ఉంటూ ఈ నాలుగు సంవత్సరాలుగా అడుగులు ముందుకు వేశాం. దేవుడి దయతో ఇంకా మంచి చేసే అవకాశాలు, పరిస్థితులు రావాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం అన్నారు.
- ఈ కార్యక్రమంలో సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, లా సెక్రటరీ జి సత్యప్రభాకర రావు, ఇతర అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విజనరీ స్కీమ్స్ మీకే సాధ్యం



గుంటూరు జిల్లా కోర్టులో నేను జూనియర్ అడ్వకేట్‌గా కెరీర్ ప్రారంభించాను. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. మా నాన్న ప్రైవేట్ ఉద్యోగి. మీరు ప్రవేశపెట్టిన విజనరీ స్కీమ్స్ గురించి సచివాలయంలో తెలుసుకున్నాను. హ్యాట్సాఫ్ సార్. నేను ఇటీవల ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు వెళ్లాను. చాలా బాగుంది. దేశమంతా ఏపీ వైపు చూస్తోంది. విదేశీ విద్య చాలా బాగుంది. తుపాను సమయంలో మీరు ఇచ్చిన సపోర్ట్, భరోసా చాలా నచ్చింది. మిమ్మల్ని మార్గదర్శకంగా తీసుకుని మేం కూడా పేదలకు సాయం చేయాలనుకుంటున్నాం. మీరు ఒక విజనరీ. మీరు ఇచ్చే స్టైఫండ్ చాలా ఉపయోగపడుతుంది. మా కాళ్లపై మేం నిలబడుతున్నాం. – శశిధర్, జూనియర్ అడ్వకేట్, గుంటూరు

లా నేస్తం మాకు ధైర్యాన్నిచ్చింది



నేను వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాను. నాకు చాలా ఉపయోగపడుతోంది. మేం ఈ డబ్బును కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ప్రిపరేషన్‌కు, బుక్స్, రవాణా ఖర్చుల కోసం ఉపయోగించుకుంటున్నాం. ఈ వృత్తిలో తొలుత ఎలా నిలదొక్కుకోవాలి.. ఎలా రాణించాలి.. ఖర్చుల మాటేంటి.. అని భయపడ్డాం. కానీ ఈ స్కీమ్ మాకు ధైర్యాన్నిచ్చింది. మా జూనియర్స్‌కు కూడా ధైర్యం చెబుతున్నాం. గుప్పుల స్వర్ణయుగాన్ని నేను చూడలేదు కానీ మీ పాలనలో చూడగలిగాను. చాలా సంతోషం. మీరు ఇచ్చే అన్ని పథకాలు మాకు అందుతున్నాయి. మా నాన్న ఆర్టీసీ ఉద్యోగి. ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేయడంతో చాలా సంతోషపడ్డాం. – కోట అక్షిత, జూనియర్ అడ్వకేట్, నందిగామ

సామాజిక న్యాయంతో కొత్త సమన్వయకర్తలు

మేకతోటి సుచరిత, డాక్టర్ ఈవూరు గణేష్, మల్లెల రాజేష్‌నాయుడు, పాణెం హనిమిరెడ్డి

గంజి చిరంజీవి, వరికూటి అశోక్‌బాబు, బాలసాని కిరణ్‌కుమార్, వరికూటి రామచంద్రరావు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించారు. మంత్రులు విడదల రజని, మేరుగు, ఆదిమూలపు సురేష్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను మార్పు చేశారు. ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సీఎం సమాయత్తం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులను శాస్త్రీయంగా, క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ మార్పులు చేస్తున్న క్రమంలో 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా చేనేత సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవిని నియమించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు, నియోజకవర్గ సమన్వయకర్త దేవన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావును నియమించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి రజినిని నియమించారు. ఆమె ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా కాపు సామాజిక వర్గానికి చెందిన మల్లెల రాజేష్‌నాయుడిని నియమించారు.

11 నియోజకవర్గాలకు సీఎం జగన్ నియమించిన సమన్వయకర్తలు వీరే..

నియోజకవర్గం	నూతన సమన్వయకర్త
ప్రత్తిపాడు(ఎస్సీ)	బాలసాని కిరణ్‌కుమార్
కొండెపి(ఎస్సీ)	డాక్టర్ ఆదిమూలపు సురేష్
వేమూరు(ఎస్సీ)	వరికూటి అశోక్‌బాబు
తాడికొండ(ఎస్సీ)	మేకతోటి సుచరిత
సంతనూతలపాడు	(ఎస్సీ) మేరుగు నాగార్జున
చిలకలూరిపేట	మల్లెల రాజేష్‌నాయుడు
గుంటూరు పశ్చిమ	విడదల రజిని
అద్దంకి	పాణెం హనిమిరెడ్డి
మంగళగిరి	గంజి చిరంజీవి
రేపల్లె	డాక్టర్ ఈవూరు గణేష్
గాజువాక	వరికూటి రామచంద్రరావు

డెల్టాలను ముంచి ఉల్టా రాతలా!?

తుపాన్ 'ముంపు'పై రామోజీ తప్పుడు కథనం

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో ఆ రెండు డెల్టాల్లో అక్కడక్కడ పల్లపు ప్రాంతాల్లో కొంతమేర పంటలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వమే ఆ పంటలను ముంచేసినట్లు చిత్రీకరిస్తూ సీఎం జగన్‌పై రామోజీరావు ఇష్టమొచ్చినట్లు రాసిపారేశారు. డ్రెయిన్లు, కాలువల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యంవల్లే డెల్టాల్లో పంటలు ముంపునకు గురైనట్లు చేతికొచ్చింది అచ్చేశారు. నిజానికి.. టీడీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణాడెల్టా ఆధునీకరణకు వినియోగించాల్సిన రూ.175 కోట్లను కృష్ణా నది కరకట్టపై తాను నివాసం ఉంటున్న అక్రమ నివాసాన్ని సుందరీకరించేందుకు చంద్రబాబు మళ్లించారు. అలాగే, గోదావరి డెల్టా ఆధునీకరణ నిధులనూ గోదావరి పుష్కరాలకు మళ్లించారు. ఆ పనులు చేయకుండానే కాంట్రాక్టర్ల ముసుగేసుకున్న టీడీపీ నేతలకు రూ.150 కోట్లకు పైగా దోచిపెట్టారు. ఏటా డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తట్టిడు పూడిక ఎత్తకుండానే ఎత్తినట్లు చూపి రూ.వందల కోట్లను పచ్చమందకు దోచిపెట్టారు. చంద్రబాబు అవినీతివల్లే కృష్ణా, గోదావరి డెల్టాల్లో డ్రెయిన్లలో పూడిక పేరుకుపోయింది. గత నాలుగున్నరేళ్లుగా కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఆయకట్టు చివరి భూములకు నీళ్లందిస్తూ దన్నుగా నిలుస్తున్న సీఎం జగన్‌కు రైతులు అండగా నిలుస్తుండటాన్ని భరించలేక రామోజీరావు నిద్రపట్టడంలేదు. దీంతో చంద్రబాబు అవినీతిని కప్పెట్టి.. ఆ నెపాన్ని సీఎం జగన్‌పై రుద్దుతూ 'ప్రభుత్వం ముంచింది' అంటూ 'ఈనాడు'లో తప్పుడు కథనాన్ని అచ్చేశారు.

రెండు పంటలకు సమృద్ధిగా సాగునీరు..

సీఎం జగన్ ఆదేశాల మేరకు గత నాలుగున్నరేళ్లుగా గోదావరి, కృష్ణా డెల్టాల్లో రబీ పంటల కోతలు పూర్తికాగానే కాలువలకు మరమ్మతులు చేస్తూ.. డ్రెయిన్లలో గుర్రపుడెక్కను తొలగిస్తూ.. ఆయకట్టు చివరి భూములకు అధికారులు నీళ్లందిస్తున్నారు.

గోదావరి డెల్టాతోపాటు కృష్ణాడెల్టా చరిత్రలో గత నాలుగేళ్లుగా రబీ పంటకూ నీళ్లందిస్తున్నారు. కాలువలు, డ్రెయిన్లను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమృద్ధిగా నీళ్లందిస్తుండటంతో పంటల ఉత్పత్తులు పెరగడం.. గిట్టుబాటు ధరలు దక్కడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. తుపాన్లు, భారీ వర్షాలవల్ల పంటలకు నష్టం వాటిల్లితే.. ఆ సీజన్ ముగిసేలోగానే నష్టపోయిన రైతులకు సీఎం జగన్ పరిహారం చెల్లిస్తూ దన్నుగా నిలుస్తున్నారు. దీంతో సీఎం జగన్‌కు రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో ఆదరణ పెరుగుతున్నట్లుగానే.. కృష్ణా, గోదావరి డెల్టా రైతుల్లోనూ ఆయనకు నానాటికీ మద్దతు పెరుగుతోంది.

డెల్టాల ఆధునీకరణ నిధులు స్వాహా..

కృష్ణా, గోదావరి డెల్టాను ఆధునీకరించడం ద్వారా పంటలకు సమృద్ధిగా నీళ్లందించి రైతులకు బాసటగా నిలవాలని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. జలయజ్ఞం కింద గోదావరి, కృష్ణా డెల్టాల ఆధునీకరణ పనులు చేపట్టారు. తన హయాంలో గోదావరి డెల్టా ఆధునీకరణకు రూ.748.58 కోట్లు, కృష్ణాడెల్టా ఆధునీకరణకు రూ.1,093.77 కోట్లు ఖర్చుచేసి కాలువలు, డ్రెయిన్లను అభివృద్ధి చేశారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన బాబు.. డెల్టాల ఆధునీకరణ నిధులను దోచేశారు.

- కృష్ణాడెల్టా ఆధునీకరణకు 2014–19 మధ్య రూ.1,239.24 కోట్లు ఖర్చుచేస్తే.. ఇందులో రూ.175 కోట్లను తాను నివాసం ఉంటున్న అక్రమ కట్టడం సుందరీకరణకు మళ్లించారు.
- కాలువలు, డ్రెయిన్ల ఆధునీకరణ పనులు తూతూమంత్రంగా చేపట్టి కాంట్రాక్టర్ల ముసుగులోని టీడీపీ నేతలతో కలిసి చంద్రబాబు దోచేశారు.
- గోదావరి డెల్టా ఆధునీకరణకు 2014–19 మధ్య రూ.813.02 కోట్లు ఖర్చుచేసిన చంద్రబాబు.. అందులో చాలావరకు నిధులను గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు మళ్లించేశారు.
- పనులు చేయకుండానే చేసినట్లు చూపి పచ్చమందకు దోచిపెట్టారు.

మెరుగైన ఫలితాల కోసమే మార్పులు

11 నియోజక వర్గాలకు కొత్త సమన్వయకర్తల నియామకంపై మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల

+ భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చు..
+ ఈ మార్పులను వేరే విధంగా చూడాల్సిన అవసరం లేదు
+ అందరికి సముచిత స్థానం ఇవ్వాలనేది సీఎం ఆలోచన
+ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ అడుగులు



మాట్లాడుతున్న సజ్జల, బొత్స

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ఏ నియోజక వర్గానికి ఎవరిని పార్టీ సమన్వయకర్త(ఇన్‌ఛార్జ్)గా నియమించాలో శాస్త్రీయంగా అధ్యయనం చేసిన అనంతరం మార్పులు చేర్పులకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఆ వివరాలను ప్రకటించారు. మంగళవారం నుంచి 11 నియోజవర్గాల్లో పార్టీ వ్యవహారాలన్నీ కొత్తగా నియమితులైన సమన్వయకర్తలే పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మెరుగైన ఫలితాల కోసమే ఈ మార్పులని, భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చని వారు స్పష్టం చేశారు. బొత్స మాట్లాడుతూ.. ఏ ఒక్కరినీ పార్టీ వదులుకోదని, అందరి సేవలను వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. గత నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ వారికి ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చారన్నారు. సామాజిక సాధికారతను చేతల్లో చూపించారన్నారు. అణగారిన వర్గాలకు మరింతగా మంచి చేయాలంటే పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. భవిష్యత్తులోనూ అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులను సమీక్షించుకుంటూ అవసరాన్ని బట్టి ఇన్‌ఛార్జ్‌ల మార్పు చేర్పులపై తగిన నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. గంజి చిరంజీవిని పార్టీలో చేర్పించింది మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డేనని మంత్రి బొత్స గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వకర్తగా చిరంజీవిని సీఎం జగన్ నియమించారన్నారు. పార్టీలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి సముచిత స్థానం ఇస్తారని చెప్పారు. పార్టీ ఏ ఒక్కరినీ వదులుకోబోదని, ఎవరి సేవలు ఎక్కడ అవసరమో అక్కడ వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఈ మార్పుల వల్ల కొందరికి బాధ ఉండవచ్చని, అయితే అందరూ సీఎం జగన్ నిర్ణయాలను అర్థం చేసుకుని పార్టీకి సహకరిస్తారన్నారు. సజ్జల మాట్లాడుతూ.. "సీఎం జగన్ వైఎస్సార్‌సీపీని స్థాపించిన నాటి నుంచి పార్టీని ప్రజలకు జవాబుదారీగా ఉంచారు. సీఎం జగన్ దృష్టిలో శాసనసభ్యుడికి ఎంత విలువ ఉంటుందో కార్యకర్తకూ అంతే విలువ ఉంటుంది. పార్టీకి కార్యకర్తలే ప్రాణం. ప్రజలకు మరింతగా సేవ చేయాలంటే మళ్లీ అధికారంలోకి రావాలి. ప్రజలతో మమేకమై వారి మనసులు చూరగొని ఆశీస్సులు పొంది ఎవరు రాణిస్తారో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని సీఎం జగన్ మొదటి నుంచి చెబుతున్నారు. ఈ క్రమంలోనే 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. భారీ మెజార్టీతో గెలవాలన్న ఆలోచనతోనే మార్పులు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చు.. ఉండకపోవచ్చు కూడా! పార్టీ ఒక వ్యక్తి కోసమో.. వ్యక్తుల కోసమో ఉండదు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే కూర్చోబెట్టి మాట్లాడతాం. ఎందుకు మార్పు చేశామనేది అంతర్గతంగా వారికి వివరిస్తాం" అని అన్నారు. ప్రతిపక్షాలు గాలి మాటలతో గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నాయని, పొత్తులపై ఒక దారీ తెన్నూ లేకుండా వ్యవహరిస్తున్నాయని అన్నారు.

వ్యక్తిగత కారణాలతోనే ఎమ్మెల్యే ఆర్కే దూరం

సీఎం వైఎస్ జగన్ వెంటే రామకృష్ణారెడ్డి: ఎంపీ అయోధ్య రామిరెడ్డి

సాక్షి, అమరావతి/మంగళగిరి: తన సోదరుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి ఆర్కే రాజీనామా చేయడంపై ఆయన స్పందించారు. ఆర్కేకు ఎలాంటి అసంతృప్తి లేదని, సీఎం జగన్ వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్కేకు కొన్ని అంచనాలు ఉన్నాయని, వాటిని అందుకోలేక రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని వివరించారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సీఎం జగన్ మొదటి నుంచి భావించారని, ఆ క్రమంలోనే సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించారని చెప్పారు. మంగళగిరి నుంచి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని, జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమని చెప్పారు.

వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా: ఆర్కే



తాను వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ఆయన సోమవారం అసెంబ్లీకి వెళ్లి స్పీకర్ ఓఎస్‌డీకి రాజీనామా అందించిన అనంతరం మంగళగిరిలో విలేకరులతో మాట్లాడారు. 1995 నుంచి రాజకీయాలలో ఉంటూ దివంగత వైఎస్సార్ అనుచరుడిగా కొనసాగానన్నారు. 2004, 2009లలో కాంగ్రెస్ నుంచి పెదకూరపాడు టిక్కెట్ ఆశించి భంగపడ్డానన్నారు. సీఎం వైఎస్ జగన్ వెంట నడిచి 2014, 2019లలో మంగళగిరి ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధిచేసి రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దానని చెప్పారు.

14న సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లాలో పర్యటన

సాక్షి, అమరావతి: ఈ నెల 14న సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విశాఖకు వాయుమార్గంలో చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా మకరంపురం గ్రామానికి సీఎం చేరుకుంటారు. ఉద్దానం కిడ్నీ సమస్య నివారణకు చేపట్టిన వైఎస్సార్ సుజలధార ప్రాజెక్ట్‌ను సీఎం ప్రారంభిస్తారు. పలాస చేరుకుని వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ హాస్పిటల్‌ను ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి పలాస రైల్వే గ్రౌండ్స్‌లో బహిరంగ సభకు హాజరవుతారు. తిరుగు ప్రయాణమై తాడేపల్లి చేరుకుంటారు.

నేడు చోడవరం, రాజంపేట నియోజకవర్గాల్లో సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతంగా సాగుతోంది. మంగళవారం అనకాపల్లి జిల్లాలో చోడవరం, అన్నమయ్య జిల్లాలో రాజంపేట నియోజకవర్గాల్లో సామాజిక సాధికార యాత్ర జరుగుతుంది. బడుగు, బలహీన, వెనుకబడిన, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ చేసిన మేలును యాత్రలో ఆ వర్గాలకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరించనున్నారు.

15న మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: ఈ నెల 15వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. తొలుత ఈ నెల 14న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించినా, 15వ తేదీకి మార్పు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. ఈ క్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు మంత్రివర్గ సమావేశంలో ఉంచే ప్రతిపాదనలను 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోపు సమర్పించాలని సీఎస్ ఆదేశించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

కరువు ప్రభావం అంచనా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న ఏడు జిల్లాల్లో మంగళవారం నుంచి కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ ద్వివేది నేతృత్వంలో 10 మంది సభ్యులు మూడు బృందాలుగా ఈ జిల్లాల్లో తిరిగి కరువు ప్రభావాన్ని అంచనా వేయనున్నారు. మంగళవారం ఈ మూడు బృందాలు కలిసి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నాయి. బుధ, గురువారాల్లో మూడు బృందాలు విడివిడిగా అన్నమయ్య, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నాయి.

శ్రీకాళహస్తికి ఆర్‌పీఎస్‌జీ కంపెనీ

వ్యాపార దిగ్గజం సంజీవ్ గోయంకా వెల్లడి



సంజీవ్ గోయంకాకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆర్‌పీఎస్‌జీ సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌పీఎస్‌జీ మల్టీనేషనల్ కంపెనీ అధినేత, వ్యాపార దిగ్గజం సంజీవ్ గోయంకా తెలిపారు. సోమవారం ఆయన కుటుంబంతో కలిసి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వీరికి స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం చూపే విధంగా ఆలోచన చేయాలంటూ సంజీవ్ గోయంకా వద్ద ఎమ్మెల్యే ప్రస్తావించారు. దీంతో ఆయను స్పందిస్తూ త్వరలోనే ప్రతినిధులను పంపి కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని తెలిపారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో తాగునీటికి ఢోకా లేదు



రెండో నంబర్ గేటుకు అమర్చిన స్టాప్‌లాగ్

మద్దిపాడు: ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని మల్లవరం గ్రామం వద్ద ఉన్న కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయం నుంచి తాగునీటి విడుదలకు ఢోకా లేదని అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి గుండ్లకమ్మ రిజర్వాయర్ రెండో గేటు దిగువ భాగం ఊడిపోయిన సంగతి తెలిసిందే. సీఈ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఈ అబూదలి, పర్యవేక్షణలో డ్యామ్ సిబ్బంది ఆదివారం స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి చిలకలేరు, దోర్నపు వాగుల నుంచి 1,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందిలేదని అధికారులు తెలిపారు.

'ఆరోగ్యశ్రీ' ట్రస్ట్ సీఈవోగా బాలాజీ బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేద, మధ్యతరగతి ప్రజలందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో డీకే బాలాజీ చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం సీఈవోగా బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు వేగంగా సేవలు అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. నూతన సీఈవోకు ట్రస్ట్ ఈవో దీపక్, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా జేసీగా ఉన్న బాలాజీని ఇటీవలే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా ప్రభుత్వం నియమించింది.

విజయవాడలో జీఎస్‌ఐ రీజినల్ కార్యాలయం

సాక్షి, అమరావతి: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ) రీజినల్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటుకానుంది. విజయవాడ శివారు తాడిగడపలోని ఏపీఎండీసీ కార్యాలయంలోనే ప్రస్తుతం జీఎస్‌ఐ రీజినల్ ఆఫీసును ఈ నెల 13వ తేదీన ప్రారంభించనున్నట్లు మైనింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జీఎస్‌ఐ హైదరాబాద్ రీజియన్ పరిధిలోనే ఏపీ కార్యకలాపాలు కొనసాగాయి. ఏపీ రీజియన్ ప్రత్యేకంగా ఉండాలని జీఎస్‌ఐ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు నిర్ణయించి విజయవాడలో నూతన కార్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరోవైపు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్(ఐబీఎం) రీజినల్ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నంలోని మైనింగ్ డైరెక్టర్ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ రీజినల్ కార్యాలయం కూడా ఇటీవల వరకు హైదరాబాద్‌లోనే కొనసాగింది.

అప్పులపాలైనా అభాండాలేనా!?

వ్యక్తిగత కారణాలతో టీచర్ ఆత్మహత్యాయత్నాన్ని జగన్ సర్కారుకు ముడిపెట్టిన ఈనాడు రామోజీ వికృతానందం

- నిజానికి.. టీచర్ మల్లేష్ రూ.25.60 లక్షలు అప్పులు చేశాడు
- బెట్టింగులో రూ.6 లక్షలు పోగొట్టుకుని నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యాయత్నం
- అవన్నీ ప్రస్తావించకుండా ఒక్క సీపీఎస్‌కి ముడిపెట్టి ఈనాడు బరితెగింపు

సాక్షి, అమరావతి/అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం క్రైం: భావప్రాప్తి కోసం ఈనాడు రామోజీరావు తన రికార్డులను తానే బద్దలు కొట్టుకుంటున్నారు. ఎంత నీచానికి దిగజారకూడదో అంతకన్నా హీనంగా అథఃపాతాళంలోకి ఆయన రోజురోజుకీ కూరుకుపోతున్నారు. కారణం.. తన ఆత్మ చంద్రబాబుపై అంతులేని ప్రేమ.. సీఎం జగన్‌పై ఎక్కడాలేని అసూయ, విద్వేషం. దీంతో ఆయన సిగ్గూఎగ్గూ వదిలేసి తన విషపుత్రిక ఈనాడులో నిత్యం రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌పై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారు. అందులో భాగమే టీచర్ మల్లేష్ ఆత్మహత్యా యత్నం కథనం కూడా. వ్యక్తిగత కారణాలతో పాటు విపరీతమైన అప్పుల ఊబిలో కూరుకుపోయి అవి చెల్లించలేని దుస్థితిలో ఆత్మహత్యా యత్నానికి అతను పాల్పడితే రామోజీ ఆ ఉదంతాన్ని కూడా బాబు కోసం, తన పైశాచికానందం కోసం వాడేసుకున్నారు. ఈ ఘటనపై 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..

అనంతపురం జిల్లా ఉరవకొండలో వ్యక్తిగత కారణాలతో టీచర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడితే ఆ ఘటనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, సీపీఎస్‌కు ముడిపెట్టి రామోజీ వికృతానందం పొందారు. నిజానికి.. 2003లో సీపీఎస్‌ను కేంద్రం రద్దు చేసినప్పుడు ఇక్కడ అధికారంలో ఉన్నది చంద్రబాబే. అంతేకాదు.. నాటి కేంద్ర ప్రభుత్వంలో ఆయన భాగస్వామి కూడా. అందులో ఆయన మంత్రులు సైతం ఉన్నారు. అప్పట్లో ఈ రద్దు నిర్ణయాన్ని వీరెవరూ వ్యతిరేకించలేదు. పైగా.. 2014లో చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చాక కూడా సీపీఎస్‌కు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట నిర్ణయం తీసుకోకుండా అలా గాలికి వదిలేశారు. ఈ వివరాలన్నింటినీ రామోజీ ఉద్దేశపూర్వకంగా తన కథనంలో ఎక్కడా ప్రస్తావించలేదు. ఆ తర్వాత 2019 ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీకి తోడు సీపీఎస్ ఉద్యోగులకు పెన్షన్ చాలా తక్కువ వస్తోందని సీఎం వైఎస్ జగన్ గుర్తించి వారికి మెరుగైన పెన్షన్ కోసం.. అలాగే, దానికొక శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో అన్ని రకాలుగా ఆలోచించి ఆయన గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్)కు రూపకల్పన చేశారు. దీని ప్రకారం.. ఇప్పుడు సీపీఎస్ ఉద్యోగి పదవీ విరమణకు ముందునెల పొందే మూల వేతనంలో 50 శాతం పెన్షన్ వచ్చేలా జీపీఎస్‌ను తీసుకొచ్చి సీపీఎస్ ఉద్యోగులకు మేలుచేశారు. దీనిని ఉద్యోగ సంఘాలు సైతం స్వాగతించాయి. ఇంతకంటే గొప్ప ప్రత్యామ్నాయంలేదని ఉద్యోగులంతా హర్షం వ్యక్తంచేశారు. చివరికి కేంద్రం కూడా ఇప్పుడు దీనిని అధ్యయనం చేస్తుండడమే కాక అన్ని రాష్ట్రాలూ ఈ విధానాన్నే అనుసరించాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. టీచర్ మల్లేష్ ఆత్మహత్యా యత్నానికి సీఎం జగన్ సీపీఎస్ రద్దు చేయకపోవడమే కారణమంటూ రామోజీ గుడ్డిగా ఒక నిర్ణయానికొచ్చేసి బాబుకు మేలు జరిగేలా తనకు తోచింది రాసిపారేశారు. ఇందుకు టీడీపీ నేతలు సైతం తోకలూపుతూ నీచ రాజకీయాలకు దిగారు.

జగన్‌పై నమ్మకమే మరణశాసనం అయింది



జగన్ సర్కారును అభాసుపాల్జేయడమే పని..

ఇక 1996 నుంచి 2004 వరకు అప్పటి కేంద్రంలోని ఎన్‌డీఏలో తానే చక్రం తిప్పానని పదేపదే గొప్పలు చెప్పుకున్న బాబు.. ఆనాడు సీపీఎస్‌ను ఎందుకు వ్యతిరేకించలేదు? పైగా.. రాష్ట్రంలో అమలుచేసేందుకు 2003లో ఆమోదం కూడా తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం సీపీఎస్‌ను రద్దుచేయాలని ఉద్యోగులు డిమాండ్ చేసినా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండి ఒక సమయంలో సీపీఎస్ రద్దు సాధ్యంకాదని తెగేసి చెప్పారు. కానీ, 2019 ఎన్నికల ముందు నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్ రద్దు హామీ ఇవ్వడంతో ఇక గత్యంతరం లేక ఎన్నికల ముందు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సత్యప్రకాశ్ ఠక్కర్‌తో చంద్రబాబు కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. నిజంగా చంద్రబాబుకు సీపీఎస్ ఉద్యోగులపట్ల ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే తన ఐదేళ్ల పాలనలో మెరుగైన పెన్షన్ కోసం ఎందుకు నిర్ణయం తీసుకోలేదు? బాబు చేసిన ఈ మోసాన్ని ఎక్కడా ప్రస్తావించకుండా సీపీఎస్ ఉద్యోగులకు మేలుచేసిన జగన్ సర్కారును అభాసుపాల్జేయడమే పనిగా ఈనాడు రామోజీ పెట్టుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులు నిజమే.. కానీ, ప్రభుత్వంపై అసంతృప్తిలేదు



నా భర్త ఎందుకు ఆత్మహత్యాయత్నం చేశాడో తెలీదు. మాకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. కానీ, ఈ ఘటనను కొందరు పని కట్టుకుని రాజకీయం చేస్తున్నారు. మా ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. డిప్రెషన్‌లో ఏమి రాశాడో, ఎవరికి పోస్ట్ చేశాడో మాకు తెలీడం లేదు. దయచేసి దీనిపై రాజకీయం చేయొద్దు. నా భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం మెసేజ్ వచ్చిన తర్వాతే నాకు తెలిసింది. నిజానికి.. మాకెవరికీ ప్రభుత్వంపై ఎలాంటి వ్యతిరేకతలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే మాకు చాలా అభిమానం. జగన్ పాలనలోనే నాకు సచివాలయం ఏఎన్‌ఎంగా ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. నా భర్తను కాపాడుకునేందుకు అందరూ సహకరించాలి.

– **శివలక్ష్మి,** టీచర్ మల్లేష్ భార్య

రూ.25.60 లక్షల అప్పుల్లో మల్లేష్..

వాస్తవాలిలా ఉంటే.. ఉరవకొండ మండలం చిన్నముష్టూరుకు చెందిన మల్లేష్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ అప్పుల్లో కూరుకుపోవడంతో పాటు ఇటీవల బెట్టింగ్‌లో రూ.ఆరు లక్షలు కోల్పోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఎం జగన్ సీపీఎస్ రద్దుచేయనందువల్లే ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు ఈనాడు రామోజీ మసిపూసి మారేడుకాయ చేశారు. అంతేకాదు.. ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన టీచర్ మల్లేష్ రూ.25.60 లక్షల అప్పుల్లో కూడా కూరుకుపోయిన నిజాన్ని ఈనాడు మరుగునపరిచి కేవలం సీపీఎస్ రద్దు చేయనందువల్లే అంటూ ఇష్టారాజ్యంగా రాసిపారేసింది. వ్యక్తిగత కారణాలతో జరిగిన ఘటనలకు సీపీఎస్ అంశాన్ని ముడిపెట్టి రామోజీ, టీడీపీ నేతలు పైశాచికానందం పొందుతున్నారు. మరోవైపు.. 35 ఏళ్ల టీచర్ మల్లేష్‌కు ఇంకా చాలా సర్వీసు ఉంది. అంత సర్వీసు ఉండగా సీపీఎస్ రద్దుచేయలేదని ఇప్పుడే ఆత్మహత్యాయత్నానికి ఎందుకు పాల్పడతారనే కనీస స్పృహ, ఇంగిత జ్ఞానం రామోజీకి కరువైంది.

అప్పులున్నాయి.. అవి చెల్లించకపోవడంవల్లే..



మల్లేష్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. రుణాలు తీసుకున్నాడు. అవి సక్రమంగా చెల్లించకపోవడంతో మానసికంగా ఇబ్బంది పడేవాడు. అనవసరంగా ఈ విషయాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారు. రాజకీయాలకు నా బావకూ ఎలాంటి సంబంధంలేదు.

– **ఆదినారాయణ,** శివలక్ష్మి సోదరుడు

వ్యక్తిగత ఇబ్బందులవల్లే ఆత్మహత్యాయత్నం



వ్యక్తిగత ఇబ్బందుల నేపథ్యంలోనే టీచర్ మల్లేష్ ఆత్మహత్యాయత్నం చేశాడు. మల్లేష్ తన కుటుంబంతో పాటు సోదరి కుటుంబాన్ని కూడా ఆర్థికంగా చూసుకునేవాడు. ఈ క్రమంలో ఆయన సుమారు రూ.26 లక్షలకు పైగా అప్పులుచేశాడు. వాటిని తీర్చేమార్గం కనిపించక ఇబ్బందులు పడేవాడు. దీనికితోడు బ్యాంకులు, చిట్‌ఫండ్ కంపెనీల్లో రుణాలు తీసుకోవడంతో అన్నింటికీ నెలవారీ చెల్లింపులు కష్టంగా మారింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఆయన ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. మల్లేష్ పూర్తిగా స్పృహలోకి రాగానే మరిన్ని విషయాలు తెలుస్తాయి.

– మీడియాతో ఉరవకొండ సీఐ **ఎం. తిమ్మయ్య**

జీతాలు సకాలంలోనే అందుతున్నాయి

వ్యక్తిగత కారణాలతో ఉపాధ్యాయుడు మల్లేష్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం దురదృష్టకరం. మల్లేష్ ఘటనపై కొన్ని సంఘాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కావాలనే ప్రభుత్వానికి ఆపాదించి దుష్ప్రచారం చేస్తున్నాయి. మల్లేష్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు అసంబద్ధంగా ఉన్నాయి. మల్లేష్‌కు అనారోగ్య కారణాలు ఉన్నాయని, వీటికి తోడు ఆర్థిక సమస్యలు కూడా తోడయ్యాయని ఆయన భార్య బహిరంగంగానే చెప్పారు. నిజానికి.. 2020–21 కరోనా సమయంలోనూ ప్రతినెలా 4న ఉపాధ్యాయుల వేతనాలు అందాయి. ఇప్పుడూ ప్రతినెలా 6వ తేదీ లోపలే అందుతున్నాయి. కావాలంటే పే స్లిప్పులు పరిశీలించాలి. పీఎఫ్, జీపీఎఫ్ లోన్లు ఈ ఏడాది ఏప్రిల్ వరకు క్లియర్ చేశారు. ప్రభుత్వోద్యోగులపై సీఎం వైఎస్ జగన్‌కు ఎలాంటి వ్యతిరేకతా లేకున్నా ఓ వర్గం మీడియా, కొందరు వ్యక్తులు పనిగట్టుకుని ప్రభుత్వాన్ని అభాసుపాల్జేయాలని ప్రయత్నిస్తున్నారు. మల్లేష్ రాసినట్లు చెబుతున్న లేఖ కూడా ఆయన రాసింది కాదని ఆయన కుటుంబ సభ్యులే చెబుతున్నారు.

– **అశోక్‌కుమార్‌రెడ్డి,** వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

అనారోగ్యంతోనే మా అక్క ఆత్మహత్య

- పోలీసులకు అంధురాలు సరోజ తమ్ముడి ఫిర్యాదు
- పింఛన్ తొలగింపు వల్ల అంటూ మీడియాలో దుష్ప్రచారం

గుంతకల్లు రూరల్: అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం నక్కనదొడ్డి తండాకు చెందిన సరోజ(40) అనారోగ్య సమస్యలు భరించలేకే ఈ నెల తొమ్మిదో తేదీన ఆత్మహత్య చేసుకుందని ఆమె తమ్ముడు ముడావత్ నరసింహనాయక్ తెలిపాడు. ఈ మేరకు గుంతకల్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పింఛన్ తొలగింపు వల్ల మనస్తాపం చెందిన సరోజ బలవన్మరణానికి పాల్పడినట్లు కొన్ని పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో సరోజ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను ఎస్‌ఐ సురేష్ సోమవారం మీడియాకు వెల్లడించారు. సరోజ పుట్టుకతోనే అంధురాలని, దానికితోడు తరచూ అనారోగ్య సమస్యలు వెంటాడుతుండేవని, పెళ్లి సంబంధాలు కూడా కుదరడం లేదని బాధపడుతుండేదని తెలిపారు. ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులు నచ్చజెప్పేవారని చెప్పారు. ఈ క్రమంలోనే తొమ్మిదో తేదీన కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉన్న సరోజ ఇంట్లోనే పురుగుమందు తాగిందని తెలిపారు. పక్కింటివారి సమాచారంతో సోదరుడు నరసింహనాయక్ తన భార్యతో కలిసి ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న సరోజను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారని వివరించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. కానీ, కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో వాస్తవాన్ని వక్రీకరించి పింఛన్ తొలగించినందుకు ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలొచ్చాయని పేర్కొన్నారు. అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

తెలంగాణ

11మందిని పొట్టన పెట్టుకుని?

- మాయలు, మంత్రాలు.. ఆనక హత్యలు
- ఓ నరహంతకుడి నేరచరిత్రను వెలికితీస్తున్న ఖాకీలు
- నాగర్‌కర్నూల్‌లో మాయగాడు సత్యనారాయణ బాగోతం
- నేడు వివరాలు వెల్లడిస్తామంటున్న పోలీసులు
- సత్యనారాయణ బాగోతాలపై గతంలోనే సాక్షి కథనం

సాక్షి, నాగర్‌కర్నూల్: మంత్రాలు, మాయలు చేసి గుప్తనిధులను వెలికితీస్తానంటూ అమాయకులను మోసం చేయడం.. ఎవరైనా ఎదురుతిరిగితే మట్టుబెట్టడం.. ఇలా ఇప్పటివరకు ఏకంగా 11 మందిని పొట్టన పెట్టుకున్నాడని భావిస్తున్న ఓ నరహంతకుడిని నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన రామెట్టి సత్యనారాయణ యాదవ్ కొన్నేళ్లుగా తనకు మంత్రాలు, మాయలు తెలుసునంటూ అమాయక మహిళలు, వ్యక్తులను నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. తన మంత్రశక్తితో గుప్తనిధులను వెలికితీస్తానని, కుటుంబ కలహాలు, సమస్యలను పరిష్కరిస్తానంటూ మొదట తనకు పరిచయం అయిన వారిని నమ్మిస్తాడు. ఈ క్రమంలో వారి పేరిట ఉన్న భూములు, ఇతర ఆస్తిపాస్తులను తన పేరిట, అనుయాయుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడు. ఎవరైనా తిరగబడితే గుట్టుచప్పుడు కాకుండా పథకం ప్రకారం హత్యకు తెగబడతాడని బాధితుల నుంచి ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. ఇలా ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 11 మంది అమాయకులను బలితీసుకున్నాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడి నుంచి పూర్తి వివరాలు రాబడుతున్నట్టు తెలుస్తోంది. కాగా మంగళవారం నిందితుడి పూర్తి వివరాలను వెల్లడిస్తామని నాగర్‌కర్నూల్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఓ రియల్టర్ భార్య ఇచ్చిన ఫిర్యాదుతో వెలుగులోకి..

పోలీసుల విచారణలో భాగంగా నిందితుడు సత్యనారాయణ యాదవ్ ఇప్పటివరకు 11 మంది అమాయకులను హత్య చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. మృతుల జాబితాలో మూడేళ్ల కిందట 2020 ఆగస్టు 14న వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల సమయంలో అపస్మారక స్థితిలో మరణించిన ఉన్న నలుగురు వ్యక్తులు హజిరా బీ(60), ఆష్మా బేగం (32), ఖాజా (35), ఆశ్రీన్ (10) ఉన్నారని తెలుస్తోంది. రెండేళ్ల కిందట నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులకి చెందిన లింగస్వామి, కోడేరు మండలం తీగలపల్లికి చెందిన రాంరెడ్డి, కల్వకుర్తి పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని సైతం హతమార్చినట్టు అనుమానిస్తున్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ కన్పించడం లేదని అతని భార్య లక్ష్మీ హైదరాబాద్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా సత్యనారాయణ యాదవ్ బాగోతం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా మంత్రాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న సత్యనారాయణ యాదవ్ బాగోతాలపై ఈ ఏడాది ఏప్రిల్ 5న 'మాయగాళ్లు'శీర్షికన 'సాక్షి'కథనాన్ని ప్రచురించింది. బాధితులు ఫిర్యాదు చేస్తున్నా విచారణపై నిర్లక్ష్యం చేస్తున్న పోలీసుల తీరును ఆ కథనంలో ప్రస్తావించింది.

లెక్కల్లో మరీ ఇంత వీకా..!

- ప్రముఖ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీపై విషంకక్కుతున్న రామోజీ
- అవాస్తవ కథనాన్ని ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్న పరిశ్రమలపై రామోజీరావు విషం చిమ్ముతున్నారు. తప్పుడు లెక్కలు వేసి.. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయలు దోపిడీ జరిగిపోతోందంటూ ప్రజలను మభ్యపెట్టడానికి మరోసారి విశ్వప్రయత్నం చేశారు. ఆసియాలోనే ప్రముఖ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీ ఇండోసోల్‌పై 'రూ. 47,809 కోట్లు దోచి పెడుతున్నారు' అంటూ సోమవారం మరోసారి ఈనాడులో తప్పుడు రాతలు రాశారు. పరిశ్రమలన్నిటికీ రాయితీలు ఒకేలా వర్తిస్తాయని, ఒక్కో కంపెనీకి ఒక్కోలా ఉండవని తెలిసి కూడా అవాస్తవ కథనాన్ని ప్రచురించారు. వాస్తవానికి రాష్ట్రంలో దాదాపు రూ. 59,958 కోట్ల పెట్టుబడులను ఇండోసోల్ పెడుతోంది. తద్వారా ప్రత్యక్షంగా 12వేల మందికి, పరోక్షంగా 20వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా అడ్డగోలుగా రాసిన ఆ కథనంలో ఉన్నవన్నీ అబద్ధాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోష రావు తెలిపారు. సీఎండీలు వెల్లడించిన అసలు నిజాలు ఇలా ఉన్నాయి.

రెట్టించిన అబద్ధాలు

ఈనాడు తన కథనంలో చెప్పినట్టుగా పరిశ్రమల రంగంలో గరిష్ట డిమాండ్ చార్జీలు కలిపి సగటున యూనిట్‌కు రూ. 12గా విద్యుత్ పంపిణీ సంస్థలు వసూలు చేస్తున్నాయనడం పూర్తిగా అబద్ధం. 11కేవీ స్థాయిలో ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలకు సరాసరి విద్యుత్ చార్జీ యూనిట్ రూ. 6.50 కాగా, ప్రస్తుతం విధిస్తున్న ఇంధన సర్దుబాటు చార్జీలు దీనికి అదనం. ఈ ఇంధన సర్దుబాటు చార్జీలు నిరంతరం ఉండవు. గడువు అయిపోగానే ఆగిపోతాయి. ప్రస్తుతం ఈ కేటగిరీలో ఫెర్రోఅల్లాయ్ పరిశ్రమలు, ఫొటో ఓల్టాయిక్(పీవీ) ఇంగోట్-సెల్ తయారీ పరిశ్రమలు, పోలీ సిలికాన్ పరిశ్రమలు, అల్యూమినియం పరిశ్రమలు ఉన్నాయి.

లో టెన్షన్‌లో ఆ కేటగిరీయే లేదు

ఇండోసోల్ పరిశ్రమ సమర్పించిన ప్రాజెక్టు వివరాల ప్రకారం అది అత్యధిక పరిమాణంలో విద్యుత్ వినియోగించే పరిశ్రమ. ఇప్పుడు అమలులో ఉన్న అత్యధిక వోల్టేజీ స్థాయి 220 కేవీ కన్నా ఎక్కువగా 400 కేవీ స్థాయిలో విద్యుత్ వినియోగం జరగబోతోంది. అయినా గ్రిడ్‌పై ఎటువంటి హెచ్చు తగ్గులు లేకుండా స్థిరంగా ఉండగలదు. దానితో ఇది దృఢమైన గ్రిడ్ నిర్వహణకు దోహద పడుతుంది. అయితే ఇప్పుడు 400 కేవీ విద్యుత్ వినియోగ స్థాయి అనేది రిటైల్ టారిఫ్ ధరలలో లేకపోవడం వల్ల దీని కోసం ప్రత్యేకంగా ఒక ఉప కేటగిరీని ప్రతిపాదించారు. లో టెన్షన్(ఎల్‌టీ) స్థాయిలో అసలు ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమ అనే ఉప కేటగిరీ లేనే లేదు. ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలు అంటేనే అవి అధిక పరిమాణంలో విద్యుత్ వాడే పరిశ్రమలని అర్థం. అవి కేవలం హెచ్‌టీ కేటగిరీలోనే ఉంటాయి.

అర్హతను బట్టే ప్రోత్సాహకాలు

ఆత్మనిర్భర్ భారత్ (మేక్ ఇన్ ఇండియా)లో భాగంగా, ఎండ్-టు-ఎండ్ సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ సంస్థలను ఏర్పాటు చేయడానికి భారత ప్రభుత్వం ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (పీఎల్ఐ)పథకాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ, నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) చేపట్టిన బిడ్డింగ్ ద్వారా ఈ పథకానికి ఇండోసోల్ అర్హత సాధించింది. దాని ద్వారా ఈ పరిశ్రమకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) రూ. 1,875 కోట్ల ప్రోత్సాహకానికి అనుమతి ఇచ్చింది. వాస్తవంగా ఈ రాయితీలు ఏ ఒక్కరికో పరిమితం కాదు. ఈ కేటగిరీలో ఎవరు వచ్చినా వాటికి ఇవే రాయితీలు వర్తిస్తాయి. పాలసీ అన్నది అన్ని పరిశ్రమలకు ఒకేలా వర్తిస్తాయిగానీ, ఒక్కో కంపెనీకి ఒక్కోలా వర్తించవు. ఈ విషయం తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా ఈనాడు దినపత్రిక తప్పుడు రాతలు రాస్తోంది.

చట్టం కాకుండానే ఏడుపా

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ అధిక విద్యుత్ వాడే పరిశ్రమకు తొలి ఏడేళ్లు యూనిట్‌కు రూ.4.0గాను, ఎనిమిదో ఏట నుంచి రూ.4.50 గాను ప్రతిపాదించడం జరిగింది. ఈ పరిశ్రమకు 220 కేవీ స్థాయిలో ప్రస్తుత టారిఫ్ యూనిట్ రూ 4.90గా ఉంది. ఈ టారిఫ్ ప్రతిపాదనలు ప్రస్తుతం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) పరిశీలనలో ఉన్నాయి. వీటిపై వచ్చే ఏడాది జనవరి 29 నుంచి 31 వరకు ప్రజాభిప్రాయ సేకరణ, బహిరంగ విచారణ నిర్వహిస్తామని ఇప్పటికే నోటిఫికేషన్ ద్వారా ఏపీఈఆర్‌సీ వెల్లడించింది. అంటే ఈ ప్రత్యేక విద్యుత్ కేటగిరికి టారిఫ్ చట్టపరంగా ఇంకా నిర్ధారణ కాలేదు. ఇంతలోనే ఎంతో నష్టం జరుగుతోందంటూ ఈనాడు ఏదేదో ఊహించేసుకుని ఏడుపుగొట్టు కథనాన్ని అచ్చేసింది.

రూ. 47,809 కోట్లు దోచి పెడుతున్నారు!



రిటైల్ విద్యుత్ ధరల పట్టిక ప్రకారం ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమల కేటగిరీ చార్జీలు

వోల్టేజి స్థాయి	220 కేవీ	132 కేవీ	33కేవీ	11కేవీ
డిమాండ్ చార్జీలు (రూ/కేవీ/నెల)	475	475	475	475
ఎనర్జీ చార్జీలు (రూ /యూనిట్)	4.90	4.95	5.35	5.80

సర్వే కింగ్.. సంధాయక్!

అధునాతన అతిపెద్ద నిఘా నౌక సంధాయక్

హైడ్రోగ్రాఫిక్ సర్వే, భౌగోళిక డేటా సేకరించడంలో కీలక పాత్ర

ఇటీవలే భారత నౌకాదళంలో చేరిక.. త్వరలోనే విశాఖ నుంచి సేవలు

సాక్షి, విశాఖపట్నం: సాగర గర్భంలో ఏం జరుగుతోంది... ఉపరితలంపై ముంచుకొస్తున్న ముప్పు ఏంటి... సముద్రంలో శత్రుదేశాల నుంచి తలెత్తే ఆపదలేంటి... ఇలా సుదీర్ఘ భారత సముద్ర తీరంలో అణువణువూ సర్వే చేసేందుకు అధునాతన అతిపెద్ద సర్వే నౌక ఐఎన్‌ఎస్ సంధాయక్ సిద్ధమైంది. భారత నౌకాదళంలో అతిపెద్ద సర్వే వెసల్‌గా గుర్తింపు పొందిన ఐఎన్‌ఎస్ సంధాయక్ విశాఖపట్నం కేంద్రంగా సేవలు అందించనుంది. స్వదేశీ పరిజ్ఞానంతో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్(జీఆర్‌ఎస్‌ఈ) సంస్థ తయారు చేసిన ఐఎన్ఎస్ సంధాయక్ వారం రోజుల కిందట భారత నౌకాదళంలో చేరింది. బలమైనశక్తిగా ఎదుగుతున్న తూర్పు నౌకాదళానికి ఈ అత్యాధునిక సర్వే వెసల్‌ని కేటాయించాలని భారత నౌకాదళం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కోల్‌కతా నుంచి చివరి ట్రయల్స్ పూర్తయిన తర్వాత నేరుగా విశాఖపట్నం తీసుకువచ్చేందుకు ఇండియన్ నేవీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఓడరేవులు, నావిగేషనల్ చానెల్స్, ఎకనామిక్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో, కోస్టల్, డీప్ వాటర్ హైడ్రో-గ్రాఫిక్ సర్వే నిర్వహించడం, రక్షణ కోసం ఓషనోగ్రాఫిక్ డేటాను సేకరించడంలో సంధాయక్ కీలక పాత్ర పోషించనుంది. దీంతోపాటు శోధన-రెస్క్యూ, సముద్ర పరిశోధనతోపాటు విపత్తు సమయంలో వైద్య సేవలందించే హాస్పిటల్ షిప్‌గానూ దీనిని తయారు చేశారు.

సంధాయక్ సత్తా ఇదీ..

పొడవు: 110 మీటర్లు
బరువు: 3,300 టన్నులు
వేగం: గంటకు 33 కి.మీ.
సామర్థ్యం: 30 కి.మీ. వేగంతో ఏకధాటిగా 12వేల కి.మీ. దూరం ప్రయణించగలదు
సిబ్బంది: 231 మంది
సెన్సార్: అటానమస్ అండర్ వాటర్ వెహికల్ సెన్సార్, హైడ్రోగ్రాఫిక్ సెన్సార్ పరికరాలు, సముద్ర కాలుష్యాన్ని గణించే మార్పల్ వ్యవస్థ ఏర్పాటు
ఆయుధ సంపత్తి: సీఆర్ఎన్91 నేవల్ గన్, హాల్ హెలికాప్టర్

రూ.2,435 కోట్లతో 4 సర్వే వెసల్స్

సంధాయక్ సర్వే వెసల్ 1968 నుంచి భారత నౌకాదళంలో విశిష్ట సేవలందించి 2021లో నిష్క్రమించింది. ఈ తరుణంలో రక్షణ మంత్రిత్వ శాఖ 2017లోనే నాలుగు సంధాయక్ క్లాస్ సర్వే వెసల్స్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించగా, రూ.2,435.15 కోట్లతో బిడ్‌ని జీఆర్‌ఎస్‌ఈ సంస్థ దక్కించుకుంది. అత్యాధునిక సాంకేతిక, 75శాతం స్వదేశీ పరిజ్ఞానంతో ఈ షిప్స్‌ని నిర్మిస్తున్నారు. ఈ క్లాస్ షిప్స్‌లో మొదటిది జే18 పేరుతో ఐఎన్‌ఎస్ సంధాయక్ నిర్మించగా... ఐఎన్‌ఎస్ నిర్దేశక్, ఐఎన్‌ఎస్ ఇక్షక్, ఐఎన్‌ఎస్ సంశోధక్ షిప్స్ 2024 నాటికి భారత నౌకాదళంలోకి చేరనున్నాయి.



ఐఎన్‌ఎస్ సంధాయక్ నౌక



“చట్టం యొక్క కవచం కింద న్యాయం పేరుతో జరిగే దౌర్జన్యాన్ని మించిన దారుణమైన దౌర్జన్యం మరొకటి లేదు.
– మాంటెస్క్యూ

సాక్షి
మంగళవారం, 12 డిసెంబర్ 2023

సుదీర్ఘ వివాదానికి తెర

జమ్మూ–కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీచేసిన నోటిఫికేషన్ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం సోమవారం వెలువరించిన తీర్పుపై సహజంగానే అటు హర్షామోదాలతోపాటు ఇటు అసంతృప్తి, అసమ్మతి కూడా వ్యక్తమయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించగా, కశ్మీర్‌కు చెందిన వివిధ పార్టీలు నిరాశ వ్యక్తంచేశాయి. దశాబ్దాలుగా ఈ అధికరణ చుట్టూ సాగుతున్న వివాదానికి తాజా తీర్పు ముగింపు పలికింది. 370వ అధికరణ రద్దు సహా అన్ని విషయాల్లోనూ ధర్మాసనంలోని న్యాయమూర్తులందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లు కలిసి ఒక తీర్పు వెలువరించగా దానితో ఏకీభవిస్తూనే జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు రెండు వేర్వేరు తీర్పులిచ్చారు.

ప్రభుత్వాల విధాన నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం సహజమే. కశ్మీర్ వంటి భావోద్వేగాలతో ముడిపడివుండే అంశంలో వీటి తీవ్రత కాస్త అధికంగానే ఉంటుంది. అందువల్లే సుప్రీంకోర్టు నిర్ణయం ఎలా ఉంటుందన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. కశ్మీర్‌లో ఉగ్రవాదం వేళ్లూనడానికీ, భద్రతాబలగాలపై దాడులకూ మూలం 370వ అధికరణలో ఉందన్నది జనసంఘ్‌గా ఉన్నప్పటి నుంచీ బీజేపీ నిశ్చితాభిప్రాయం. దానికితోడు పాకిస్తాన్, చైనా సరిహద్దుల సమీపంలో ఉండటంవల్ల కశ్మీర్ ఘటనలు దేశ పౌరులందరినీ కలవరపరుస్తుంటాయి. అయితే అధికరణ రద్దుపై స్థానికులు ఏమనుకుంటున్నారన్నది స్పష్టంగా తెలియదు. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగి పదేళ్లవుతోంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ ప్రాంతంలోని మూడు స్థానాలనూ నేషనల్ కాన్ఫరెన్స్ గెలుచుకోగా, జమ్మూ ప్రాంతంలోని మూడు స్థానాలు బీజేపీకి లభించాయి. 2019 ఆగస్టు 5న రాష్ట్ర పతి నోటిఫికేషన్ జారీకి నాలుగు రోజుల ముందు నుంచీ కశ్మీర్‌కు భద్రతా బలగాల తరలింపు, విద్యా సంస్థలకు సెలవులు, శ్రీనగర్‌లో నిరవధిక కర్ఫ్యూ, అమర్‌నాథ్ యాత్ర నిలుపుదల వంటి నిర్ణయాలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడే ముందు సైతం కశ్మీర్‌లో ప్రధాన పార్టీల నేతలంతా తమను గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. ఇదంతా గమనిస్తే కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి అత్యంత సున్నితమైన సమస్య అని అర్థమవుతుంది.

జమ్మూ–కశ్మీర్ పాలకుడు హరిసింగ్ ఆ ప్రాంతాన్ని 1947లో భారత్‌లో విలీనం చేసినప్పుడిచ్చిన హామీకి అనుగుణంగా 1949లో రాజ్యాంగ నిర్ణాయక సభ 370వ అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చింది. ఆ అధికరణ ప్రకారం విదేశీ వ్యవహారాలు, ఆర్థికం, కమ్యూనికేషన్లు, రక్షణ మినహా ఇతర అంశాలు జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ ఆమోదిస్తే తప్ప ఆ రాష్ట్రంలో అమలు కావు. అయితే ఒకసారంటూ దేశంలో విలీనమయ్యాక ఇక ‘అంతర్గత సార్వభౌమత్వం’ అనేదే ఉండదని తాజా తీర్పుల్లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 370వ అధికరణ తాత్కాలిక స్వభావంతో కూడుకున్నదని... తాత్కాలిక, మధ్యంతర అధికరణలున్న రాజ్యాంగంలోని 21వ భాగంలో చేర్చటమే ఇందుకు నిదర్శమని జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం భాష్యం చెప్పగా... నెమ్మదిగా జమ్మూ–కశ్మీర్‌ను కూడా ఇతర రాష్ట్రాలతో సమానం చేయటమే దాని ఉద్దేశమని విడిగా ఇచ్చిన తీర్పులో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అభిప్రాయపడ్డారు. ఈ రెండు అభిప్రాయాలతోనూ విడిగా తీర్పునిచ్చిన మరో న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఏకీభవించారు. ఈ అధికరణ స్వభావం ఏమిటన్న అంశాన్ని 2016లో సుప్రీంకోర్టు పరిశీలించింది. అది తాత్కాలికమైనదన్న వాదనను అప్పట్లో తోసిపుచ్చింది. అందుకు అదే అధికరణలోని సబ్ క్లాజ్ 3ని ఉదాహరించింది. రాష్ట్ర రాజ్యాంగసభ సిఫార్సుతో రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడే 370 రద్దవుతుందని ఆ క్లాజ్ సారాంశం. 1957 తర్వాత రాజ్యాంగసభ ఉనికిలో లేదు గనుక ఇక దాని రద్దు అసాధ్యమని అప్పట్లో సుప్రీంకోర్టు భావించింది. అయితే రాజ్యాంగసభ రద్దుతో సబ్ క్లాజ్ 3 నిరర్థకమైపోయిందని, ఆ అధికారం రాష్ట్ర అసెంబ్లీకి దఖలు పడిందని తాజా తీర్పుల్లో న్యాయమూర్తులు భావించారు. రాష్ట్ర అసెంబ్లీ రద్దయింది గనుక గవర్నర్ సిఫార్సు సరిపోతుందని వారు అభిప్రాయపడ్డారు. కశ్మీర్‌లో ఎన్నికలు జరిపించాలని పిటిషనర్లు ఎవరూ కోరకపోయినా ఆ విషయాన్ని న్యాయమూర్తులు పరిగణనలోకి తీసు కున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోగా ఆ ప్రక్రియ పూర్తి కావాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. అంటే లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాకే అక్కడ అసెంబ్లీ ఎన్నికలుంటాయి.

రాజ్యాంగ నిర్ణాయక సభలో కూలంకషంగా చర్చించిన తర్వాతే వివిధ అధికరణలు రాజ్యాంగంలో చేరాయి. ఆ అధికరణలు చేర్చటంలోని అంతర్గత ఉద్దేశాలను అర్థం చేసుకోవటానికి ఆ చర్చలు దోహదపడతాయి. అయితే దేశ కాలమాన పరిస్థితుల్లో వచ్చే మార్పులు న్యాయమూర్తుల దృక్పథాలను నిర్దేశిస్తాయి. ఆ అధికరణలకు కొత్త చేర్పులు తీసుకొస్తాయి. వాటి పరిధి విశాలమవుతుంది. లేదా వాటి రద్దు సబబే అనిపించవచ్చు. ఏదేమైనా కేంద్రం ఈ నిర్ణయానికి ముందు అక్కడి ప్రజానీకాన్ని, మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితరులను కూడా సంప్రదిస్తే బాగుండేది. వీరంతా భారత్‌లో కశ్మీర్ విడదీయరాని భాగమని దృఢంగా విశ్వసిస్తున్నవారు. వర్తమాన పరిస్థితుల్లో సత్వర నిర్ణయం అవసరమని కేంద్రం భావించివుండొచ్చు. ఇప్పటికైనా ఆ ప్రాంతప్రజల అపోహలు తొలగించే కృషి మొదలుకావాలి. కశ్మీర్ అభివృద్ధి సాకారం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** అమావాస్య తె.5.13 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి మార్గశిర శుక్ల పాడ్యమి, **నక్షత్రం:** అనూరాధ ప.12.03 వరకు తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.5.36 నుండి 7.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.34 నుండి 9.22 వరకు, తదుపరి రా.10.37 నుండి 11.25 వరకు, **అమృతఘడియలు:** రా.3.11 నుండి 4.46 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఐక్యతకు బలం చేకూర్చిన తీర్పు!

అభిప్రాయం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

ఆర్టికల్ ‘370, 35ఎ’ల రద్దుపై భారత సర్వోన్నత న్యాయస్థానం డిసెంబరు 11న ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు దేశ సార్వభౌమాధికారం, సమగ్రతలను నిర్ద్వంద్వంగా సమర్థించింది. ఈ మేరకు 2019 ఆగస్టు 5 నాటి నిర్ణయం రాజ్యాంగ సమగ్రతను మరింత పటిష్ఠం చేసేదే తప్ప దెబ్బ తీసేది ఎంతమాత్రం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతే కాకుండా ఆర్టికల్ 370 కి స్వాభావిక శాశ్వతత్వం లేదనే వాస్తవాన్ని కూడా కోర్టు గుర్తించింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తాజా తీర్పుతో ‘ఒకే భారతం–శ్రేష్ఠ భారతం’ స్ఫూర్తి మరింత బలోపేతమైంది. ఐక్యతా బంధం, సుపరిపాలనపై ఉమ్మడి నిబద్ధతకు నిర్వచనం ఇదేనని గుర్తు చేసిన ఈ తీర్పు ప్రతి భారతీయుడూ గర్వించదగినది.

జమ్ము, కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలు ప్రకృతి సౌందర్యానికి నిలయాలు. నిర్మలమైన లోయలు, గంభీర పర్వతాలతో కూడిన ప్రాకృతిక వైభవం అనాదిగా కవులు, కళాకారులను ఉత్తేజితం చేయడమే కాకుండా సాహసికుల హృదయాలను కూడా దోచుకుంది. ఆకాశాన్నంటే హిమాలయ సోయగం నడుమ సౌందర్య–అద్భుతాల సంగమంగా ఈ ప్రదేశం అలరారేది. కానీ, ఈ స్వర్గం ఏడు దశాబ్దాలపాటు అత్యంత దారుణ హింస, అస్థిరతలకు ఆలవాలమై ప్రకృతి ప్రేమికులకు, సౌందర్య ఆరాధకులకు నరకంగా పరిణమించింది.

దురదృష్టవశాత్తూ శతాబ్దాల పాటు సాగిన వలసపాలన వల్ల... ముఖ్యంగా మానసిక, ఆర్థిక అణచివేత ఫలితంగా మనం ఒక రకమైన అస్తవ్యస్త సమాజంగా మారిపోయాం. అనేక ప్రాథమిక అంశాలపై సుస్పష్ట వైఖరి కొరవడి, ద్వంద్వత్వాన్ని అనుమతించడంతో అది మనల్ని మరింత గందరగోళంలోకి నెట్టింది. ఈ దురదృష్టకర పరిణామాలకు జమ్మూ కశ్మీర్ ప్రధాన బాధితురాలుగా మిగిలింది. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ జాతీయ సమైక్యత దిశగా నవ్యారంభాన్ని ఎంచుకునే అవకాశం మనకు దక్కింది. కానీ, మనం దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు బదులు అస్తవ్యస్త సమాజ విధానాల కొనసాగింపునకే నిర్ణయించుకున్నాం.

నా జీవితంలో చిన్న వయసు నుంచే జమ్మూ–కశ్మీర్ సమస్యతో నేను ఒకవిధంగా ముడిపడి ఉన్నాను. కానీ, దీన్ని కేవలం రాజకీయ సమస్యగా కాకుండా సామాజిక ఆకాంక్షలు తీర్చే అంశంగా పరిగణించే సైద్ధాంతిక చట్రంలో నేనొకడిని. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో జరిగిందంతా అక్కడి ప్రజానీకానికి, మనదేశానికి ఘోర ద్రోహమని నేను దృఢంగా విశ్వసించాను. అందుకే ప్రజలకు వాటిల్లిన అన్యాయాన్ని సరిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని బలమైన సంకల్పం పూనాను. ఆ మేరకు జమ్మూ–కశ్మీర్ ప్రజల కష్టాలు తీర్చేందుకు అవిరళంగా శ్రమించాలని నిశ్చయించుకున్నాను. ఆ క్రమంలో ఆర్టికల్ 370, 35(ఎ) ప్రధాన అవరోధాలు అయ్యాయి. అవి దుర్భేద్యమైన అడ్డుగోడల్లా తోచాయి. మరోవైపు బాధితులంతా పేదలు, అణగారిన వర్గాలవారు. ఈ పరిస్థితుల నడుమ ఈ రెండు రాజ్యాంగ నిబంధనల వల్ల భారతీయులందరికీ లభించే హక్కులు, ప్రగతి కశ్మీర్ ప్రజలకు దక్కవన్నవి సుస్పష్టం. ఫలితంగా ఒకే దేశంలోని పౌరుల మధ్య అగాధం ఏర్పడింది. పర్యవసానంగా జమ్మూ కశ్మీర్ ప్రజల బాధలు తెలిసి, అక్కడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని భావించిన ఇతర పౌరులు కూడా నిస్సహాయులుగా మిగిలిపోయారు.

ఈ సమస్యను కొన్ని దశాబ్దాలుగా నిశితంగా పరిశీలించిన ఓ కార్యకర్తగా దాని లోతుపాతులు, సంక్లిష్టతలపై నాకు క్షుణ్ణమైన అవగాహన ఉంది. ఏదేమైనా ఒక విషయంలో మాత్రం నాకు తిరుగులేని స్పష్టత ఉంది. అదేమిటంటే– జమ్మూ–కశ్మీర్ ప్రజలు ప్రగతిని కోరుకుంటున్నారు. తమ శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని కూడా ఆకాంక్షిస్తున్నారు. తమ భవిష్యత్తరానికి మెరుగైన జీవన నాణ్యతను, హింస–అనిశ్చితి రహిత జీవనాన్ని కూడా ప్రగాఢంగా వాంఛిస్తున్నారు. ఇలాంటి పరిణామాల మధ్యన జమ్మూ–కశ్మీర్ ప్రజలకు సేవలందించడంలో మూడు ప్రధానాంశాలకు మేం ప్రాధాన్యమిచ్చాం. ఆ మేరకు పౌరుల సమస్యలను అవగతం చేసుకోవడం, చేయూత ద్వారా విశ్వాసం పెంచడం, ముమ్మార్తులా అభివృద్ధి ప్రాథమ్యం కల్పించడంపై నిశితంగా దృష్టి సారించాం.



దేశంలో మేం 2014లో అధికారంలోకి రాగానే... జమ్మూ–కశ్మీర్ ప్రగతి పయనాన్ని మరింత వేగిరపరచేందుకు మా ప్రభుత్వంలోని మంత్రులు తరచూ అక్కడికి వెళ్లి ప్రజలతో నేరుగా సంభాషించాలని మేం నిర్ణయించుకున్నాం. దీంతో అక్కడ సుహృద్భావం పెంపొందించడంలో ఈ పర్యటనలు కీలకపాత్ర పోషించాయి. ఈ మేరకు 2014 మే నెల నుంచి 2019 మార్చి వరకు 150 దఫాలకు పైగా మంత్రులు పర్యటించడం మునుపెన్నడూ లేని రికార్డు. ఇక ప్రత్యేక ప్యాకేజీతో జమ్మూ–కశ్మీర్ అభివృద్ధి అవసరాలు తీర్చే దిశగా 2015లో ఒక ముఖ్యమైన ముందడుగు పడింది. ఇందులో మౌలిక సదుపాయాల నిర్మాణం, ఉద్యోగ–ఉపాధికల్పన, పర్యాటకానికి ప్రోత్సాహం, హస్తకళల పరిశ్రమకు మద్దతు వంటి కార్యక్రమాలున్నాయి.

జమ్మూ–కశ్మీర్‌లో యువత కలలను రగిలించగల శక్తి క్రీడలకు ఉందన్న వాస్తవాన్ని గుర్తించి దాన్ని సద్వినియోగం చేసుకున్నాం. ఈ మేరకు వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించాం. వారి ఆకాంక్షలు–భవిష్యత్తుపై ఈ క్రీడల పరివర్తనాత్మక ప్రభావాన్ని మేం ప్రత్యక్షంగా చూశాం. క్రీడా వేదికల మెరుగుతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి శిక్షకులను అందుబాటులో ఉంచాం. స్థానిక ఫుట్‌బాల్ క్లబ్బుల ఏర్పాటును ప్రోత్సహించడం మేం చేపట్టిన అత్యంత ప్రత్యేక చర్యలలో ఒకటి. దీని ఫలితాలు అత్యద్భుతం. వీటిద్వారా ఎందరో యువతీయువకులు పటిష్ఠ శిక్షణతో ప్రతిభావంతులైన క్రీడాకారులుగా వెలుగులోకి వచ్చారు. వీరిలో అఫ్షాన్ ఆషిఖ్ పేరు నాకింకా గుర్తుంది. ఎందుకంటే– 2014 డిసెంబరు నాటికి శ్రీనగర్‌లో రాళ్లు విసిరే అల్లరిమూకలో ఆమె ఒకరుగా ఉండేది. అయితే, సముచిత చర్యలు, ప్రోత్సాహంతో ఆ యువతి ఫుట్‌బాల్ వైపు మళ్లి జాతీయ స్థాయిలో పేరుప్రతిష్ఠలు సంపాదించింది. ఆ తర్వాత యువతరంతో సుదృఢ భారతం కార్యక్రమం సందర్భంగా ఓసారి నేను ఆమెతో సంభాషించినట్లు నాకిప్పటికీ గుర్తుంది.

ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధిలో పంచాయతీ ఎన్నికలు ఒక మేలిమలుపు. మరోసారి మేం అధికారంలో కొనసాగడం లేదా మా సిద్ధాంతాలకు కట్టుబాటు... అనే వాటిలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నాం. మాకు ఇదేమంత కఠినమైనది కాదు. అధికారం వదులుకున్నా, సిద్ధాంతాలను నిలబెట్టుకున్నాం. ఆ మేరకు జమ్మూ ప్రజల ఆకాంక్షలు, కశ్మీర్ ప్రగతికే అత్యంత ప్రాధాన్యమిచ్చాం. పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి కావడం అక్కడి ప్రజల ప్రజాస్వామిక స్వభావాన్ని స్పష్టం చేసింది. గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులతో సంభాషించాలని నా మనస్సుకు తోచింది. ఈ సందర్భంగా ఇతరత్రా సమస్యలపై మాట్లాడటంతో పాటు నేను వారికొక అభ్యర్థన చేశాను. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలను తగులబెట్ట రాదని, ఈ వాగ్దానానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశాను. ఆ తర్వాత వారు తమ హామీని నిలబెట్టుకోవడం నన్నెంతో ఆనందింపజేసింది. పాఠశాలలు తగుల బడితే అందరి కన్నా ఎక్కువగా బాధపడేది పసివాళ్లే!

ఈ నేపథ్యంలో ఆగస్టు 5వ తేదీ ఒక చరిత్రాత్మక దినంగా ప్రతి భారతీయుడి హృదయంలో నాటుకుపోయింది. ఆ రోజున ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ మన పార్లమెంటు చారిత్రక నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌లలో పెనుమార్పులు వచ్చాయి. చివరకు 2023 డిసెంబరులో న్యాయస్థానం తీర్పు దాన్ని బలపరచింది. ఈ మూడు ప్రదేశాల్లో అభివృద్ధిని చూశాక నాలుగేళ్ల కిందటి పార్లమెంటు నిర్ణయంపై ప్రజాకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ప్రతిధ్వనింపజేసింది. రాజకీయాల స్థాయిలో గత 4 ఏళ్లుగా క్షేత్రస్థాయిన ప్రజా స్వామ్యంపై సరికొత్త విశ్వాసం పునరుద్ధరించబడింది. అంతకు ముందు సమాజంలోని మహిళలు, గిరిజనులు, ఎస్సీ/ఎస్టీ, అణగారిన వర్గాలకు దక్కాల్సిన ప్రయోజనాలు అందేవి కావు. అదే సమయంలో లద్దాఖ్ ఆకాంక్షలు పూర్తిగా విస్మరణకు గురయ్యాయి. అయితే, 2019 ఆగస్టు 5న ఈ పరిస్థితి సమూలంగా మారిపోయింది. ఇప్పుడు కేంద్ర చట్టాలన్నీ ఎలాంటి భయపక్షపాతాలూ లేకుండా అమలవుతున్నాయి. ప్రాతినిధ్యం మరింత పెరిగింది. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. అందరూ విస్మరించిన శరణార్థి సమాజాలు అభివృద్ధి ఫలాలను ఆస్వాదించడం ప్రారంభించాయి.

కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు సంతృప్త స్థాయికి చేరింది. మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక రంగానికి చేయూతతో కశ్మీర్ అందాలు ప్రతి ఒక్కరికీ మళ్లీ స్వాగతం పలుకుతున్నాయి. ఈ ఘనత సహజంగానే జమ్మూ–కశ్మీర్ ప్రజల దృఢ సంకల్పానికి దక్కుతుంది. ఈ మేరకు తాము ప్రగతి కాముకులం మాత్రమేనని, ఈ సానుకూల మార్పునకు చోదకులు కావడానికి సిద్ధంగా ఉన్నామని వారు పలుమార్లు నిరూపించుకున్నారు. గతంలో జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌ల పరిస్థితి ఒక ప్రశ్నార్థకంలా ఉండేది. కానీ, ఇప్పుడది ‘‘రికార్డు వృద్ధి, రికార్డు ప్రగతి, రికార్డు స్థాయిలో పర్యాటక ప్రవాహం’’తో ఆశ్చర్యార్థకానికి ప్రతీకగా మారింది.

జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌లలో ప్రతి బిడ్డ నేడు స్వచ్ఛమైన నేపథ్యంతో జన్మిస్తున్నాడు. అక్కడ అతను లేదా ఆమె శక్తిమంతమైన ఆకాంక్షలతో కూడిన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ప్రజల స్వప్నాలు నేడు గతానికి బందీలు కావు. భవిష్యత్తుకు బంగారుబాట పరిచే అవకాశాలు. అన్నింటికీ మించి భ్రమలు, నిరాశా నిస్పృహల స్థానంలో ఇప్పుడు అభివృద్ధి, ప్రజాస్వామ్యం, ఆత్మగౌరవం పరిఢవిల్లుతున్నాయి!

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

జవాబేదీ?!



సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వాదనలు... రెండూ కూడా ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానం ఇవ్వడంలో విఫలం అయ్యాయి. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని హఠాత్తుగా తొలగించి, రాత్రికి రాత్రి ఆ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చవలసిన అవసరం ఏమొచ్చిందన్నదే ఆ ప్రశ్న!

– సాగరికా ఘోష్, పాత్రికేయురాలు

అన్యాయం



పార్లమెంటులో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా మూజువాణీ ఓటు ద్వారా మహువా మొయిత్రాను అధికారికంగా లోక్‌సభ నుంచి బహిష్కరించారు. భద్రతా సిబ్బంది ఆమెను బయటికి ఈడ్చుకెళ్లారు. ఆ సమయంలో... లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్ మాత్రం గర్వంగా పార్లమెంటులో కూర్చొనే ఉన్నారు. మహిళా సాధికారతా... నువ్వెక్కడ?!

– రాధికా చౌదరి, పొలిటికల్ కామెంటేటర్

అంతటా మనవాళ్లే



మన విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు ప్రతిభకు రిజర్వాయర్లు. వివిధ రంగాలలో జాతీయంగా, అంతర్జాతీయంగా గట్టి పట్టును కలిగి ఉన్నవారు. పూర్వ విద్యార్థుల సంఘాలతో కలిసి మీరంతా ఒక సమాఖ్యను ఏర్పరచుకోవాలని నేను కోరుతున్నాను. (ఐఐటీ–ఐఎస్ఎమ్, ధన్‌బాద్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ).

– జగదీప్ ధన్‌ఖడ్, భారత ఉపరాష్ట్రపతి

విక్రమార్కుడు



ప్రసిద్ధ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు హాజరై.. 1) అయోధ్యలో రామ మందిరానికి వ్యతిరేకంగా, 2) ట్రిపుల్ తలాఖ్ నిషేధానికి వ్యతిరేకంగా, 3) అలహాబాద్ హైకోర్టు ప్రాంగణం నుండి మసీదు అక్రమ తొలగింపునకు వ్యతిరేకంగా, 4) జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా... హోరాహోరీగా పోరాడారు. కానీ ఒక్క కేసులోనూ ఆయన గెలవలేకపోయారు.

– అన్షుల్ సక్సేనా, సామాజికాంశాల వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

యుద్ధాన్ని ఎందుకు విరమించారు?

ఈ నెల 6న పార్లమెంట్‌లో ఆమోదం పొందిన రెండు బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... ‘జమ్మూ–కశ్మీర్ శాసనసభలో పీఓకేకు 24 స్థానాలూ, కశ్మీరీ నిర్వాసితులకు 2, పీఓకే నిర్వాసితులకు ఒకటి కేటాయించాం. తొలి ప్రధాని నెహ్రూ తప్పులు కశ్మీర్ ఉగ్ర–వేర్పాటువాదాలకూ, పీఓకే పుట్టుకకూ కారణం. మన సైన్యం పాక్ సేనను తరుముతూ 3 రోజుల్లో కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోనుండగా యుద్ధం విరమించారు. అనవసరంగా, హడావిడిగా కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితి (ఐరాస)కి చేర్చారు. 70 ఏళ్ళుగా హక్కులు పోయి అన్యాయానికి గురైన కశ్మీరీలకు న్యాయం చేకూర్చడమే ఈ బిల్లుల ఉద్దేశం’ అన్నారు. దీంతో అనుపమ్ ఖేర్ లాంటి వలస కశ్మీరీ పండితులు, వైదికవాదులు కశ్మీరీ ప్రజాప్రతినిధులు కాగలరు. ‘కశ్మీర్ ఫైల్స్’ సినిమా ప్రయోజనమూ నెరవేరగలదు.

అమిత్ షా మాట్లాడిన మాటల్లో ఒక్కటీ నిజం కాదు. నిజానికి నెహ్రూ వల్లనే కశ్మీర్ ఇండియాలో కలిసింది. దాన్ని ఇండియాలో కలిపేందుకు షేక్ అబ్దుల్లాను ఒప్పించారు. నెహ్రూ మంత్రివర్గ నిర్ణయం ప్రకారం హోం మంత్రి పటేల్ విన్నపానికి 566 సంస్థానాల్లో 563 ఇండియాలో కలిశాయి. జమ్ము–కశ్మీర్, హైదరాబాద్, జునాగఢ్ మిగిలాయి. పాక్ సరిహద్దు జమ్మూ–కశ్మీర్, సముద్ర సరిహద్దులోని జునాగఢ్‌లను పాక్‌కు ఇచ్చి, దేశం మధ్యలోనున్న హైదరాబాద్‌ను ఇండియాలో కలపాలని పటేల్ ప్రతిపాదించారు. తన చిరకాల వాంఛకు విరుద్ధమైన ఈ ప్రతిపాదనను నెహ్రూ ఆమోదించలేదు. కశ్మీర్ యుద్ధ విరమణ సమయంలో మన సైన్యం పూంఛ్, రాజౌరీ ప్రాంతాలను రక్షిస్తూ ఉంది. విరమణ ప్రకటించకుంటే ఈ ప్రాంతాలు పాక్ అధీనమయ్యేవి.

పఠాన్ లష్కర్ల గిరిజన చొరబాటు పేరుతో పాక్ సైన్యానికి భారత సేనకు మధ్య యుద్ధం జరిగింది. పాక్ ముందుగానే పాత రోడ్లను బాగు చేసి, కొత్త రోడ్లను నిర్మించి సైన్యాల తరలింపునకు ఏర్పాట్లు చేసుకోవడం వల్ల వేలాది సైనికులు కశ్మీర్‌లోకి ప్రవేశించారు. భారతీయ సైన్యం చేరడానికి సరైన రవాణా మార్గం లేక తక్కువ సైనికులే చేరారు. నానాటికీ పెరిగిన పాక్ సైన్యం మొత్తం కశ్మీర్‌ను ఆక్రమించే పరిస్థితి దాపురించింది. ఈలోపు ఇండియాను ప్రతివాదిని చేస్తూ పాక్ ఐరాసకు పోవచ్చు.

1947 డిసెంబర్ 8న నెహ్రూ చాకచక్యంగా ఈ అవకాశాన్ని కాల్పుల విరమణ ప్రకటించి అడ్డుకున్నారు. ఆ తర్వాత ఐరాసకు కశ్మీర్ సమస్యను తీసుకెళ్లారు. నెహ్రూ అనుమానించినట్లే అమెరికా పక్షపాతి అయిన ఐరాస భారత్‌కు న్యాయం చేయలేదు.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అభివృద్ధికి కీలకం... వికేంద్రీకరణ

ఏ రాష్ట్రమైనా సుసంపన్నం కావాలంటే పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠపరచాలి. మొత్తంగా దేశం అభివృద్ధి పంచాయతీ రాజ్ వ్యవస్థ బలంపైనా, అది ఏ మేర పాలనను వికేంద్రీకరిస్తుంది అన్న అంశాల పైనా ఆధారపడి ఉంటుంది. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉండగా పంచాయతీరాజ్ వ్యవస్థలోని ప్రాథమిక స్థాయి సంస్థలకు అధికారాలు ఇవ్వడం ఎంత ముఖ్యమో గుర్తించారు. స్థానిక సంస్థలకు అధికారాలు పంచడం కోసం రాజ్యాంగ సవరణకు సైతం వెనుకాడలేదు. ఫలితంగా 1993లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కొత్త పంచాయతీరాజ్ వ్యవస్థ రూపు దిద్దుకొంది. ఈ వ్యవస్థే గత 30 ఏళ్లుగా కేరళతో పాటు అనేక రాష్ట్రాల్లో అద్భుత ఫలితాలను ఇచ్చింది.



కేరళ వంటి రాష్ట్రాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అక్కడి చైతన్యవంతమైన పంచాయతీ వ్యవస్థ ముఖ్య కారణం. గ్రామ పంచాయతీ స్థాయిలోనే పాలన సమర్థంగా అందడం, మరికొన్ని ఇతర అంశాలు దీనికి కారణం. మన తెలుగు రాష్ట్రాలు కూడా ఈ సంస్థల బలోపేతం, పాలన వికేంద్రీకరణ అంశాల్లో ముందు వరుసలోనే ఉన్నాయి.

పరిమితమైన వనరులను దృష్టిలో పెట్టుకుంటే గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కాదు. ఫైనాన్స్ కమిషన్ నుంచి పంచాయతీలకు అందే నిధులు కూడా అంతంత మాత్రమే. ఎందుకంటే ఈ నిధులు తలసరి లెక్కలో విడుదల అవుతూంటాయి. పోనీ పంచాయతీలు సొంతంగా ఏవైనా వినూత్నమైన ఆదాయ వనరులను సమకూర్చుకోగలవా? ఇది కూడా వీలు కాని విషయమే. ఇలా చేసుకోగలిగితే ఆ గ్రామ పంచాయతీ చాలా చైతన్యవంతంగా పనిచేస్తున్నట్లు లెక్క. కేరళలో కొన్ని గ్రామ పంచాయతీలు వినూత్నమైన పద్ధతుల ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సంపాదిస్తూండటం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

2030 నాటికి ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అందుకునేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గ్రామ పంచాయతీల బలోపేతం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ఆర్థిక సహకారం, పాలన పరంగా స్వాతంత్ర్యం కూడా అవసరమవుతాయి. వీటితోపాటు గ్రామ పంచాయతీల స్థాయిలో సామర్థ్యాలను పెంచుకోవాల్సి వస్తుంది. రాష్ట్రంలో సమర్థమైన, వికేంద్రీకృతమైన పరిపాలన సాగేందుకు కింది సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

దీనివల్ల మానవ వనరుల అభివృద్ధి కూడా సాధ్యమవుతుంది. ‘2022 నేషనల్ కెపాసిటీ బిల్డింగ్ ఫ్రేమ్‌వర్క్’ ఇచ్చిన సలహా సూచనల సాయంతో పనులు చేపట్టాలి. ప్రణాళిక రూపకల్పన, అమలులో గ్రామ పంచాయతీల్లోని ప్రజలందరూ భాగస్వాములయ్యేలా చూడాలి. ఇందుకు తగ్గట్టుగా గ్రామ పంచాయతీలకు అవసరమైన సాధన సంపత్తిని సమకూర్చాలి. దాతృత్వ సంస్థల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఈ చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రాలు సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించగలవని నా విశ్వాసం.

– డా॥ డబ్ల్యూ. రాంపుల్లా రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి,
ఎన్ఐఆర్‌డీ మాజీ డైరెక్టర్ జనరల్

ప్రేమపాశ బద్ధుడు

చిన్ని కృష్ణయ్య ఈ క్షణం ఈ ఇంట్లో ఉంటే, మరో క్షణం మరో ఇంట్లో ప్రత్యక్షమయ్యేవాడు. ఒకరోజు పక్కింట్లో రోలు తిరగేసి ఎక్కి ఉట్టి మీద వెన్న తీస్తుండగా యశోదమ్మ చూసింది. బెత్తం పట్టుకుని నల్లన్నయ్యని ‘నువ్వు ఇంతవరకు ఎవరికీ చిక్కలేదనీ, నిన్ను ఎవరూ శిక్షించలేరనీ అనుకుంటున్నావు. ఇవాళ ఎలా తప్పించుకుంటావో చూస్తాను’ అంటూ బెదిరించింది.

జ్యోతిర్మయం

అంతలోనే పెల్లుబికిన మాతృ హృదయం! ‘ఇతడిని పసి వాడనుకుందామా అంటే ఒకోసారి ఇలాంటి నడవడిక పెద్దవాళ్లకు కూడా ఉండదు. తన నెవరైనా చూస్తే పారిపోవాలని కూడా తెలియని అమాయకుడు. భయం అనేది ఒకటి ఉంటుందని కూడా ఇతనికి తెలియదు. ఎలా దారికి తేవాలి? అప్పుడప్పుడు దెబ్బలు తగలనిస్తూ ఉండాలి. దుండగులైన పిల్లలకు దండోపాయమే సరి’ అనుకుంటూ ‘ఆగు, ఆగు’అంటూ బెత్తం ఝళిపించింది.

కృష్ణుడు భయపడ్డట్లు ముఖం పెట్టికాలి గజ్జెలు ఘల్లు ఘల్లుమంటుంటే పారిపోసాగాడు. యశోదా దేవి బాలుని వెంట పరుగెత్తింది. నడక వేగానికి ఆమె కొప్పు జారిపోయింది. ముఖం నిండా చెమటలు! ఆ లీలా విలాసుని పట్టాలనే పట్టుదలతో వెంటబడి తరమగల్గిన యశోద ధన్యజీవి! మనోజ్ఞ దృశ్యమిది! ‘ఈ ఒక్కసారికి క్షమించ’మని దొంగ కన్నీళ్ళతో ఏడుస్తున్న కృష్ణుని యశోద ఎలాగైతేనేం పట్టుకుంది. ‘ఎక్కడ బడితే అక్కడ తిరుగుతూ ఉంటావు. ఒకచోట కుదురుగా ఉండవు’ అంటూ మందలిస్తున్నట్లు అన్న మాటల్లో దేవదేవుని సర్వాంతర్యామిత్వాన్ని చెప్పకనే చెప్పింది. తనకు తెలియకుండానే దశావతారాలను స్మరించింది. కృష్ణుని రోటికి కట్టడానికి యశోద ఎంత తాడు తెచ్చినా అది రెండంగుళాలు తక్కువవుతూ వచ్చింది. శ్రమ వల్ల ఆమెకు చెమట పట్టింది. ఆ తాడు సాధారణమైనది కాదు. అది ప్రేమ పాశం. భగవంతుడు నిష్కల్మష ప్రేమకు వశుడవుతాడు. ఎవరికీ చిక్కని కన్నయ్య యశోదమ్మకు చిక్కాడు!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

ద్రాక్షారామ క్షేత్రం.. జనసంద్రం

- భీమేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు
- లక్ష మందికి పైగా వచ్చారని అంచనా


శ్రీ భీమేశ్వరస్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తజన సంద్రమే అయ్యింది. పవిత్ర కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చారని అధికారులు అంచనా వేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తొలుత క్షేత్ర పాలకుడైన శ్రీ లక్ష్మీనారాయణస్వామిని, అనంతరం శ్రీ భీమేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములు ఆచరించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఆవు నేతి దీపాలు వెలిగించారు. భక్తుల ఏర్పాట్లను ఈఓ పితాని తారకేశ్వరరావు పర్యవేక్షణలో స్థానిక, ఇతర ఆలయాల నుంచి వచ్చిన సిబ్బంది పర్యవేక్షించారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మాదిగలను గుర్తించింది సీఎం జగనే

- ఈ ప్రభుత్వంలోనే చర్మకారులకు సంక్షేమం
- రాజకీయ ఆత్మీయ మహాసభలో మంత్రి సురేష్

అమలాపురం రూరల్: స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి గత 75 ఏళ్ల చరిత్రలో మాదిగలకు సామాజిక, రాజకీయ గుర్తింపు లభించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనేనని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. అమలాపురం పట్టణం శివారు కొంకాపల్లి సత్తెమ్మ గుడి ప్రాంగణంలో సోమవారం జరిగిన మాదిగలు, ఉప కులాల రాజకీయ ఆత్మీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా, చర్మకారులకు జగన్ ప్రభుత్వంలోనే పెన్షన్ తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. ఇంతటి గుర్తింపునిచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను మాదిగలు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు. మరో అతిథి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ, సామాన్య కార్యకర్తనైన తనను ఓ ఎంపీగా పార్లమెంటుకు పంపించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గడచిన ఏడున్నర దశాబ్దాల చరిత్రలో ఏ రాజకీయ పార్టీ మాదిగలను చట్టసభలకు పంపించలేదని గుర్తు చేశారు. అటువంటి చరిత్రను ముఖ్యమంత్రి జగన్ తిరగరాస్తూ తనను ఎమ్మెల్సీగా ఎంపిక చేసి, శాసన మండలికి పంపించారని అన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ కాకిమాను రాజశేఖర్, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా కూడా ప్రసంగించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయతను, ఐక్యతను చాటారు. తొలుత సభా వేదికపై బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు మంత్రి సురేష్, ఎంపీ సురేష్ పూలమాలలు వేసి, మహాసభను ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞత చాటారు. అనంతరం మంత్రి సురేష్, ఎంపీ సురేష్‌లను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ గజమాలలతో సత్కరించారు. ఇజ్రాయిల్ ఆధ్వర్యాన జరిగిన ఈ మహాసభలో మాదిగ నాయకులు చెట్ల సత్యనారాయణ, మడికి శ్రీరాములు, ఆకుమర్తి సత్యనారాయణ, లూటుకుర్తి సత్యనారాయణ, పెదపూడి ఏడుకొండలు, మోకాటి దుర్గారావుతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో అదరగొట్టిన 'వందన'

నాలుగు పతకాలు కైవసం


సాధించిన పతకాలతో వందన

అమలాపురం టౌన్/అల్లవరం: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ (ఆసియా) పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మద్దాలవారిపేటకు చెందిన పిల్లి వందన సత్తా చాటింది. ఒక రజత, మూడు కాంస్యం కలిపి ఏకంగా నాలుగు పతకాలు సాధించింది. మలేషియాలోని జోహోర్ బారూలో జరుగుతున్న 2023 ఏషియన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా తరఫున వందన పాల్గొంది. సబ్ జూనియర్స్ 84 కేజీల కేటగిరీలో ఓవరాల్‌గా తృతీయ స్థానం కైవసం చేసుకుని కాంస్య పతకం సాధించింది. పవర్ లిఫ్టింగ్ స్క్వాట్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. అలాగే బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ విభాగాల్లో తృతీయ స్థానాలు సాధించి కాంస్య పతకాలు దక్కించుకుంది. అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన వందన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సాయిబాబా అమలాపురంలో నివాసం ఉంటున్నారు. వెంకటలక్ష్మి దేవగుప్తం హైస్కూలులో టీచర్‌గా పని చేస్తున్నారు. సాయిబాబా ఇక్కడే ఒక ప్రైవేటు స్కూలులో పని చేస్తున్నారు. భీమవరంలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న వందన.. అమలాపురంలోని హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందింది. అంతర్జాతీయ స్థాయిలో తన కుమార్తె విజయం సాధించడంతో వెంకటలక్ష్మి తన పాఠశాలలో స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. వందన ఈ నెల 16న మలేషియా నుంచి సొంతూరు అమలాపురం చేరుతుందని హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. వందనను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ అభినందించారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోనసీమ ప్రాంతానికి ఆమె ఓ గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

వైవిధ్యాలయం

నీకు వందనం


ఎం.బండపల్లె హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఇంటర్ తరగతులు బోధిస్తున్న అధ్యాపకురాలు

బడిలో..గుడిలో.. అక్షర మడిలో.. వెతల జడిలో..వెలుగుల కాగడా.. మూసపద్ధతిపై కొరడా.. వైవిధ్య సవ్వడి.. వెరసి.. బాలికల్లో చదువుల ఒరవడి. విద్యావ్యవస్థలో నూతన ఒరవడులకు శ్రీకారం చుడుతోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సర్కారు స్కూళ్లలో ఆంగ్లమాధ్యమం, హైస్కూలు ప్లస్ తదితర విధానాలను అమలు చేసింది. ఈ విధానాలు సఫలీకృతం కావడంతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ చేకూరుతోంది. వైవిధ్యమైన హైస్కూలు ప్లస్ విజయవంతంపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

హైస్కూల్ ప్లస్ పాఠశాలలు	35
ఎంపీసీ గ్రూపులో బాలికలు	396
బైపీసీ గ్రూపు చదువుతున్న వారి సంఖ్య	315
సీఈసీ చదువుతున్న బాలికలు	314
మొత్తం	1,025


చదువుకుంటున్న విద్యార్థినులు

- బాలికలకు ప్రత్యేకంగా ఇంటర్ విద్య
- సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ నిర్ణయం
- సొంతూరిలోనే బాలికలకు ఇంటర్ విద్య

చిత్తూరు కలెక్టరేట్ : హైస్కూల్ ప్లస్ విధానంలో బాలికలకు ఉన్న ఊళ్లల్లోనే ఇంటర్మీడియట్ విద్య ను అందిచాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆశయం. ఇందుకు అనుగుణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 35 ఉన్నత పాఠశాలలను గుర్తించి హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. 2022–23 విద్యాసంవత్సరంలో ఈ విధానాన్ని అమలు చే సింది. సంబంధిత పాఠశాలల్లో ఇంటర్ విద్యకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రవేశపెట్టింది. ఆ గ్రూపుల బోధన కు అధ్యాపకులను సైతం నియమించింది. ఆ యా కోర్సుల విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేసింది. ఫలితంగా ఆ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 489 మంది, ద్వితీయ సంవత్సరం 536 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభు త్వం తీసుకున్న ఈ చర్యలతో బాల్య వివాహాలు, పదో తరగతి పూర్తవగానే పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపడం వంటి వాటికి ఫుల్‌స్టాప్ పడింది. మరోవైపు ఇంకో రెండేళ్ల పాటు చదువుకునే అవకాశం దక్కుతోందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు.

గత పాలనలో దయనీయం

'బాలికల చదువు భవితకు వెలుగు' అన్నది నానుడి. ఇందుకు అనుగుణంగా ప్రస్తుతం పలువురు తల్లిదండ్రులు బాలికల చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే అనేక గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో మాత్రం ఈ పరిస్థితి ఉండడం లేదు. నిర్ణీత విద్యాభ్యాసం పూర్తయితే చాలు.. అత్తారింటికి పంపించి, తమ బరువు, బాధ్యతలు దించుకుందామనే ఆలోచనలో ఉంటారు. దీనికి అంతంత మాత్రంగా ఉండే కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆడపిల్లకు చదువెందుకనే ధోరణి, తమ గ్రామానికి కళాశాలలు దూరంగా ఉండడం, కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు ఏవైనా దుర్ఘటనలు చోటు చేసుకుంటే గ్రామంలో తలెత్తుకోలేమనే భయం.. ఇలా అనేక కారణాలున్నా యి. కొన్ని గ్రామల్లో పదో తరగతి చదివితే చా లు.. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసే దయనీయ పరిస్థితులున్నాయి. మరికొంత మంది చదువు మాని పించి, టైలరింగ్, కూలి తదితర పనులకు పంపించి, వరుడు దొరికితే వివాహాలు చేసేవారు. దీంతో పదో తరగతి చదువుకున్నా ఆ అమ్మాయి కి ఎటువంటి ఉపయోగమూ ఉండేది కాదు.

మార్పు వచ్చింది

ఉన్న ఊళ్లోనే ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఈ పరిస్థితి మారుతుందని ప్రభు త్వం భావించింది. పదో తరగతి పూర్తయిన వెంటనే అదే పాఠశాలలో ఇంటర్ రెండో సంవ త్సరం వరకూ చదువుకునే వెసులుబాటు కల్పించింది. అవసరమైన అన్ని వసతులూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్ చదివేందుకు ఉన్న ఊరు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో ప్రభుత్వం భావించినట్టుగానే తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో మా ర్పు వచ్చింది. గ్రామంలోనే కళాశాల ఉండడంతో తమ కుమార్తెలను మరో రెండేళ్ల పాటు ఇంటర్ చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ పూర్తయ్యాక 'ఇంత చదువు చదివింది కదా.. మధ్యలో ఆపడం ఎందుక'ని డిగ్రీ చదివేందుకు కూడా అడ్డు చెప్పడం లేదు. ఫలితంగా ఇంజినీరింగ్ వంటి ఉన్న విద్యను అభ్యసిస్తున్న బాలికలు ఉద్యోగాలు సైతం పొందుతున్నారు. అనంతరం కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడమే కాకుండా విద్యావంతులుగా రాణిస్తున్నా రు. ఫలితంగా వారికి ఆర్థి స్వాతంత్ర్యం లభిస్తోంది. ఈ పరిణామం జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు, విద్యార్థినులు, విద్యావేత్తల్లో ఆనందంనింపుతోంది.

తిరుపతి జిల్లాలోని పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌ను గత విద్యాసంవత్సరంలో హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టి, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. గతంలో ఆ మండలంలో బాలికల ప్రభుత్వ కళాశాలకు వెళ్లాలంటే 25 కిలోమీటర్ల దూరంలోని నగరి, పుత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. అంత దూరం బాలికలను పంపడం ఇష్టం లేక తల్లిదండ్రులు చదువు మాన్పించేవారు. నేడు పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్ గా అప్‌గ్రేడ్ చేయడంతో బాలికల అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి.

చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె జెడ్పీ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇంటర్ చదవాలంటే గతంలో ఆ గ్రామం నుంచి చిత్తూరు, పూతలపట్టు మండల కేంద్రానికి విద్యార్థినులు వెళ్లాల్సిన పరిస్థితి. దూరాభారం అమ్మాయిలను పంపడం ఇష్టం లేని తల్లిదండ్రులు పదితో చదువు మాన్పించి, పెళ్లిళ్లు చేసేవారు. ఎం.బండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హైస్కూల్ ప్లస్ చేయడంతో పలువురు తమ కుమార్తెలను ఆ పాఠశాలలోనే ఇంటర్ చదివిస్తున్నారు.


తిరుపతి జిల్లా పిచ్చాటూరులోని జెడ్పీహైస్కూల్ ప్లస్ పాఠశాల



చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె హైస్కూల్ ప్లస్

ప్రభుత్వ ఆశయం నెరవేరింది



జిల్లాలోని పలు ప్రాంతాల్లో గతంలో పదో తరగతి పూర్తి కాగానే బాలికలకు పెళ్లిళ్లు చేసేసేవారు. ఆడపిల్ల కదా దూరాభారం చదువుకు ఎందుకు పంపేది అనే ధోరణి కొంత మంది తల్లిదండ్రుల్లో ఉండేది. ప్రభుత్వం హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో మార్పు వచ్చింది. హైస్కూల్ ప్లస్‌పై వేసవి సెలవుల్లో విస్తృతంగా క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. దీంతో అడ్మిషన్లు పెరిగాయి. ఈ విధానంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశయం నెరవేరింది. – విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ధోరణి మారింది



గతంలో పదో తరగతి పూర్తయ్యిందంటే చాలు అమ్మాయిలకు పెళ్లి సంబంధాలు వెతికేవారు. రాష్ట్ర ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ విద్యను ప్రారంభించాక తల్లిదండ్రుల ఆలోచన ధోరణిలో మార్పు వచ్చింది. అంత త్వరగా పెళ్లిళ్లు చేయడం ఎందుకని ఆలోచించడం మొదలుపెట్టారు. గ్రామంలోనే కళాశాల ఉంది కదా ఇంటర్ వరకు చదివించి ఆ తర్వాత ఉన్నత చదువులు చదివిద్దాం అని అనడం మొదలుపెట్టారు. – శేఖర్, డీఈఓ, తిరుపతి జిల్లా

ఎంతో ఉపయోగం



పదో తరగతి తర్వాత మమ్మల్ని బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడేవారు. ఇంటర్ చదవాలంటే దూర ప్రాంతం వెళ్లాల్సిందే. రోజూ వెళ్లి రావాలంటే రూ.100 ఖర్చవుతుంది. ఆర్థిక భారంతో పాటు, ఆడపిల్లనే భయంతో పదో తరగతి వరకు చాలు అని అనేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. నేను పదో తరగతి చదివిన హైస్కూల్‌లోనే ఇంటర్మీడియట్ పెట్టడంతో ఇక్కడే చేరాను. అధ్యాపకులు బాగా పాఠాలు చెబుతున్నారు. – చందు, విద్యార్థిని, ఎం.బండపల్లి, చిత్తూరు జిల్లా

క్యాంప్ కార్యాలయాలపై పిటిషన్‌ను నేనే విచారిస్తా

- రోస్టర్ ప్రకారం నా ముందుకొచ్చింది కాబట్టి నేనే ఉత్తర్వులిస్తా
- నా అంతట నేనుగా దీన్ని త్రిసభ్య ధర్మాసనానికి పంపను
- ప్రభుత్వానికి స్పష్టం చేసిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు
- కార్యాలయాల్ని ఇప్పటికిప్పుడు తరలించే వీలుందా?.. ఆ వివరాలు కోర్టు ముందుంచండి
- ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులకు న్యాయమూర్తి ఆదేశం.. విచారణ నేటికి వాయిదా



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలు గుర్తిస్తూ ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీచేసిన జీవో 2283ని సవాలు చేస్తూ రాజధాని రైతులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తాను విచారిస్తానని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ రిట్ పిటిషన్ విచారణార్హతపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తనముందు ఎలాంటి పిటిషన్ లేనందున, ఈ విషయంలో తానెలాంటి ఉత్తర్వులు జారీచేయడం లేదని చెప్పారు. రోస్టర్ ప్రకారం ఈ వ్యాజ్యం తన ముందుకొచ్చిందని, అందువల్ల తాను విచారించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో తాను ఈ వ్యాజ్యాన్ని త్రిసభ్య ధర్మాసనానికి నివేదించలేదని చెప్పారు. తాను ఈ రిట్ పిటిషన్‌ను విచారించడంపై అభ్యంతరముంటే త్రిసభ్య ధర్మాసనం లేదా ప్రధాన న్యాయమూర్తి(సీజే) దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులకు స్పష్టం చేశారు. అవసరమనుకుంటే పిటిషన్ కూడా దాఖలు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం సమయం కూడా ఇస్తానని తెలిపారు. ఏ క్షణమైనా విశాఖపట్నంలో క్యాంప్ కార్యాలయాలు ఏర్పాటు చేయవచ్చునని, అందువల్ల ఈ విషయంలో మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్లు కోరుతున్నందున.. క్యాంప్ కార్యాలయాల్ని ఇప్పటికిప్పుడు తరలించే అవకాశముందా? అన్న అంశంపై వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వి.మహేశ్వర్‌రెడ్డి, చింతల సుమన్‌లను న్యాయమూర్తి ఆదేశించారు. విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకెళతాం..

జీవో 2283ను రద్దుచేయాలని, అప్పటివరకు ఆ జీవో అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం మరోసారి విచారించారు. రోస్టర్ ప్రకారం ఈ వ్యాజ్యం తన ముందుకొచ్చిందని, అందువల్ల తాను విచారించి తగిన ఉత్తర్వులిస్తానని చెప్పారు. తనంత తానుగా ఈ వ్యాజ్యాన్ని త్రిసభ్య ధర్మాసనానికి నివేదిస్తూ ఎలాంటి ఉత్తర్వులివ్వబోనని తెలిపారు. అలాగైతే ఈ వ్యవహారాన్ని త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, సుమన్ తెలిపారు. అలా అయితే అందుకు గడువు ఇస్తానని న్యాయమూర్తి చెప్పారు.

ఏ క్షణమైనా కార్యాలయాలు తరలించవచ్చు..

ఈ సమయంలో పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులకోసం తాము దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను పరిశీలించాలని కోరారు. ఏ క్షణమైనా క్యాంప్ కార్యాలయాలను విశాఖకు తరలించే వీలుందని, అందువల్ల ఈ వ్యవహారంపై మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. దీనిపై మహేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ.. క్యాంప్ కార్యాలయాల తరలింపు రాత్రికిరాత్రి జరిగే ప్రక్రియ కాదని, అందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వాల్సిన అవసరం లేదన్నారు. ఉన్నం జోక్యం చేసుకుంటూ.. కార్యాలయాలను తరలించబోమని ప్రభుత్వం నుంచి హామీ తీసుకోవాలని కోర్టును కోరారు.

'యంగ్ సర్జన్ ఆఫ్ ఇండియా' అవార్డుకి జయచంద్రారెడ్డి ఎంపిక



తిరుపతి తుడా: అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక 'యంగ్ సర్జన్ ఆఫ్ ఇండియా'అవార్డుకి టీటీడీ స్విమ్స్ పరిధిలోని శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రత్యేక అధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 14న విశాఖలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా వార్షిక జాతీయ కాంగ్రెస్ సదస్సులో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. ప్రతి ఏటా సుమారు 5 వేల మంది వరకు ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకుంటారు. అన్ని అర్హతలు పరిశీలించి ఒక్కరికి మాత్రమే ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందిస్తారు.

ప్రజాప్రతినిధులపై కేసులు ఏ దశలో ఉన్నాయి?

- ఆ కేసులు ఏ చట్టం కింద నమోదు చేశారో చెప్పండి
- విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల్లో విచారణ ప్రస్తుతం ఏ దశలో ఉందో తెలియజేయాలని హైకోర్టు సోమవారం విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించింది. మొత్తం ఎన్ని కేసులున్నాయి? అవి ఏ దశలో ఉన్నాయి? ఏ చట్టం కింద ఆ కేసులు నమోదు చేశారు? చార్జిషీట్ దాఖలు చేశారా? తదితర విషయాలను నివేదిక రూపంలో తమ ముందుంచాలని ఆదేశించింది. ఆ వివరాల ఆధారంగా ఆ కేసుల్లో విచారణ వేగవంతమయ్యే దిశగా ఉత్తర్వులు జారీచేస్తామంది. ఒకవేళ పోక్సో, ఎన్‌డీపీఎస్, అవినీతి నిరోధక చట్టం, ఎస్సీ, ఎస్టీ, మనీలాండరింగ్ వంటి ప్రత్యేక చట్టాల కింద కేసులు నమోదై ఉంటే, వాటి విచారణ పరిధి ఏ కోర్టుకు ఉంటుందన్న అంశంపైన కూడా అధ్యయనం చేసి ఆ వివరాలను హైకోర్టు రిజిస్ట్రార్ ద్వారా తమ ముందుంచాలని హైకోర్టు తరఫు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్‌కు స్పష్టం చేసింది. వివరాలు పరిశీలించిన తరువాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కోర్టు సహాయకారి (అమికస్ క్యూరీ)ని నియమిస్తామంది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల్లో విచారణ వేగవంతం చేసేదిశగా ప్రత్యేక కోర్టుకు తగిన ఆదేశాలు జారీచేయాల్సి ఉందని తెలిపింది. ప్రత్యేక కోర్టు నుంచి తాము కోరిన వివరాలతో నివేదిక అందిన తరువాత ఉత్తర్వులు జారీచేస్తామంది. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాము తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు.

నేటి నుంచి ఏపీలో జాతీయ క్రీడా సంబరాలు

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 12–16 వరకు విజయవాడలోని అండర్–19 స్కూల్ గేమ్స్ జాతీయ బ్యాడ్మింటన్ బాలబాలికల టోర్నీను నిర్వహిస్తున్నట్లు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య (సీహెచ్ఆర్‌కే) ఇండోర్ స్టేడియంలో జరగనున్న ఈ పోటీల వివరాలను పీబీ సిద్ధార్థ కాలేజీలో ఆయన సోమవారం మీడియాకు వివరించారు. 25 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 33 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. 325 మంది (164 బాలురు, 161 బాలికలు) ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. 12 నుంచి 14 వరకు టీం ఈవెంట్ పోటీలు, 15,16 తేదీల్లో సింగిల్స్ విభాగంలో లీగ్ కమ్ నాకవుట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయన్నారు. 100 మంది సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో పోటీలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. యూపీకి చెందిన రాణా రాజు టోర్నీ జాతీయ పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. 4 రాష్ట్రాలకు కలిపి ఒక సమన్వయకర్తను ఏర్పాటు చేశామన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ టోర్నీని మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ప్రారంభించనున్నట్లు టోర్నీ కన్వీనర్, డీవీఈవో శివసత్య నారాయణరెడ్డి తెలిపారు.

అవినీతి అనకొండ 'బాబు'ను అరెస్ట్ చేయాలి

1,170వ రోజు రిలే దీక్షలో బహుజన నేతల డిమాండ్


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని 14 సంవత్సరాల పాటు రాష్ట్ర ఖజానాను లూటీ చేసిన చంద్రబాబును వెంటనే అరెస్ట్ చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 1,170వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. బాబుకు తన సంక్షేమం, తన సామాజికవర్గ అభివృద్ధే తప్ప ప్రజల బాగోగులు పట్టవని మండిపడ్డారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల దిశగా అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టడమే ధ్యేయంగా బాబు అండ్‌కో ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 35 లక్షల ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, గ్రామీణ ప్రాంతంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ నాడు–నేడు ద్వారా స్కూళ్ల బలోపేతం, ఉచిత ఇంగ్లిష్ మీడియం , హెల్త్ సెంటర్ల నిర్మాణం ద్వారా పేదలకు మేలు చేస్తున్నారన్నారు. ఆ అక్కసుతోనే కులవాదులు తప్పుడు కేసులు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల కోసం బఫూన్ వేషాలేస్తూ ప్రజల్లోకి వస్తున్న బాబు, లోకేశ్, దత్తపుత్రుడు పావలా ప్యాకేజీ కళ్యాణ్‌కు రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా చేస్తామని హెచ్చరించారు.

చరిత్రాత్మక తీర్పు

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. ఇదొక చరిత్రాత్మక తీర్పు. ఇది కేవలం న్యాయపరమైన తీర్పుకాదు. భవిష్యత్తు తరాలకు ఒక ఆశాదీపం. మెరుగైన భవిష్యత్తుకు వాగ్దానం. మరింత బలమైన, ఐక్య భారత్‌ను నిర్మించుకొనే విషయంలో మన సమ్మిళిత కృషికి మద్దతుగా నిలుస్తుంది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లోని మన సోదర సోదరీమణుల ప్రగతి, ఐక్యత, ఆశను ప్రతిధ్వనించే తీర్పు ఇది. వారి కలలను నెరవేర్చే విషయంలో మన అంకితభావం చెదిరిపోనిది. భారతీయులుగా మనం గర్వపడే మన ఐక్యతను కోర్టు మరోసారి బలపర్చింది. ఆర్టికల్ 370 వల్ల నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు ప్రగతి ఫలాలు అందించాలన్నదే మా ఆకాంక్ష

- 'ఎక్స్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ ఐదేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయంతో జమ్మూకశ్మీర్‌లో శాంతి నెలకొంది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకప్పుడు హింసను అనుభవించిన ప్రజలు ప్రస్తుతం శాంతియుతంగా జీవిస్తున్నారు. వారి జీవితాల్లో అభివృద్ధికి కొత్త నిర్వచనం వచ్చిచేరింది. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం, వ్యవసాయ రంగాలు వెలిగిపోతున్నాయి.

- అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి

ప్రతీ భారతీయుడి మదిలో సంతోషం

ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏను రద్దు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ చరిత్రాత్మక నిర్ణయంతో ప్రతీ భారతీయుడి మదిలో సంతోషం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఒక కొత్త అధ్యాయం లిఖించారు.

- రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ మంత్రి

ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్తు

జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజల ఉజ్వలమైన భవిష్యత్తుకు సుప్రీంకోర్టు తీర్పు నాంది పలికింది. అభివృద్ధిని వారికి చేరువ చేయడానికి మోదీ సర్కారు కృషి చేస్తూనే ఉంటుంది. న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అభివృద్ధి, సుపరిపాలన, సాధికారత జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజలకు అందుతాయి. వారంతా ఇకపై కలిసికట్టుగా ఉంటారు

- ఎస్.జైశంకర్, విదేశాంగ శాఖ మంత్రి

ప్రజల పాలిట మరణ శాసనం

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు జమ్మూకశ్మీర్ ప్రజల పాలిట మరణ శాసనం కంటే తక్కువేమీ కాదు. ఇది కేవలం ప్రజలకే కాదు, భారత్ అనే భావనకు పరాజయం. భారత పార్లమెంట్ తీసుకున్న రాజ్యాంగ వ్యతిరేక, చట్టవ్యతిరేక చర్యకు నేడు న్యాయపరంగా ఆమోదం లభించింది. కోర్టు తీర్పుతో నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ఏ నిర్ణయమూ తుది నిర్ణయం కాదు. జమ్మూకశ్మీర్ ప్రజలు రాజకీయ పోరాటం కొనసాగించాలి.

- మెహబూబా ముఫ్తీ, పీడీపీ

ఈ తీర్పు నిరాశ కలిగించింది

సుప్రీంకోర్టు తీర్పు నాకు నిరాశ కలిగించింది. అయితే, ఉత్సాహం మాత్రం కోల్పోలేదు. న్యాయం కోసం సుదీర్ఘ పోరాటానికి మేము సిద్ధంగా ఉన్నాం . జమ్మూకశ్మీర్ ప్రజల పోరాటం కొనసాగుతుంది. ఓటమి ఎదురైతే వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదు. తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తాం. చట్టపరంగా ముందుకెళ్తాం

- ఒమర్, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు

రాష్ట్రహోదా పునరుద్ధరించాలి

ఆర్టికల్ 370 రద్దుకు చట్టపరంగా ఆమోదం లభించింది. ఇక చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, ముంబై నగరాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఇక ఎవరూ అడ్డుకోలేరు. వాస్తవానికి ఆర్టికల్ 370 రద్దు వల్ల జమ్మూలోని డోంగ్రాలు, లద్దాఖ్‌లోని బౌద్ధులు ఎక్కువగా నష్టపోతారు. జమ్మూకశ్మీర్‌కు వెంటనే రాష్ట్రహోదా పునరుద్ధరించాలి. రాబోయే లోక్‌సభ ఎన్నికలతో పాటే అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం

జాతీయ సమైక్యత బలోపేతం

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మన జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తుంది. ఈ ఆర్టికల్‌ను మేము మొదటి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నాం. ఆర్టికల్ 370 రద్దుకు చట్టపరంగా మద్దతు లభించడం ఆహ్వానించదగ్గ పరిణామం. జమ్మూకశ్మీర్ ప్రజలకు ఇకపై ఎంతో మేలు జరుగుతుంది

- సునీల్ అంబేకర్, ఆర్‌ఎస్‌ఎస్

ఆ తీర్పునకు చట్టపరంగా విలువ లేదు

ఆర్టికల్ 370 విషయంలో భారత సుప్రీంకోర్టు తీర్పునకు చట్టపరంగా ఎలాంటి విలువ లేదు. భారత ప్రభుత్వం 2019 ఆగస్టు 5న ఏకపక్షంగా, చట్టవ్యతిరేకంగా తీసుకున్న చర్యలను అంతర్జాతీయ చట్టాలు, న్యాయ వర్గాలు గుర్తించడం లేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాల ప్రకారం జమ్మూకశ్మీర్ ప్రజలకు స్వయం ప్రతిపత్తి అనే హక్కు ఉంది. ఆ హక్కును వారి నుంచి ఎవరూ బలవంతంగా లాక్కోలేరు. భారత సుప్రీం కోర్టు తీర్పును మేము తిరస్కరిస్తున్నాం.

పాక్ విదేశాంగ మంత్రి

ప్రజల ఆకాంక్షలను కేంద్రం నెరవేర్చాలి

జమ్మూకశ్మీర్‌కు తక్షణమే రాష్ట్రహోదా పునరుద్ధరించాలి. అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి. ప్రభుత్వాన్ని ఎన్నుకొనే అవకాశాన్ని జమ్మూకశ్మీర్ ప్రజలకు కల్పించాలి. సుప్రీంకోర్టు తీర్పును కుణ్నంగా పరిశీలించాల్సి ఉంది. న్యాయస్థానం కొన్ని అంశాలను పక్కనపెట్టినట్లు కనిపిస్తోంది.

పి.చిదంబరం, అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్

కోర్టు తీర్పు కలవరానికి గురిచేసింది

సుప్రీంకోర్టు తాజా తీర్పు కొంత కలవరానికి గురిచేసింది. ఈ తీర్పు పర్యావసానాలు దేశ రాజ్యాంగ సమాఖ్య నిర్మాణంపై తీవ్రస్థాయిలో ఉంటాయనడంలో సందేహం లేదు.

- సీపీఎం పొలిట్‌బ్యూరో



సోమవారం తీర్పు వెలువరిస్తున్న ధర్మాసనం సభ్యులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సూర్యకాంత్

ఆర్టికల్ 370 రద్దు సబబే

సుప్రీం చరిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370పై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని ఈ ఆర్టికల్‌ను రద్దు చేయడం సబబేనని స్పష్టం చేసింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముక్త కంఠంతో సమర్థించింది. 370 ఆర్టికల్ రద్దు తాలూకు రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేసింది. సోమవారం ఈ మేరకు ఏకగ్రీవంగా మూడు తీర్పులు వెలువరించింది. ఆర్టికల్ 370 కేవలం ఓ తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, దాన్ని రద్దు చేసే పూర్తి అధికారాలు రాష్ట్రపతికి ఉన్నాయని సీజేఐ స్పష్టం చేశారు. ఈ మేరకు తనతో పాటు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.ఎస్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ తరఫున ఆయన 352 పేజీల మెజారిటీ తీర్పు వెలువరించారు. లద్దాఖ్ ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం కూడా సబబేనని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా మారుస్తూ మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ''జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలి. 2024 సెప్టెంబర్ 30లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి'' అని కేంద్రాన్ని సీజేఐ ఆదేశించారు. ఈ తీర్పును సమర్థిస్తూ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ 121 పేజీలతో విడిగా తీర్పు ఇచ్చారు. ఈ రెండు తీర్పులతోనూ పూర్తిగా ఏకీభవిస్తూ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా మరో తీర్పు వెలువరించారు. ఈ తీర్పును కేంద్రంలో మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానంలో మరో పెద్ద విజయంగా భావిస్తున్నారు. ప్రధానితో పాటు బీజేపీ తీర్పును సమర్థించగా పలు పార్టీలతో పాటు పలువురు నేతలు వ్యతిరేకించారు.

అంతిమ అధికారం కేంద్రానిదే

ప్రజాస్వామ్యం, సమాఖ్య తత్వం మన రాజ్యాంగపు మౌలిక లక్షణాలైనా కొన్ని నిర్దిష్ట ఏకస్వామ్యపు లక్షణాలు కూడా అందులో ఇమిడే ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ''వాటి ప్రకారం ఏ విషయంలోనైనా అంతిమంగా నిర్ణాయక అధికారాలు కేంద్రానికే దఖలు పడ్డాయి. కేంద్రపాలిత ప్రాంతాల ఏర్పాటు వంటివి వాటిలో భాగమే'' అని సీజేఐ వివరించారు. ''కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక అధికారాల విభజన, వాటి అమలులో రాష్ట్రాలకు ఇచ్చిన స్వతంత్రం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేవే. అయితే పలు కారణాల దృష్ట్యా రాష్ట్రంగా మనుగడ సాగించలేవని భావించిన ప్రాంతాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చే సంపూర్ణ అధికారాలు కేంద్రానికి ఉన్నాయి'' అని పేర్కొన్నారు.

ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయలేరు

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని 2019 ఆగస్టు 5న కేంద్రం రద్దు చేసింది. రాష్ట్ర హోదా రద్దు చేసి దాన్ని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 23 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ అనంతరం ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వు చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన రాజ్యాంగ ఆదేశం (సీఓ) 272లో జమ్మూ కశ్మీర్‌కు రాజ్యాంగంలోని అన్ని విధి విధానాలనూ వర్తింపజేశారు. ఆర్టికల్ 370లో పేర్కొన్న రాజ్యాంగ అసెంబ్లీ అనే పదాన్ని అసెంబ్లీగా మార్చారు. ఈ నిర్ణయాల చెల్లుబాటుపై ధర్మాసనం ప్రధానంగా విచారణ జరిపింది. జమ్మూ కశ్మీర్ విషయమై కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ సవాలు చేయజాలరని తీర్పులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం అది భారతదేశంలో సంపూర్ణంగా విలీనమై అంతర్భాగంగా మారిందనడంలో ఏ సందేహానికీ తావు లేదని స్పష్టం చేశారు. ''ఆర్టికల్ 1 ప్రకారమే గాక ఆర్టికల్ 370ని బట్టి చూసినా జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే. అలాంటప్పుడు దానికి ప్రత్యేక సార్వభౌమాధికారమంటూ ఏమీ ఉండబోదు. హక్కుల విషయంలోనూ మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది సమానమే. అంతే తప్ప ప్రత్యేకతేమీ ఉండబోదు'' అని పునరుద్ఘాటించారు. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రకటించిన నేపథ్యంలో దాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం ఆర్టికల్ 3 ప్రకారం సరైందో కాదో తేల్చాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 (1) (డి) కింద తనకున్న అధికారాలను వినియోగించేందుకు (నాటి) జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ అంగీకారం తీసుకోవడం రాష్ట్రపతికి తప్పనిసరేమీ కాదని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ అసెంబ్లీ అనుమతి లేకుండా ఆర్టికల్ 370కి ఎలాంటి మార్పుచేర్పులూ చెల్లుబాటు కావని, రాజ్యాంగ అసెంబ్లీ 1957లోనే రద్దయినందున ఆర్టికల్ 370 శాశ్వతత్వం సంతరించుకుందని పిటిషనర్లు చేసిన వాదనను పూర్తిగా అసంబద్ధమన్నారు. అది కేవలం తాత్కాలిక ఏర్పాటేనని రాజ్యాంగంలోని పలు నిబంధనలను ఉటంకిస్తూ స్పష్టం చేశారు. దాన్ని రాజ్యాంగంలోని 21వ భాగంలో పొందుపరిచేందుకు కూడా అదే కారణమని వివరించారు.



సార్వభౌమత్వం ఉండదు

ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూ కశ్మీర్‌కు అంతర్గత సార్వభౌమత్వం ఉంటుందన్న వాదనను కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. 1947లో విలీనం సందర్భంగా రక్షణ, విదేశాంగ, సమాచార అంశాల్లో మాత్రమే జమ్మూ కశ్మీర్ సార్వభౌమాధికారాలను భారత ప్రభుత్వానికి నాటి రాజు హరిసింగ్ వదులుకున్నారన్న వాదనను కూడా కొట్టిపారేసింది. కేంద్రంతో ఇలాంటి ప్రత్యేక నిబంధనలున్న ఇతర రాష్ట్రాలు కశ్మీర్‌ను ఉదాహరణగా చూపుతూ తమకూ అంతర్గత సార్వభౌమత్వముందని వాదిస్తే పరిస్థితేమిటని సీజేఐ ప్రశ్నించారు. మన అసాధారణ సమాఖ్య వ్యవస్థ స్వభావం ప్రకారం కొన్ని రాష్ట్రాలకు మిగతా వాటితో పోలిస్తే కొన్ని విషయాల్లో కాస్త స్వయం ప్రతిపత్తికి ఆస్కారముందని గుర్తు చేశారు. ''భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా ఔదలదాలుస్తూ 1949 నవంబర్ 25న కశ్మీర్ విలీన ఒప్పందాన్ని దాని యువరాజు కరణ్‌సింగ్ బేషరతుగా ఆమోదించడంతోనే అది పూర్తిగా దేశంలో కలిసిపోయింది. కనుక జమ్మూ కశ్మీర్‌కు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎప్పుడూ ఏ విధమైన అంతర్గత సార్వభౌమత్వమూ లేదు, ఉండబోదు. అక్కడి ప్రజలకూ ఇదే వర్తిస్తుంది'' అన్నారు. ''రెండు కారణాలతో ఆర్టికల్ 370 తెరపైకి వచ్చింది. ఒకటి జమ్మూ కశ్మీర్లో రాజ్యాంగ అసెంబ్లీ కొలువుదీరేదాకా దాకా అది మధ్యంతర ఏర్పాటుగా పని చేసింది. అలాగే నాడు అక్కడ నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తాత్కాలిక ఏర్పాటుగా కూడా ఆర్టికల్ 370ని తీసుకొచ్చారు. అది శాశ్వతమేమీ కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది'' అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30లోగా జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘానికి సీజేఐ సూచించారు.

కశ్మీర్లో మానవ హక్కుల హననంపై నిష్పాక్షిక దర్యాప్తు: జస్టిస్ కౌల్


సీజేఐ వెలువరించిన మెజారిటీ తీర్పుతో ఏకీభవిస్తూ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ విడిగా తీర్పు వెలువరించారు. దశలవారీగా కశ్మీర్‌ను అభివృద్ధి తదితర అన్ని అంశాల్లోనూ ఇతర రాష్ట్రాల స్థాయికి తీసుకెళ్లడమే ఆర్టికల్ 370 ఉద్దేశమని స్పష్టం చేశారు. దాని రద్దు పూర్తిగా సబబేనని స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్‌కు తగిలిన గాయాలు మానాల్సిన అవసరముందని జస్టిస్ కౌల్ తన తీర్పులో అభిప్రాయపడ్డారు. 1980ల నుంచి అక్కడ ప్రభుత్వపరంగా, ఇతరత్రా జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలపై స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. అప్పటి దారుణాలపై అది నిష్పాక్షికంగా పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలన్నారు. కశ్మీర్ జస్టిస్ కౌల్ స్వస్థలం. ఈ నేపథ్యంలో తీర్పులో ఒక చోట 'కశ్మీరీలమైన మేము' అని కూడా ఆయన పేర్కొన్నారు. ''1947 నుంచీ దశాబ్దాల పాటు కశ్మీరీలు వేర్పాటు, ఉగ్రవాదాల బాధితులుగా ఉంటూ వస్తున్నారు. దాంతో తొలుత కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను ఇతర దేశాలు ఆక్రమించాయి. 1980ల్లో వేర్పాటువాదం లోయలో కల్లోలం సృష్టించింది. అది వలసలకు దారి తీసింది. అవి స్వచ్ఛంద వలసలు కావు. సరిహద్దుల ఆవలి నుంచి వచ్చి పట్టమతిలేని మతోన్మాదాన్ని తాలలేక కశ్మీరీ పండిట్లు ప్రాణాలు కాపాడుకునేందుకు విధి లేక ఇల్లూవాకిలీ విడిచి మూకుమ్మడిగా వలస వెళ్లారు. దాంతో కశ్మీర్ తాలూకు సాంస్కృతిక విలువలే సమూలంగా మారిపోయాయి. దేశ సమగ్రత, సార్వభౌమత్వమే ప్రమాదంలో పడి సైన్యాన్ని రంగంలోకి దించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. విదేశీ చొరబాట్లను అరికట్టి దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు సైన్యం చేపట్టిన చర్యలతో పరిస్థితులు మరో మలుపు తీసుకున్నాయి. తర్వాతి పరిణామాల్లో ఆడ, మగ, చిన్నా, పెద్దా అందరూ భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. మూడు దశాబ్దాలు దాటినా నాటి అన్యాయాలను సరిదిద్దలేదు'' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. ''అక్కడ పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు కశ్మీర్ తాలూకు సామాజిక నిర్మాణాన్ని పునరుద్ధరించాల్సి ఉంది. తద్వారా కశ్మీరీలు సహనశీలత, పరస్పర గౌరవం సహజీవనం సాగించేలా చూడాలి'' అని పేర్కొన్నారు.

గట్టి కారణాలుంటేనే యూటీలు: జస్టిస్ ఖన్నా

రాష్ట్రాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడంపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆందోళన వెలిబుచ్చారు. ''ఈ చర్య విపరీత పరిణామాలకు దారి తీస్తుంది. సమాఖ్య తత్వానికి అడ్డంకిగా మారుతుంది. ప్రజలకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని లేకుండా చేస్తుంది'' అని అభిప్రాయపడ్డారు. అందుకే కేంద్రపాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలంటే అందుకు సహేతుకమైన గట్టి కారణాలు ఉండి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3లో పొందుపరిచిన నియమ నిబంధలను పూర్తిగా అనుసరిస్తూ మాత్రమే అందుకు పూనుకోవాలని సూచించారు. ఆర్టికల్ 370 అంశంపై వెలువరించిన విడి తీర్పులో జస్టిస్ ఖన్నా ఈ మేరకు పేర్కొన్నారు. దాని రద్దు సబబేనంటూ సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వెలువరించిన తీర్పులతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. ఆర్టికల్ 370కి శాశ్వత లక్షణం లేదని స్పష్టం చేశారు. ''ఈ మేరకు సీజేఐ, జస్టిస్ కౌల్‌వెలువరించిన తీర్పులు గొప్ప పరిణతితో కూడుకున్నవి. సంక్లిష్టమైన న్యాయపరమైన అంశాలను సరళంగా వివరిస్తూ సాగాయి'' అని ప్రస్తుతించారు.

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

- బీజేపీ అధిష్టానం అనూహ్య నిర్ణయం
- రాష్ట్ర జనాభాలో 48 శాతం ఉన్న ఓబీసీ నేతకు పట్టం
- ఆయనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న బీజేపీ ఎమ్మెల్యేలు



భోపాల్: బీజేపీ అధిష్టానం అనూహ్య నిర్ణయం తీసుకుంది. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ఓబీసీ వర్గం నాయకుడు మోహన్ యాదవ్(58) పేరును ఖరారు చేసింది. ఈ విషయాన్ని మధ్యప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు వి.డి.శర్మ వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల ఆధ్వర్యంలో బీజేపీ శాసనసభాపక్షం సోమవారం సాయంత్రం భోపాల్‌లో సమావేశమైంది. తమ నాయకుడిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకుంది. ఆయన పేరును ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా ఆమోదించారు. మోహన్ యాదవ్ ఇక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం లాంఛనమే. ఆయన ఉజ్జయిని సౌత్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంలో ఉన్నత విద్యా శాఖ మంత్రిగా పనిచేశారు. ముఖ్యమంత్రి పదవికి పోటీపడిన వారిలో తొలుత మోహన్ యాదవ్ పేరు లేదు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)తో మొదటి నుంచి సంబంధాలు ఉండడం, రాష్ట్రంలో 48 శాతం జనాభా ఉన్న ఓబీసీ నేత కావడంలో బీజేపీ పెద్దలు ఆయనవైపు మొగ్గు చూపించినట్లు తెలుస్తోంది. బీజేపీ శాసనసభాపక్ష నేతగా మోహన్ యాదవ్ ఎన్నిక కావడంతో ముఖ్యమంత్రి పదవికి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజీనామా సమర్పించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా పనిచేస్తానని యాదవ్ చెప్పారు. తనను ఎంపిక చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోపాటు పార్టీ అగ్రనేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కరడుగట్టిన హిందుత్వావాది

మోహన్ యాదవ్ విద్యార్థి దశ నుంచి నాయకుడిగా ఎదిగారు. కరడుగట్టిన హిందుత్వావాదిగా ముద్రపడ్డారు. కళాశాలల్లో 'రామచరిత మానస్'ను ఆప్షనల్ సబ్జెక్టుగా ప్రవేశపెడతామని 2021లో ప్రకటించారు. మోహన్ యాదవ్ 1965 మార్చి 25న ఉజ్జయినిలో జన్మించారు. 1982లో ఉజ్జయినిలోని మాధవ్ సైన్స్ కాలేజీలో జాయింట్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. 1984లో అదే కాలేజీలో ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు. ఎల్‌ఎల్‌బీ, ఎంబీఏ తోపాటు పీహెచ్‌డీ పూర్తిచేశారు. చిన్నప్పటి నుంచే ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉంది. 1993 నుంచి 1995 దాకా ఆర్‌ఎస్‌ఎస్ ఆఫీసు బేరర్‌గా పనిచేశారు. తొలిసారిగా 2013లో ఉజ్జయిని సౌత్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018, 2023లోనూ అక్కడి నుంచే విజయం సాధించారు. 2020లతో మొదటిసారిగా మంత్రి అయ్యారు. ఉజ్జయిని ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మొట్టమొదటి నాయకుడు ఆయనే.

ఏమిటీ ఆర్టికల్ 370?

- ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఉంటుంది.
- ప్రత్యేక రాజ్యాంగం, రాష్ట్ర పతాకం ఉంటాయి.
- అంతర్గత పాలన విషయంలో పూర్తి స్వయం ప్రతిపత్తి ఉంటుంది.
- కశ్మీర్‌పై భారత సార్వభౌమాధికారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్ల వరకే పరిమితం.
- ఇతర రాష్ట్రాల ప్రజలు జమ్మూ కశ్మీర్‌లో ఆస్తులు, భూములు కొనుగోలు చేయలేరు.
- ప్రజల పౌరసత్వం, ఆస్తి యాజమాన్యం, ప్రాథమిక హక్కుల చట్టం మిగతా ప్రాంతాల వారికంటే భిన్నంగా ఉంటుంది.
- అక్కడ ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించే అధికారం కేంద్రానికి లేదు.
- రక్షణ, విదేశాంగ, కమ్యూనికేషన్లు మినహా ఇతర చట్టాల అమలుకు అక్కడి రాజ్యాంగ అసెంబ్లీ ఆమోదం తప్పనిసరి.
- ఆర్టికల్ 370ని సవరించే, రద్దు చేసే అధికారం రాజ్యాంగ అసెంబ్లీకి ఉంది.
- కానీ రాజ్యాంగ అసెంబ్లీయే 1957లో రద్దయిపోయింది.
- దాంతో ఆర్టికల్ 370 రాజ్యాంగంలో శాశ్వత భాగమైయిందని, దాని రద్దు అధికారం కేంద్రానికి లేదని అక్కడి పార్టీలు వాదిస్తూ వస్తున్నాయి.

అమలు నుంచి రద్దు దాకా...

1947 అక్టోబర్ 26: భారతదేశ విభజన తర్వాత జమ్మూకశ్మీర్ స్వతంత్ర దేశంగా ఉండడానికే మహారాజా హరిసింగ్ మొగ్గు చూపారు. భారత్‌లో గానీ, పాకిస్తాన్‌లో గానీ విలీనం కాబోమని ప్రకటించారు. ఇంతలో పాకిస్తాన్ సైన్యం అండతో అక్కడి గిరిజనులు జమ్మూకశ్మీర్‌పై దండెత్తారు. మహారాజా హరిసింగ్ భారత ప్రభుత్వ సహకారాన్ని కోరారు. భారత్‌లో విలీనానికి అంగీకరించారు. కొన్ని షరతులతో విలీన ఒప్పందంపై సంతకం చేశారు.

1949 మే 27: రాజ్యాంగాన్ని రూపకల్పనకు ఏర్పాటైన రాజ్యాంగ సభ విలీన ఒప్పందం ప్రకారం ఆర్టికల్ 370 ముసాయిదాను ఆమోదించింది.

1949 అక్టోబర్ 17: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ ఆర్టికల్ 370ని భారత రాజ్యాంగంలో చేర్చారు.

1951 మే 1: జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగ అసెంబ్లీని ఏర్పాటు చేస్తూ రాజకుమారుడు డాక్టర్ కరణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

1952: ఇండియా, జమ్మూకశ్మీర్ మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి 'ఢిల్లీ అగ్రిమెంట్'పై భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, జమ్మూ కశ్మీర్ ప్రధానమంత్రి షేక్ అబ్దుల్లా సంతకం చేశారు.

1954 మే 14: రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఆర్టికల్ 370 అమల్లోకి వచ్చింది.

1954 మే 15: జమ్మూకశ్మీర్‌లో శాశ్వత నివాసితుల హక్కుల విషయంలో రాష్ట్ర శాసనసభ చేసిన చట్టాలకు రక్షణ కల్పించడానికి రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా 'ఆర్టికల్ 35ఏ'ను భారత రాజ్యాంగంలో చేర్చారు.

1957 నవంబర్ 17: జమ్మూకశ్మీర్ రాజ్యాంగాన్ని ఆమోదించారు.

1958 జనవరి 26: జమ్మూకశ్మీర్‌కు సొంత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

1965: జమ్మూకశ్మీర్‌లో ప్రధానమంత్రి, సదర్-ఇ-రియాసత్ పదవులను ముఖ్యమంత్రి, గవర్నర్‌గా అధికారికంగా మార్చారు.

2018 డిసెంబర్ 20: జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు.

2019 జూలై 3: రాష్ట్రపతి పాలనను మరోసారి పొడిగించారు.

2019 ఆగస్టు 5: ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.

2019 ఆగస్టు 6: ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ అడ్వొకేట్ ఎం.ఎల్.శర్మ సుప్రీంకోర్టులో కేసు వేశారు. తర్వాత మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి.

2019 ఆగస్టు 9: జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019ను పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు.

2019 సెప్టెంబర్ 19: ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ కోసం ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.

2023 ఆగస్టు 2: పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ మొదలైంది.

2023 సెప్టెంబర్ 5: మొత్తం 23 పిటిషన్లపై ధర్మాసనం విచారణ పూర్తి చేసింది. తుది తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

2023 డిసెంబర్ 11: ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ప్రకటించింది. 2024 సెప్టెంబర్ 30లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సరైన సమయంలో రాష్ట్ర హోదా: అమిత్ షా

కశ్మీర్ బిల్లులకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ: ఉగ్రవాద జాడలు లేని.. నవీన, అభివృద్ధి చెందిన కశ్మీర్ నిర్మాణం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే మొదలవనుందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను అనువైన సమయంలో పునరుద్ధరిస్తామని సోమవారం రాజ్యసభలో ప్రకటించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) భారత్‌లో అంతర్భాగమని, దాని నెవరూ లాక్కోలేరని స్పష్టం చేశారు.

భారతీయుల కశ్మీర్.. కశ్మీరీల భారత్

కశ్మీర్ కోసం పోరాడేవారు ఎవరూ లేరంటూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా చేసిన వ్యాఖ్యలపై హోం మంత్రి అమిత్ షా దీటుగా స్పందించారు. 'ఆయన తన కోసం మాత్రమే మాట్లాడుకుంటారు. మనకోసం ఎందుకు మాట్లాడతారు? మనం ఎల్లప్పుడూ కశ్మీర్ పక్షమే. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి ఈశాన్యం వరకు.. ప్రాంతమంతా మనందరిదీ. అదే విధంగా, కశ్మీర్ భారతీయులందరిది, కశ్మీరీలందరిది భారత్' అంటూ సమాధానమిచ్చారు. అంతకుముందు జమ్మూకశ్మీర్ పునర్ విభజన (సవరణ) బిల్లు, జమ్మూకశ్మీర్ రిజర్వేషన్(సవరణ)బిల్లులపైచర్చ జరిగింది. గత వారం లోక్‌సభ ఆమోదించిన ఆ బిల్లులను రాజ్యసభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ సందర్భంగా జరిగిన చర్చకు అమిత్ షా సమాధానమిచ్చారు. హోం మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

బహిష్కరణపై సుప్రీంలో మహువా పిటిషన్

న్యూఢిల్లీ: తనను లోక్‌సభ నుంచి బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ నేత మహువా మొయిత్రా సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఓ వ్యాపారవేత్త నుంచి ముడుపులు తీసుకుని, పార్లమెంట్‌లో ప్రశ్నలడిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నెల 8వ తేదీన లోక్‌సభలో వాడివేడిగా చర్చ జరగడం, అనైతిక ప్రవర్తనకుగాను మహువాపై బహిష్కరణ వేటువేస్తూ సభ మూజువాణి ఓటుతో ఒక తీర్మానాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. మహువా మాత్రం తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాజాగా, ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

జార్ఖండ్ సీఎం సోరెన్‌కు ఈడీ మళ్లీ సమన్లు

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సోమవారం మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. భూకుంభకోణం కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై ప్రశ్నించేందుకు ఈ నెల 12న రాంచీలోని ప్రాంతీయ కార్యాలయానికి రావాలని అందులో కోరింది. ఈ కేసులో ఆయనకు ఆగస్టు 14వ తేదీ మొదలుకొని సమన్లు పంపడం ఇది ఆరోసారని ఈడీ వర్గాలు తెలిపాయి. ఒక్కసారి కూడా విచారణకు ఆయన హాజరుకాలేదని పేర్కొన్నాయి.

జడ్జీలు ఆస్తులు వెల్లడించాలి

రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ

న్యూఢిల్లీ: మంత్రులు, ప్రభుత్వ అధికారుల మాదిరిగానే హైకోర్టులు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులు కూడా తమ ఆస్తుల వివరాలను బహిర్గతం చేయడం తప్పనిసరిగా మార్చాలని బీజేపీ ఎంపీ సుశీల్‌కుమార్ మోదీ ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం ప్రస్తుతమున్న చట్టాన్ని మార్చడం లేదా కొత్తగా చట్టాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. రాజ్యసభ జీరో అవర్‌లో సోమవారం ఈ అంశాన్ని ప్రస్తావించారు.

మనీశ్ సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఆప్ నేత మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు వచ్చే జనవరి 10వ తేదీ వరకు పొడిగించింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై సీబీఐ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 26న అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మార్చి 9న ఈడీ మనీశ్ సిసోడియాను అదుపులోకి తీసుకుంది.

కాషాయంలో సఖ్యత ఏదీ?

- సీఎం సిద్దు హేళన

శివాజీనగర: ఆపరేషన్ కమలం ద్వారా అధికారంలోకి వచ్చి ఎన్నికల్లో ఓటమిపాలైన బీజేపీలో సఖ్యత ఉండదని సీఎం సిద్ధరామయ్య ఎద్దేవా చేశారు. సోమవారం బెళగావి విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీని తిరస్కరించారు. బీజేపీలో 2- 3 గ్రూపులు ఏర్పడ్డాయి, పార్టీలో సమన్వయం కుదరదు అని అన్నారు. అసెంబ్లీలో ఏ విషయమైనా చర్చ జరిపేందుకు రెడీ, రాష్ట్రంలో కరువు గురించి చర్చ జరిగింది. అందుకు సమాధానం ఇస్తాను. మంగళవారం నుంచి ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చ జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ ముగిశాక పంచమసాలి నాయకులతో సమావేశమై రిజర్వేషన్ అంశమై చర్చిస్తామన్నారు. సువర్ణసౌధలోని సావర్కర్ ఫోటోను తొలగించడం స్పీకర్‌కు చెందిన విషయమన్నారు. బెళగావిలో మహిళపై దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలను తీసుకొంటామని తెలిపారు.

న్యూస్‌రీల్

మైసూరు బ్రాండ్ లోగో విడుదల



మైసూరు: మైసూరు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి హెచ్.కే. పాటిల్ మైసూరు బ్రాండ్ లోగో, ట్యాగ్ లైన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మైసూరు బ్రాండింగ్ కోసం ఇది పెద్ద అడుగని, పర్యాటకులను ఆకర్షించడానికి, పురాతన కాలం నాటి పర్యాటక ప్రాంతాలు, నిర్మాణాలను కాపాడుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పర్యాటకులు కేవలం మైసూరు ప్యాలెస్ మాత్రమే చూడటానికి వస్తున్నారని, ఇక్కడ అనేక పర్యాటక ప్రాంతాలు, యాత్రా స్థలాలు ఉన్నాయని, వాటిని కూడా చూడవచ్చన్నారు.

ప్రాణం తీసిన ప్రేమ వివాహం

మైసూరు: ప్రేమించి పెళ్లాడిన భార్య దూరంగా ఉంటోందని ఆవేదనతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చామరాజనగర తాలూకాలోని హొన్నహళ్ళి గ్రామంలో జరిగింది. వివరాలు.. వసంత్‌కుమార్ (29) మూడేళ్ల కిందట బెంగళూరులో పని చేస్తున్న సమయంలో అక్కడి ఒక యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అమ్మాయి కుటుంబం మంచి స్థితిలో ఉంది. తన వెంట హొన్నహళ్లికి వచ్చేయాలని అక్కడ వ్యవసాయం చేసుకుందామని భార్యకు చెప్పగా ఆమె అంగీకరించేది కాదు. చివరికి అక్కడ కొన్నిరోజులు ఉన్న యువతి మళ్లీ బెంగళూరుకు వచ్చేసింది. వసంత్‌కుమార్ వచ్చి మన ఊరికి వెళదామని అంటే తాను పల్లెటూరికి వచ్చేది లేదని ఆమె స్పష్టంచేసింది. కావాలంటే నువ్వే బెంగళూరుకు వచ్చి ఉండు అని చెప్పింది. దీంతో భార్య మాట వినడం లేదని బాధపడి డెత్‌నోటు రాసిపెట్టి ఉరి వేసుకున్నాడు. చామరాజనగర గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టాప్‌కు ముందే దిగరాదు

- యువతితో కండక్టర్ జబర్దస్త్



బాధిత యువతి

యశవంతపుర: బీఎంటీసీ బస్సుల్లో మహిళలకు ఉచితమన్నది తెలిసిందే. కానీ ఒక యువతి టికెట్ తీసుకుని స్టాప్‌కు ముందుగానే దిగడానికి ప్రయత్నించగా కండక్టర్ అత్యుత్సాహంతో గొడవకు దిగాడు. పైగా ఇదంతా ఆ కండక్టర్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై నెటిజన్లు మండిపడ్డారు. వివరాలు.. ఓ యువతి నగరంలో సెంట్రల్ సిల్క్ బోర్డ్ వద్ద బస్సు ఎక్కి కాడు బీసనహళ్లికి టికెట్ తీసుకుంది. తన స్టాప్ రావడానికి ముందుగానే దిగడానికి ఆమె యత్నించగా కండక్టర్ డోర్ తీయలేదు, టికెట్ తీసుకున్న స్టాప్ కంటే ముందే దిగితే ఎలా అని జబర్దస్త్‌గా ప్రవర్తించాడు. దీంతో యువతి కూడా కండక్టర్ గొడవకు దిగింది. ముందే దిగిపోతే నీకేమిటని నిలదీసింది. నెటిజన్లు కూడా కండక్టర్‌పై మండిపడ్డారు. ప్రభుత్వమే ఉచిత ప్రయాణం కల్పిస్తే, ఆమె ఎక్కడ దిగితే కండక్టర్‌కు ఏమిటి? అని ప్రశ్నించారు.

లోదుస్తుల్లో దాచి బంగారం తరలింపు



పట్టుబడ్డ బంగారం

దొడ్డబళ్లాపురం : లోదుస్తుల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఈనెల 10న దుబాయ్ నుండి కేఐఏకి విమానంలో వచ్చిన ప్రయాణికుడు లోదుస్తుల్లో దాచి గట్టి బంగారం తరలిస్తూ చెకింగ్ వద్ద పట్టుబడ్డాడు. ప్రయాణికుడి నుండి రూ.55 లక్షల విలువైన 907 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు.

నిరసనలు, ధర్నాల జోరు



సోమవారం బెళగావి విధానసభలో సభాపతిని చుట్టుముట్టిన బీజేపీ ఎమ్మెల్యేలు



శాసనసభ సమావేశాలను చూడడానికి వస్తున్న విద్యార్థినులు, టీచరు

- మంత్రి జమీర్ రాజీనామాకు బీజేపీ పట్టు
- వాడీవేడిగా బెళగావి అసెంబ్లీ

సాక్షి, బళ్లారి, శివాజీనగర: బెళగావి సువర్ణసౌధలో సోమవారం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటుచేసుకుంది. పరస్పర ఆరోపణలు, సవాళ్లతో గందరగోళం మధ్యనే 5 బిల్లులకు ఆమోదం లభించింది. శాసనసభ శీతాకాల సమావేశాలలో భాగంగా విధానసభలో పాలక- ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరంభంలోనే వాగ్యుద్ధం మొదలైంది. మంత్రి జమీర్ అహ్మద్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో స్పీకర్ స్థానం గురించి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎమ్మెల్యేలు లేవనెత్తారు. మంత్రి జమీర్‌ను తొలగించాలని వారు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి జమీర్ ప్రతిపక్ష పార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం తిరస్కరించడంతో ఆయనను పదవి నుంచి తొలగించాలని భీష్మించారు. ఈ సమయంలోనే సీఎం సిద్దరామయ్య, మంత్రి హెచ్‌కె పాటిల్ తదితరులు మాట్లాడారు. ఈ సమయంలోనే రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ కర్ణాటక స్టాంపు సవరణ బిల్లును పునఃపరిశీలకు ప్రవేశపెట్టారు. రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు ఉండదని, కానీ ప్రజలు వివిధ సేవలను పొందడానికి ఖరీదు చేసే స్టాంపుల ధరలను మాత్రం పెంచినట్లు చెప్పారు.

గతంలో నాసిరకం యూనిఫాంలు

ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యూనిఫాంలలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తాము, ఇందులో రాజీ పడేది లేదని పాఠశాల విద్య, సాక్షరతా విద్యా మంత్రి మధుబంగారప్ప తెలిపారు. విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం నాసిరకం యూనిఫాంలను పంపిణీ చేసిందని ఆరోపించారు. దీనికి కారణమైన అధికారులను తాము సస్పెండ్ చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేస్తామని చెప్పారు. భారీ మొత్తంలో సైకిళ్ల తయారీ ఒకే కంపెనీకి కష్టం కాబట్టి వేర్వేరు కంపెనీల నుంచి తెప్పిస్తామని అన్నారు.

సావర్కర్ ఫొటో వివాదం

స్వాతంత్ర్య సమరయోధుడు సావర్కర్ ఫొటోను సువర్ణసౌధలో ఉభయ సభల గ్యాలరీ నుంచి తొలగించాలని, వీలైతే తానే ఆ ఫొటోను తీసేస్తానని మంత్రి ప్రియాంక్ ఖర్గే అనడం దారుణం. ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్ డిమాండ్ చేశారు. విధానపరిషత్ ఆయన మాట్లాడుతూ సావర్కర్ ఫొటోను తానే తొలగిస్తానని ప్రియాంక ఖర్గే చెప్పడం సబబు కాదన్నారు. మహనీయులను ఈ విధంగా ద్వేష రాజకీయాలకు గురి చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

బెళగావి విభజనపై డీకేశి...

రాష్ట్రంలో కరువు, ఉత్తర కర్ణాటక సమస్యలపై శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం పూర్తి మద్దతిస్తుందని డీసీఎం డీ.కే.శివకుమార్ తెలిపారు. మనది సమగ్ర కర్ణాటక, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల గురించి శాసనసభలో చర్చ జరపవచ్చు. బెళగావి జిల్లా విభజన కోసం డిమాండ్లు వినిపిస్తున్నాయి. అసెంబ్లీలో ఈ విషయంపై ప్రస్తావనకు వచ్చినపుడు తప్పకుండా యోచిస్తామని తెలిపారు. శాసనసభ నుంచి సావర్కర్ ఫొటోను తొలగిస్తానని ప్రియాంక్ ఖర్గే చెప్పడం గురించి తరువాత స్పందిస్తానన్నారు.

ఆస్తి కోసం తల్లిదండ్రుల హత్య

- కన్న కొడుకు కిరాతకం



హత్యకు గురైన దంపతులు

దొడ్డబళ్లాపురం: ఆస్తి కోసం కన్న కొడుకు తల్లిదండ్రులపై దాడి చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన హొసకోట తాలూకా సూలిబెలెలో చోటుచేసుకుంది. రామక్రిష్ణప్ప (70), మునిరామక్క (65) హత్యకు గురైన దంపతులు. వీరి కుమారుడు నరసింహ ఆస్తికోసం రాడ్‌తో కొట్టి హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం జరిగింది. అయితే నరసింహ వివాహం చేసుకుని తల్లిదండ్రులను చూసుకోకుండా వేరే కాపురం పెట్టాడు. ఆడపిల్లలకు ఆస్తిలో భాగం ఇవ్వనని, ఆస్తి తనకే ఇవ్వాలని కన్నవారిని పీడించేవాడు. ఈక్రమంలో తల్లితండ్రులతో గొడవపడి రాడ్‌తో కొట్టి హత్య చేసినట్టు స్థానికుల సమాచారం. సూలిబెలె పోలీసులు కేసు నమోదు చేసి నరసింహను అదుపులోకి తీసుకున్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

మండ్య: కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం చెందిన ఘటన మండ్య బస్టాండు వద్ద జరిగింది. బెంగళూరువాసి పూజా భారతి.. సోమవారం తెల్లవారుజామున బస్టాండుకు నడిచి వస్తుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆమె మీదకు దూసుకెళ్లింది. ఆమె మీద నుంచి బస్సు వెళ్లిపోవడంతో తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయింది. మండ్య ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ చందన్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

కార్తీకమా.. సెలవిక

ఆఖరి కార్తీక సోమవారం సందర్భంగా రాత్రి బెంగళూరు కెంపాంబుధి చెరువులో తెప్పోత్సవం



చిక్కబళ్లాపురం: చివరి కార్తీక సోమవారం సందర్భంగా నగరంలోని అనేక ఆలయాలలో విశేష పూజలు జరిగాయి. శైవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్రిష్ణ టాకీస్ రోడ్డులోని బిల్లె నందీశ్వర ఆలయంలో పరమ శివునికి అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులు వందలాదిగా దీపారాధన గావించారు. మరళు సిద్దేశ్వర ఆలయంలో మహాశివునికి ఉదయం నుంచి పూజలు సాగాయి. గౌరిబిదనూరు రోడ్డులోని కణివెకనంలో కొలువైన వీరదిమ్మమ్మ కాళికాంబదేవి, గంగమ్మ దేవిలకు విశేష అలంకారం, పూజలు జరగ్గా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అర్కేశ్వరాయనమః

మండ్య: మండ్య నగరంలో ఉన్న చరిత్ర ప్రసిద్ధ ఆర్కేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి రుద్రాభిషేకం, క్షీర, మధు అభిషేకాలను నిర్వహించి పూజలు చేశారు. బెంగళూరులో కెంపాంబుధి చెరువులో సోమవారం రాత్రి కమనీయంగా తెప్పోత్సవం సాగింది. సంపంగి రామనగరలో పుష్కరిణి వద్ద దీపారాధన నిర్వహించారు.



బెంగళూరు సంపంగి రామనగరలో పుష్కరిణి వద్ద కార్తీక దీపారాధన



గౌరిబిదనూరు రోడ్డులోని కణివె వీరదిమ్మమ్మ



మండ్యలో శైవ ఆలయాల్లో అలంకారం

ఘోరం.. అమానుషం

- బెళగావి జిల్లాలో ప్రేమజంట పరారు
- యువకుని తల్లిపై యువతి కుటుంబికుల దాడి
- ఇల్లు ధ్వంసం, తల్లి ఊరేగింపు



అక్టోబరులో హనీట్రాప్ అని మహిళపై దాడి

హుబ్లీ/ బనశంకరి: ఎక్కడో దేశంలోని మారుమూల ప్రాంతంలో జరిగే అరాచక సంఘటన బెళగావి నగరానికి కూతవేటు దూరంలో జరగడం కలవరానికి కారణమైంది. సభ్య సమాజం విస్తుపోయేలా ఒక మహిళ (42)ను కొందరు కొట్టి వివస్త్రను చేసి కరెంటు స్తంభానికి కట్టివేసిన దుర్ఘటన వంటమూరి అనే గ్రామంలో వెలుగుచూసింది. బాధితురాలి కొడుకు, మరో యువతి ప్రేమించుకుని గ్రామం వదిలి వెళ్లిపోయారు. దీంతో యువతి కుటుంబసభ్యులు ఆగ్రహంతో ఈ కీచక పర్వానికి ఒడిగట్టారు.

యువతికి నిశ్చితార్థం.. అంతలోనే

యువతికి తల్లిదండ్రులు ఇంతకు ముందే వేరే సంబంధం చూసి సోమవారం తెల్లవారితే నిశ్చితార్థం కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. పెళ్లి తేదీని కూడా ఖరారు చేశారు. ఇంతలోనే కూతురు పరారైందని దాడికి పాల్పడ్డారు. యువకుని పెంకుటిల్లును పడగొట్టారు. ఇంట్లోని డబ్బు, బంగారాన్ని దోచుకున్నారని బాధితురాలి బంధువులు వాపోయారు. బెళగావి నగర పోలీస్ కమిషనర్ ఎస్ఎన్ సిద్దరామప్ప గ్రామానికి వెళ్లి విచారించారు. ఘర్షణలు జరగకుండా పెద్దసంఖ్యలో కేఎస్ఆర్‌పీ బలగాలను మోహరించారు.

తలదించుకోవాలి: మంత్రి లక్ష్మి

అది అత్యంత అమానవీయమని స్త్రీ శిశు సంక్షేమ మంత్రి, జిల్లావాసి లక్ష్మీ హెబ్బాల్కర్ అన్నారు. ఆమె బెళగావిలో మీడియాతో మాట్లాడారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని,



ఆమెను పరామర్శించినట్లు తెలిపారు. ఇది సమాజం తల తగ్గించుకొనే దారుణ కృత్యం అన్నారు. నిందితులకు అత్యంత కఠిన శిక్షలు పడాలన్నారు. తన జిల్లాలో ఇటువంటి ఘోరం జరగడం నన్ను తల వంచుకొనేలా చేసిందని ఆమె వాపోయారు.

గతంలోనూ ఇలాంటి నేరం

కాగా, బెళగావి జిల్లాలో ఈ తరహా మూకదాడులు ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా జరిగాయి. ఈ ఏడాది అక్టోబరు రెండోవారంలో... గోకాక్ దగ్గర పల్లెలో హనీ ట్రాప్‌కు పాల్పడిందంటూ ఒక మహిళను కొందరు వ్యక్తులు కొట్టి చెప్పుల దండ వేసి ఊరేగించారు. ఆ మహిళ తననే హనీ ట్రాప్ చేసి బెదిరించిందని అర్జున గుండవ్వగోల్, అనుచరులు ఈ దాడి చేశారు. పోలీసులు అర్జున, ఇతర నిందితులపై కేసు నమోదు చేశారు.

బీజేపీలో అలక సీన్లు

- ముఖ్య భేటీకి నేతల గైర్హాజరు



బీజేపీ కోటకు అనైక్యతతో బీటలు

యశవంతపుర: బీజేపీలో భిన్నాభిప్రాయాలు వీధిన పడ్డాయి. అధికార కాంగ్రెస్‌పై ఎలా పోరాటం చేయాలనే విషయమై చర్చించడానికి సోమవారం ప్రతిపక్ష బీజేపీ సమావేశం అలకలకు వేదికైంది. చాలామంది ఎమ్మెల్యేలు, నాయకులు ముఖం చాటేశారు. సోమవారం బెళగావి సువర్ణసౌధలో బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు అరగ జ్ఞానేంద్ర, కోటా శ్రీనివాస పూజారి, శశికళ జొల్లె, బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్రతో పాటు ఇతరులు పాల్గొన్నారు. యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ సభ జరుగుతున్న గది వరకు వచ్చి బయట కూర్చున్నారు. పిలవని సభకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. జ్ఞానేంద్ర వచ్చి విశ్వనాథ్‌ను లోపలికి తీసుకెళ్లడానికి యత్నించినా ససేమిరా అన్నారు. స్పీకర్‌ను కలవాలంటూ విశ్వనాథ్ వెళ్లిపోయారు. ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ భేటీ ముగిసిన తరువాత తాపీగా వచ్చారు.

13న బెళగావిలో కరువు సభ

రాష్ట్రంలో కరువు సమస్యపై ఈ నెల 13న బెళగావిలో బీజేపీ భారీ బహిరంగ సభ జరుపుతుందని పార్టీ నేతలు తెలిపారు. మాజీ సీఎంలు, సీనియర్లు ఈ సభలో పాల్గొంటారు. 25 వేల మందితో సభ జరుపుతామన్నారు. విద్యుత్ సరఫరా లేదు, కరువు పరిహారం ఇవ్వలేదు, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. ఈ సమయంలో ముస్లింల కోసం రూ.10 వేల కోట్లు ప్రకటించటం సరికాదన్నారు.

కిల్లర్ కూతురు

- తల్లిని చంపి భర్తతో కలిసి పాతిపెట్టిన వైనం

మైసూరు: కన్నతల్లిని ప్రేమాభిమానాలతో చూసుకోవడానికి బదులు ఆ కుమార్తె హత్య చేసి గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని పాతిపెట్టింది. మైసూరు తాలూకాలోని హారోహళ్ళిలో ఈ ఘోరం వెలుగుచూసింది. కుమార్తె అనూషా తల్లి శారదమ్మతో ఏదో విషయమై గొడవపడి కిందపడేసి కొట్టి ప్రాణాలు తీసింది. తరువాత భర్త దేవరాజుకు చెప్పి ఇద్దరూ కలిసి రాత్రి శారదమ్మ శవాన్ని బైకులో కూర్చోబెట్టుకుని శ్మశానానికి తీసుకెళ్లి పాతి పెట్టి ఏమీ తెలియనట్లు తిరగసాగారు. హత్య జరిగిన సుమారు 13 నెలల తరువాత శారదమ్మ సోదరి దేవమ్మ.. అనూషాను కలిసి అమ్మ కనిపించడం లేదు, ఏం జరిగిందనగా తెలియదని చెప్పింది. బంధువుల ఒత్తిడితో పోలీసులకు మిస్సింగ్ అని ఫిర్యాదు చేసింది అనూషా. వరుణ పోలీసులు అనూషాను పిలిచి గట్టిగా ప్రశ్నించగా, ఘర్షణ పడి తానే హత్య చేశానని, భర్తతో కలిసి శ్మశానంలో పాతిపెట్టామని చెప్పింది. భార్యాభర్తలను అరెస్టు చేశారు.

క్రెడిట్ కార్డు ఇస్తామని రూ.4.77 లక్షలు మస్కా

బనశంకరి: సిలికాన్‌సిటీలో నిత్యం సైబర్‌వంచకులు పలు మార్గాల్లో అమాయకులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలను మోసగిస్తూ లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు. నిరక్షరాస్యులు కాకుండా ఉన్నత విద్యావంతులే బాధితులుగా ఉండడం గమనార్హం. మోసగాళ్ల మాటలను ఇట్టే నమ్మి లక్షల రూపాయలను కోల్పోతున్నారు. కెనరా బ్యాంక్ క్రెడిట్ కార్డు ఇస్తామని ఒక వృద్ధున్ని నమ్మించి రూ.4.77 లక్షలు కాజేశారు. నగరంలోని కోడిచిక్కనహళ్లి నివాసి సత్యనారాయణ కామత్ (70)కు ఇటీవల కాల్ చేసిన వంచకులు.. బ్యాంకు క్రెడిట్ కార్డు ఇస్తామని మాయమాటలు చెప్పారు. ఆపై దుండగులు ఇచ్చిన బ్యాంకు అకౌంట్‌లోకి రూ.4.77 లక్షలు జమ చేశాడు. తరువాత దుండగులు మొబైల్ స్విచాఫ్ చేసుకున్నారు. వంచనకు గురైనట్లు భావించిన బాధితుడు, అతని తనయుడు కలిసి ఆగ్నేయ విభాగ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రూ.1.98 కోట్ల కేసులో దర్యాప్తు

ఇక ముంబై సైబర్‌క్రైం పోలీసులమంటూ హెచ్ఎస్ఆర్.లేఔట్ నివాసి తారక్ షా (52) అనే వ్యాపారవేత్త నుంచి రూ.1.98 కోట్లను వసూలు చేసిన కేసులో విచారణ సాగుతోంది. రాహుల్‌కుమార్, బల్‌సింగ్ రజపుత్ అనే వారిపై కేసు నమోదు చేసి వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రదర్శనలో అందంగా పేర్చిన బెల్లం అచ్చులు



అబ్బురం అనిపించే బెల్లం కోట

మధురం.. ఆరోగ్యం

- నోరూరించే బెల్లం ప్రదర్శన

బనశంకరి: ఒకప్పుడు బెల్లం అంటే ఎవరూ పట్టించుకునేవారు కాదు. కానీ దాని ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలిశాక ఎగబడి మరీ వినియోగిస్తున్నారు. బెల్లం వల్ల కలిగే ఆరోగ్యం అంతా ఇంతా కాదని ఆయుర్వేద వైద్యులూ చెబుతారు. ఈ నేపథ్యంలో నగరంలో బసవనగుడిలో దొడ్డ గణపతి ఆలయంలో శెనక్కాయల పరుసలో మరో పరుస కొలువైంది. అదే బెల్లం పరుస. బెల్లం తయారీకి ప్రసిద్ధి చెందిన మండ్య బెల్లం అచ్చులు నగరవాసులను నోరూరించాయి. దేవాదాయ శాఖ ఈ ప్రదర్శన ఏర్పాటు చేసింది. ప్రదర్శనతో పాటు బెల్లం విక్రయాలు కూడా చేస్తున్నట్లు దొడ్డగణపతి ఆలయ ఈవో అరవిందబాబు తెలిపారు.

20కి పైగా రకాలు

కురికాలు అచ్చు, క్యూబ్, కుల్ఫీ, బకెట్, గరిఅచ్చుతో పాటు 20 రకాలకు పైగా బెల్లం అచ్చులు అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన కిలో బెల్లం రూ.80 నుంచి 120 వరకు పలికింది. ప్రజలు కూడా బెల్లం ఆరోగ్య లాభాలను తెలుసుకుని కొంటున్నారని మండ్య రైతు వెంకటేశ్ తెలిపారు.

అద్దె భవనంలోనే ఎన్‌సీసీ

- స్వంత కట్టడం లేని కార్యాలయం
- సంస్థ కార్యకలాపాలకు ఇబ్బంది



అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కార్యాలయం ఇదే

కోలారు: యువతలో నాయకత్వ లక్షణాలను పెంచి, వారిని సైనికులుగా తయారుచేసే ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) కార్యాలయానికి స్వంత భవనం లేక గత 60 ఏళ్లుగా అద్దె భవనంలోనే నడుస్తోంది. దీని వల్ల ఎన్‌సీసీ కార్యకలాపాలకు వెనకడుగు పడుతోంది. 1953లో మైసూరులో ప్రారంభమైన ఎన్‌సీసీ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను తన కార్యాలయాలను స్థాపించి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. జిల్లాలో 1964లో కర్ణాటక ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయాన్ని నగరంలో ప్రారంభించి 59 సంవత్సరాలు దాటింది. కార్యాలయాన్ని ప్రారంభించి దశాబ్దాలు గడిచినా నేటికీ కార్యాలయాన్ని బాడుగ భవనంలోనే నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో ఫైనాన్స్ విభాగం, కమాండెంట్ అధికారి కార్యాలయం, ఇలా వివిధ కార్యాలయాలు ఒకే భవనంలో నిర్వహిస్తుండడం వల్ల ఇబ్బంది కలుగుతోంది.

ప్రభుత్వాలు మారినా ప్రయోజనం సున్నా

ప్రభుత్వాలు మారినా ఎన్‌సీసీ కార్యాలయానికి ఒక స్వంత భవనం నిర్మించాలనే ఆలోచన రాకపోవడం శోచనీయం. జిల్లా కార్యాలయం నుంచి ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, రక్షణ శాఖలో సేవలందించడానికి వెళ్లే వారికి అవసరమైన శిక్షణను అందిస్తోంది. డిగ్రీ, ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అదనపు శిక్షణ నివ్వడానికి సరైన స్థలం కోసం జిల్లా యంత్రాంగానికి, జిల్లా పంచాయతీకి పలుమార్లు మనవి సమర్పించినా స్పందన లభించలేదు. ఎన్‌సీసీ కార్యాలయం కోసం 8 ఎకరాల స్థలం మంజూరు చేయాలని జెడ్పీ, జిల్లా యంత్రాంగానికి మనవి చేసినా ఇంతవరకు స్పందన కనిపించలేదు. ఈ కారణంగా కార్యాలయాన్ని వేరే జిల్లాకు తరలిస్తారేమోననే అనుమానాలు జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

కుంటుపడుతున్న కేడెట్ల శిక్షణ

2024 జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో బెంగళూరులోని మాణిక్‌షా పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి కోలారు ఎన్‌సీసీ కార్యాలయానికి అవకాశం లభించలేదు. ఎన్‌సీసీ కేడెట్‌లకు తగిన శిక్షణ అందించకపోవడమే కారణమని అంటున్నారు. కళాశాలల్లో ఎన్‌సీసీ బృందాలను రచించడం, శిక్షణా కార్యక్రమాలు, క్యాంప్‌లు నిర్వహించడం వంటివి సకాలంలో జరగాలి. ప్రతి శనివారం కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ నివ్వడానికి ఎన్‌సీసీ నుంచే కమాండెంట్‌లు వస్తారు. ఇవన్నీ సక్రమంగా జరగడానికి ఎన్‌సీసీలో పలు సమస్యలు వేధిస్తున్నాయి.

రిపబ్లిక్ వేడుకలకు దూరం బాధాకరం

సౌకర్యాల కొరత వల్ల ఎన్‌సీసీ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించడానికి సాధ్యం కావడం లేదు. ఇతర జిల్లాలతో పోలిస్తే కోలారు జిల్లాలో ఎన్‌సీసీ కార్యకలాపాలు వెనుకంజలో ఉన్నాయి. వచ్చే రిపబ్లిక్ దినోత్సవ వేడుకలకు జిల్లా ఎన్‌సీసీ ట్రూప్ ఎంపిక కాకపోవడం బాధగా ఉంది. ఈ కార్యకలాపాలు అన్ని సక్రమంగా నిర్వహించడానికి స్వంత భవనం, స్థలం అవసరం.

–వికాస్ శుక్లా, కమాండెంట్ అధికారి, కోలారు

ఎన్‌సీసీని అభివృద్ధి చేయాలి

ఎన్‌సీసీని అభివృద్ధి చేయడానికి రాజకీయ నాయకులకు శ్రద్ధ లేదు. అధికారుల్లో కూడా తగినంత ఆసక్తి కనిపించడం లేదు. యువకుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని నింపే ఎన్‌సీసీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

–వీకే రాజేష్, నగసభ మాజీ ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

18వ రోజుకు చేరిన రైతుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న రైతులు

కంప్లి: మల్లప్పనకెరె చెరువు భూములను వాటిని సాగు చేసుకుంటున్న రైతులకు అప్పగించాలని ఒత్తిడి చేస్తూ కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో కురుగోడు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రైతులు చేపట్టిన నిరవధిక ధర్నా 18వ రోజుకు చేరుకుంది. మల్లప్పనకెరె అనే పేరును ప్రభుత్వం మార్చడం తగదని, ప్రస్తుతం బెళగావిలో జరుగుతున్న సమావేశాల్లో మల్లప్పనకెరె భూముల విషయంపై చర్చించాలని ఆందోళనకారులు ఒత్తిడి చేశారు.

పార్కింగ్ స్థలాల పరిశీలన



బెంగళూరు రోడ్డులో పార్కింగ్ స్లాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

బళ్లారిఅర్బన్: నగరంలో రోజురోజు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య కూడా పెరగడంతో ప్రధాన రోడ్లపై ఇరుకైన చోట్ల పార్కింగ్ చేస్తూ ఇబ్బందులు కలిగించడం వల్ల సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, డీఎస్పీ, ట్రాఫిక్ సీఐ అయ్యనగౌడ పాటిల్ నగరంలోని బెంగళూరు రోడ్డు, బండిమోట్, కురికమేలా, ఏపీఎంసీ, కారు వీధి, మోతీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, రాయల్ సర్కిల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు వాహనాల నిలుపుదలపై కూడా సమీక్షించారు. రోడ్డుకు ఇరువైపుల ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపరాదని, పార్కింగ్‌కు కేటాయించిన చోటే వాహనాలను నిలపాలని సూచించారు. పరిశీలించిన అనంతరం వాహనాల నిలుపుదల ప్రాంతాలకు పార్కింగ్ బోర్డులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇష్టానుసారంగా వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తే జరిమానాతో పాటు చర్యలు తప్పవన్నారు.

అక్రమార్కులపై విచారణకు డిమాండ్



ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై విచారణ చేపట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమానంద యాదవ్ మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఓడించడానికి ఎంపీ, ఎమ్మెల్యేల నివాసంలో రూ.కోట్లాది నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయన్నారు. అక్రమ సంపాదనపై విచారణ జరిపి నిందితులపై చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేశారు.

అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్ట్

తుమకూరు: తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకాలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో పోలీసులు ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. రెండు నెలల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిక్కనాయకనహళ్లి పోలీసులు కేసు నమోదు చేశారు. చిక్కనాయకనహళ్లి తాలూకా కందికెరె సమీపంలో ఈ దారుణం జరిగింది. 17 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు. బాలిక తల్లి ఈనెల 8న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి వారిపై పోక్సో కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారమే గ్రామ సభ ఉద్దేశం

కోలారు: గ్రామాల్లోని సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు సుగటూరు జీపీ అధ్యక్షుడు ఎస్.భూపతిగౌడ తెలిపారు. సోమవారం సుగటూరు జీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలను జీపీల్లో సక్రమంగా అమలు చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. జీపీ అభివృద్ధి అధికారి రమేష్ మాట్లాడుతూ జీపీ వ్యాప్తిలోని అన్ని గ్రామాల్లోను వార్డు సభలను నిర్వహించి సమస్యలను తెలుసుకుని వాటిని పంచాయతీ స్థాయిలోనే పరిష్కరిస్తామన్నారు. ఉపాధి హామీలో వ్యక్తిగత, సముదాయ పనుల కింద పొలం గట్లు, వ్యవసాయ గుంతల నిర్మాణం తదితర పనులను చేసుకోవచ్చన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో సుగటూరు జీపీ ఉపాధ్యక్షుడు నరసమ్మ, సభ్యులు ఎస్‌వీ నారాయణగౌడ, కె.రవి, ఎస్ఎం మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి చిత్తానుసారం సేవలు అందించాలి

- సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జే.డీ మోజస్



పాస్టర్ల సమావేశంలో వివిధ చర్చీల పాస్టర్లు

శివాజీనగర: సర్వమానవాళి పాప పరిహార నిమిత్తం సిలువపై రక్తం చిందించిన ఏసుక్రీస్తు గురించి సువార్తను అందించే సేవకులు దేవుడి చిత్తానుసారంగా తమ జీవితాలను గడవుతూ ఉత్తమ సేవలు అందించాలని మత్తికెర రస్సెల్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ సీనియర్ పాస్టర్ డాక్టర్ జే.డీ.మోజస్ ఉపదేశించారు. సోమవారం కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ (కేటీసీఎంఎఫ్) ఆధ్వర్యంలో మత్తికెర రస్సెల్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన దైవ సేవకుల సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం క్రైస్తవ సముదాయంలో వివిధ శాఖలుగా ఏర్పడి తమకు ఇష్టమొచ్చిన విధంగా పాటలు పాడటం, ప్రసంగాలు చేయటం బాధకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పరిశుద్ధ బైబిల్ గ్రంథంలో ఉన్నది ఉన్నట్లుగా బోధించేందుకు సేవకులు సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. సేవకులు తమ వ్యక్తిగత జీవితంలో కళంకం లేకుండగా జీవించాలన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లకు సఫారి సూట్, మహిళా సేవకురాళ్లకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేటీసీఎంఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజిమన్, చైర్మన్ డాక్టర్ రెవరెండ్ ప్రేమానందం, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ వీ.సాలోమన్, కోశాధికారి రెవరెండ్ ఏ.జీ.జయానందం తదితరులు పాల్గొన్నారు.

అర్జునకు ఏమైందో చెప్పాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధ మైసూరు దసరా వేడుకల్లో సుమారు 22 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పాల్గొని నాడదేవత చాముండేశ్వరిదేవి అంబారీని 8 సార్లు మోసిన ఘన చరిత గల కెప్టెన్ అర్జున ఏనుగు మరణంపై మైసూరువాసుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అర్జున మరణంపై విచారణ జరిపి నిజాలు వెల్లడి చేయాలని పాత కలెక్టరేట్ వద్ద వందలాది మంది నగరవాసులు ధర్నా చేశారు. అర్జున ఫోటోలు, కొవ్వొత్తులు పట్టుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అర్జున ఏనుగుతో అటవీ సిబ్బంది ఇటీవల హాసన్ జిల్లా సకలేశపురలో అడవి ఏనుగును కట్టడి చేయడానికి ప్రయత్నించడం, ఆ సమయంలో అడవి ఏనుగు దాడి చేయడంతో అర్జున మరణించడం తెలిసిందే. అయితే అటవీ సిబ్బంది అడవి ఏనుగుపైకి జరిపిన కాల్పుల్లో పొరపాటున తూటా అర్జునకు తగిలి చనిపోయిందని ప్రచారం సాగుతోంది. అసలు ఆ కార్యాచరణకు అర్జునను తీసుకెళ్లడమే తప్పని అనేకమంది అటవీశాఖను ఎండగట్టారు. ఈ నేపథ్యంలో మైసూరులో ఆందోళనలు నిర్వహించారు. అర్జున అడవుల్లో అనేక మదపుటేనుగులను కట్టడి చేసిందని, అలాంటి ఏనుగు దాడిలో చనిపోవడం నమ్మశక్యంగా లేదని వాపోయారు.

అదుపు తప్పి మోరీలోకి కారు బోల్తా



ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

మాలూరు: కారు అదుపు తప్పి మోరీలోకి పడిన ఘటన సోమవారం తాలూకాలోని హోసూరు మెయిన్ రోడ్డులోని కోడిహళ్లి గేట్ వద్ద జరిగింది. ఘటనలో కారు డ్రైవర్, ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. అయితే వారి వివరాలు తెలియరాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గమనించి కారులో ఉన్న వారిని వెలికితీసి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. గేట్ వద్ద ఉన్న మోరీ శిథిలావస్థలో ఉండడంతో కొద్ది రోజులుగా పీడబ్ల్యూడీ శాఖ వారు మరమ్మతు చేస్తున్నారు. ఇక్కడ తరచు ప్రమాదాలు జరుగుతున్నందున మోరీ మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

108 అంబులెన్స్ సంస్థకు అవార్డు

కోలారు: జపాన్‌లోని టోకియోలో జరిగిన 6వ ఈఎంఎస్ అవార్డు ప్రదానోత్సవంలో ముక్తి ఈఎంఆర్‌జీఎస్ ఆసియా కోవిడ్ వారియర్ అవార్డును అందుకున్నట్లు జిల్లా డివిజనల్ వ్యవస్థాపకుడు బీఎం కటీల్ తెలిపారు. జిల్లాలో పాత అంబులెన్స్ వాహనాలను మార్పు చేసి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 262 అంబులెన్స్‌లను విడుదల చేసిందన్నారు. జిల్లాకు మొత్తం 14 అంబులెన్స్‌లను వచ్చే నెలలో ఇస్తోందన్నారు. కోవిడ్ అత్యవసర సమయంలో గ్రీన్ హెల్త్ సర్వీస్ ఈఎంఆర్‌సీ అత్యవసర వేదిక సాంకేతిక పరిజ్ఞానంతో కోవిడ్ సమయంలో దేశ వ్యాప్తంగా 25.3 లక్షల మందికి అత్యవసర సేవలను అందించారు. దీనిని గుర్తించి టోకియోలో జరిగిన ఆసియా సమ్మేళనంలో కోవిడ్ -19 వారియర్ అవార్డును అందించినట్లు తెలిపారు.

ఐపీడీ సాలప్ప జయంతి

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె ఆధ్వర్యంలో పౌరకార్మికుల పితామహుడు ఐపీడీ సాలప్ప 94వ జయంతి ఘనంగా నిర్వహించారు. సోమవారం పాలికె కేంద్ర కార్యాలయ ఆవరణలో గల ఐపీడీ సాలప్ప విగ్రహానికి బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమిషనర్ హరీశ్‌కుమార్, రెడ్డి శంకరబాబు, వలయ కమిషనర్లు స్నేహల్, వినోద్‌ప్రియా, జాయింట్ కమిషనర్ ప్రతిభ, డిప్యూటీ కమిషనర్ మంజునాథస్వామి పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు

శివాజీనగర: కాంగ్రెస్ నాయకుల అక్రమాలకు వ్యతిరేకంగా ధ్వజమెత్తిన బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా పెట్టుకొని దాడులు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా బీజేపీ నాయకుడిపై దాడి జరిగిన విషయంపై సామాజిక మాధ్యమాల్లో ఖండించారు. కల్బుర్గి, బెళగావి కేసుల నేపథ్యంలో భద్రావతిలో కూడా బీజేపీ నాయకుడు గోకుల్ కృష్ణన్‌పై గూండాలు జరిపిన దాడి, ఆందోళనకర విషయమని అన్నారు. భద్రావతిలో జరుగుతున్న అక్రమ దందాలకు స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉండటంపై సోషల్ మీడియాలో ప్రశ్నించినపుడు గోకుల్‌పై దాడి జరిగేందుకు ప్రధాన కారణమైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా పెట్టుకొని దాడి చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపించారు. ఈ దాడిని తీవ్రంగా పరిగణించి పార్టీ కార్యకర్తకు భద్రత ఇవ్వటంతో పాటుగా దుండగులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆకతాయిల వీలింగ్

- భయాందోళనలో వాహనదారులు

దొడ్డబళ్లాపురం : దొడ్డబళ్లాపురం చుట్టుపక్కల ఇటీవల వీలింగ్ చేసే ఆకతాయిల సంఖ్య ఎక్కువవుతోంది. బెంగళూరు సిటీలో సీసీటీవీ కెమెరాలు ఉండడం, పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తుండడంతో ఆకతాయిలు బెంగళూరు సిటీ బయటకు వచ్చి వీలింగ్‌కు పాల్పడుతున్నారు. నిత్యం ఉదయాన్నే పెద్దపెద్ద శబ్దాలు చేసుకుంటూ బైక్‌లపై వచ్చే ఆకతాయిలు హైవేపై వీలింగ్ చేస్తూ వాహనదారులకు దడ పుట్టిస్తున్నారు. దొడ్డబళ్లాపురం–దాబస్‌పేట–దేవనహళ్లి–హొసకోట మార్గాలను కలుపుతూ కొత్తగా ప్రారంభించబడిన హైవేపై పడుతున్నారు. నందికొండ, ఈషా ఫౌండేషన్‌కు వచ్చే యువతీ యువకులు బెంగళూరు సిటీ దాటగానే వీలింగ్ చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండు చేస్తున్నారు.

మహిళలపై యాసిడ్ దాడుల్లో బెంగళూరు ప్రథమం

బనశంకరి: 2022లో దేశంలోనే మహిళలపై అత్యధికంగా యాసిడ్ దాడులకు పాల్పడిన నగరాల్లో కర్ణాటక రాజధాని బెంగళూరు మొదటిస్థానంలో నిలిచిందని ఎన్‌సీఆర్‌బీ నివేదికలో ప్రస్తావించింది. ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన నివేదిక అనుగుణంగా దేశంలోని 19 మహానగరాలపైకి 2022లో బెంగళూరు మహానగరంలో మహిళలపై 8 యాసిడ్ దాడులు కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో దేశంలోనే అత్యధిక కేసులు ఉండటం విశేషం. మిగిలిన 7 యాసిడ్ దాడి కేసులు నమోదైన ఢిల్లీ రెండోస్థానంలో ఉండగా ఐదు యాసిడ్ దాడి కేసులతో గుజరాత్ అహ్మదాబాద్ మూడోస్థానంలో ఉంది. అంతేగాక ఢిల్లీలో 7, బెంగళూరులో 3, అహ్మదాబాద్, హైదరాబాద్‌లో తలా రెండు యాసిడ్ దాడి యత్నం కేసులు నమోదయ్యాయి. గత ఏడాది బెంగళూరులో యువతిపై యాసిడ్ దాడి తీవ్ర సంచలనం సృష్టించింది.

చోరీకి యత్నించిన ఇద్దరు అరెస్టు

శ్రీనివాసపురం: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని డ్రాప్ అడిగి మధ్యలో అతని కంటిపై బూడిద చల్లి దొంగతనం చేయడానికి ప్రయత్నించిన ఇద్దరిని స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించిన ఘటన తాలూకాలోని తొట్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా పామిడి సమీపంలోని కొండాపురం గ్రామానికి చెందిన గణేష్, మరో మైనర్ బాలుడిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. వడ్డరపాళ్యకు చెందిన వెంకటేష్ గ్రామం నుంచి టీపీ కార్యాలయానికి వచ్చి తన ద్విచక్రవాహనంలో ఉదయం వెళుతుండగా అయ్యప్ప స్వామి మాల వేసుకున్న ఓ వ్యక్తి తొట్లి గ్రామం వద్ద డ్రాప్ అడిగాడు. బైక్ నిలబెట్టగానే వెంకటేష్ ముఖంపై బూడిద లాంటి పదార్థాన్ని చల్లాడు. వెంకటేష్ స్పృహ కోల్పోగానే అతని వద్ద ఉన్న రూ.700 నగదు, మొబైల్‌ను దోచుకుని పరారయ్యారు. 20 నిమిషాల అనంతరం వెంకటేష్‌కు స్పృహ రావడంతో జరిగిన విషయాన్ని తొట్లి గ్రామస్తులకు తెలిపాడు. అంతలో గ్రామస్తులు అనుమానంగా ఉన్న వ్యక్తిని నిలదీసి ప్రశ్నించడంతో విషయం బయట పడింది. అతనితో పాటు ఉన్న మరో వ్యక్తి వివరాలు తెలుసుకుని అతనిని కూడా రప్పించారు. కాగా అతను మైనర్. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

కోలారు వార్తలు...

డిమాండ్లు తీర్చాలని వినతి

కోలారు: తమను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ అతిథి ఉపన్యాసకులు సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారన్నారు. అతిథి ఉపన్యాసకులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తోందన్నారు. బెళగావిలో జరుగుతున్న సమావేశాల్లోనైనా తమ డిమాండ్లపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ప్రతిపక్ష నాయకులు ఆర్.అశోక్, హెచ్.డి.కుమారస్వామి తమ సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అక్రంపాషాకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి ఉపన్యాసకుల సమాఖ్య రాష్ట్ర సంచాలకురాలు సీఎస్ నాగమణి, జిల్లా అధ్యక్షుడు ఏబీ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అవినీతిపై దర్యాప్తు కోసం ధర్నా



కోళ్లతో సహా ధర్నా చేస్తున్న దృశ్యం

కేజీఎఫ్: కేజీఎఫ్ బెస్కాంలో జరిగిన అవినీతి అక్రమాలపై సీబీఐతో తనిఖీ చేయించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు సోమవారం బెస్కాం కార్యాలయం ముందు ధర్నా చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ మాట్లాడుతూ బెస్కాం కార్యాలయంలో టీసీ నుంచి మొదలుకుని స్తంభాల మంజూరు వరకు అవినీతి పెచ్చుమీరిందన్నారు. లంచం ఇవ్వనిదే ఏ పనీ జరగడం లేదని ఆరోపించారు. శాఖలోని పలువురు అధికారులకు, కాంట్రాక్టర్లకు బెస్కాం బంగారు గుడ్డు పెట్టే బాతులా మారిపోయిందన్నారు. బెస్కాం వివిధ పనుల్లో కోట్లాది రూపాయల దుర్వినియోగంపై వెంటనే సీబీఐతో తనిఖీ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం బెస్కాం ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు రామసాగర వేణు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరమశివా పాహిమాం రక్షమాం



ప్రత్యేక అలంకరణలో అంతర గంగ కాశీ విశ్వేశ్వర స్వామి



అంతరగంగ కొండపైకి వెళుతున్న భక్త జనసందోహం



సోమేశ్వరస్వామి ఆలయం వద్ద దీపాలను వెలిగిస్తున్న భక్తుల



మాలూరులో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



పర్వత మల్లికార్జునస్వామికి ప్రత్యేక అలంకరణ



కంప్లి: దేవస్థానంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు



శివలింగానికి వెన్న అలంకరణ



- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కోలారు: కార్తీక చివరి సోమవారం నాడు నగరంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. దక్షిణ కాశీగా ప్రఖ్యాతి గాంచిన అంతరగంగ కాశీ విశ్వేశ్వరాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సోమవారం అంతరగంగ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయానికి నగరం, జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తమిళనాడు నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అంతరగంగ వద్దకు భక్తులు వెళ్లడానికి అనువుగా పలువురు సమాజ సేవకులు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. అంతరగంగ పర్వతంపై రాతి బసవణ్ణ నోటి నుంచి వస్తున్న గంగాజలాన్ని భక్తులు తలపై ప్రోక్షణ చేసుకుని తరించారు. ఉదయం 6 గంటల నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అంతరగంగ కాశీ విశ్వేశ్వర స్వామి దర్శనం కోసం బయలుదేరి వెళ్లారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం కాశీ విశేశ్వర స్వామి లక్ష దీపోత్సవంలో యేటా మాదిరిగా భజరంగదళ, వీహెచ్‌పీ కార్యకర్తలు అంతరగంగ రోడ్డుకు వెళ్లే బస్టాండు సర్కిల్ వద్ద రంగుల కాగితాలతో సర్కిల్‌ను, విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. నగరంలోని ప్రసన్న సోమేశ్వర ఆలయాన్ని కూడా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నంది విగ్రహం ముందు మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

ప్రసన్న సోమేశ్వరస్వామి దేవాలయంలో..

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో ఉన్న పురాతన ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. మూల విగ్రహానికి ఉదయం విశేష పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. మహిళలు ఆలయం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. శివనామ స్మరణతో ఆలయం మారు మోగింది. స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో ప్రధాన అర్చకులు వెంకటేష్ నేతృత్వంలో పూజలు జరిగాయి.

గండి లక్ష్మినరసింహ దేవస్థానంలో..

కంప్లి: సండూరులోని ధర్మాపురకు ఆనుకొని ఉన్న గండి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో కార్తీక ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పాల్గొని స్వామి వారి విశేష అభిషేక పూజల్లో, దీపోత్సవంలో పాల్గొన్నారు. ఇక ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

బనశంకరి సన్నిధిలో కార్తీక దీపోత్సవం

బనశంకరి: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా బనశంకరీదేవి సన్నిధిలో కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం బనశంకరీదేవి సన్నిధిలోని శ్రీ పర్వతమల్లికార్జునస్వామి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ప్రత్యేక అభిషేకం, అర్చనలు, విశేష అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద ఎత్తున మట్టిదీపాలు వెలిగించారు. దీపోత్సవాన్ని ప్రధాన అర్చకులు చంద్రమోహన్, ఈఓ లక్ష్మీ లాంఛనంగా ప్రారంభించారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలకు నవనీత శోభ

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఉత్తరహళ్లి–కెంగేరి ప్రధాన రహదారిలోని శ్రీనివాసపురలో వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో జ్యోతిర్లింగాలకు ఆలయ అర్చకులు వెన్న అలంకరణ చేశారు. అనంతరం ఓంకార ఆశ్రమ పీఠాధిపతి మధుసూదనానందపురి స్వామీజీ జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జ్యోతిర్లింగాలను దర్శించుకుని సాయంత్రం ఆలయం వద్ద దీపోత్సవం చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

తుమకూరు: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తుమకూరు హొరపేటలోని కరిబసవేశ్వర స్వామి మఠం ఆవరణంలో కాశీ విశ్వనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని విబూదితో అలంకరించారు. అదే విధంగా ఆలయంలోని గణపతి, అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని వెన్నతో అలంకరించి పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

హోసకోటెలో తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీల దృశ్యం

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధి హోసకోటె పట్టణంలో కేసీఎం లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ తైక్వాండో కరాటే ఆకడమిలో విద్యార్థులకు నిర్వహించిన కరాటే పోటీలు అలరించాయి. పోటీలను విశ్రాంత సైనికుడు ఉనివాస్, కెసిఎం లాజిస్టిక్స్ వ్యవస్థాపకులు నాగేశ్, జర్నలిస్ట్ ఎం.ఎస్.ఆర్ పాల్గొని ప్రారంభించారు. పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుపై చిరుత దాడి

మైసూరు: పొలం పనుల్లో ఉన్న రైతుపై చిరుత దాడి చేసి గాయపరిచిన ఘటన మైసూరు జిల్లా పిరియా పట్టణ తాలూకా కెల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రాజేష్ చిరుత దాడిలో గాయపడిన బాధితుడు. పొలంలో ఉండగా ఒక్కసారిగా చిరుత దాడి చేసి చెవి, తలపై గాయపరిచింది. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని అతన్ని పిరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

రోదసీ ల్యాబ్ ప్రారంభం



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి

బొమ్మనహళ్లి: ప్రతి ఒక్కరిలోను ఒక్క అద్భుతమైన ప్రతిభ ఉంటుందని, అలాంటి వారిని ప్రోత్సహించినప్పుడు మాత్రమే ఆ ప్రతిభ మనకు తెలుస్తుందని రాష్ట్ర రవాణశాఖ మంత్రి, బీటీఎం లేఔట్ ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. బీటీఎం లేఔట్ అడుగోడి వార్డులో కేఎస్ఆర్పి పోలీసు క్వార్టర్స్‌లోని కర్ణాటక పబ్లిక్ పాఠశాల రోదసీ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలను కల్పించాలని అన్నారు. రోదసీ ప్రయోగాలయం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుందని, ఇలాంటివి ప్రతి ప్రభుత్వ బడిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఎన్. మంజునాథ్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ లేఖతో ఉద్యోగానికి గాలం

యశవంతపుర: ముఖ్యమంత్రి ఆప్త కార్యదర్శి పేరుతో నకిలీ లెటర్‌పాడ్‌ను ఉపయోగించి ప్రజాపనుల శాఖలో ఉద్యోగ నియమాకంపై లేఖ బయట పడింది. ఇందుకు సంబంధించి సీఎం ఆప్త కార్యదర్శి డాక్టర్ వెంకటేశయ్య విధానసౌధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం కార్యాలయం నుంచి ప్రజాపనులశాఖ మంత్రికి వెంకటేశయ్య పేరుతో నకిలీ లెటర్‌పాడ్‌ను ఉపయోగించారు. మీ శాఖలో తాత్కాలిక ఉద్యోగం ఇవ్వాలని నకిలీ లెటర్ పంపటంతో ఈ విషయం బయట పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని నకిలీ లెటర్ పంపిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: కన్నడ రాజ్యోత్సవం, పవర్ స్టార్ పునీత్‌రాజ్ కుమార్ జ్ఞాపకార్థం నగరంలోని కృష్ణరాజపురం పరిధి విమానపురలో ఉన్న కై రళి విద్యాసంస్థలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు డి.కే.మోహన్ ప్రారంభించారు. అనంతరం పలువురికి కళ్లు, చెవులతో పాటు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

రామ మందిరం కల సాకారమవుతోంది



తుమకూరు: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో నిర్మాణమవుతున్న రామ మందిరం ఇప్పటికే చివరి దశలో ఉందని, శతాబ్దాల హిందువుల కల సాకారమవుతోందని, ఈ చిరస్మరణీయ వేడుకను పండువలా జరుపుకోవాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టీ ఉడుపి పెజావర మఠానికి చెందిన విశ్వ ప్రసన్న తీర్థపాద స్వామీజీ అన్నారు. సోమవారం తుమకూరు నగరంలోని శ్రీరామమందిరంలో సోమవారం స్వామీజీ అయోధ్య నుంచి తీసుకువచ్చిన అంక్షింతలు తాలూకా నాయకులకు అందజేసి మాట్లాడారు. అయోధ్యలో జనవరి 22న శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట జరుగుతుందని, భక్తులు వారి వారి గ్రామాల్లో ఆలయాల్లో పూజలు చేయాలని అన్నారు.

కన్నుల పండువగా శెనక్కాయల పరుష





బసవణ్ణకు శనక్కాయల తలాభారం నిర్వహిస్తున్న ఎంపీ తేజస్వీ సూర్య, ఎమ్మెల్యేలు ఉదయ్ గరుడాచార్, రవిసుబ్రమణ్య, ఎమ్మెల్సీ శరవణ తదితరులు, దొడ్డ బవవణ్ణ దర్శనానికి బారులు తీరిన భక్తులు

- బసవనగుడిలో గ్రామీణ సందడి
- భారీగా తరలివచ్చిన నగర వాసులు

బనశంకరి: బసవనగుడిలో గ్రామీణ సందడి నెలకొంది. పురాతన చారిత్రక నేపథ్యం కలిగిన బసవనగుడి దొడ్డబసవణ్ణ శెనక్కాయల పరుష సోమవారం అధికారికంగా ప్రారంభమైంది. కార్తీకమాసం చివరి సోమవారం ఉదయం దొడ్డబసవణ్ణకు ఆలయ అర్చకులు శెనక్కాయలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. చిక్కపేటే ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్, బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య, ఎమ్మెల్సీ టీఏ.శరవణ, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య దొడ్డబసవణ్ణను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు దొడ్డబసవణ్ణకు శెనక్కాయలతో తులాభారం నిర్వహించి అధికారికంగా శనక్కాయల పరుషను ప్రారంభించారు. అనంతరం భక్తులకు తులాభారం నిర్వహించిన శనక్కాయలను అందజేశారు.

సందడే సందడి :

ఇక సోమవారం పరుషకు నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చి దొడ్డ బసవణ్ణను దర్శించుకున్నారు. అనంతరం శనక్కాయలు, ఇతర తినుబండాలు కొనుగోలు చేస్తూ యువతీ యువకులు సందడి చేశారు. మూడు రోజుల నుంచి బసవనగుడిలో శనక్కాయల వ్యాపారం భారీగా జరుగుతుంది. రామకృష్ణమఠం నుంచి ఎస్ఆర్.కాలనీ, బుల్ టెంపుల్ రోడ్డుకు ఇరువైపుల శనక్కాయల రాశులు దర్శనమిస్తున్నాయి. పరుషకు చేతిసంచులు తీసుకు రావాలని పరిసరస్నేహి సభ్యులు కోరుతున్నారు. ప్లాస్టిక్ రహిత పరుష నిర్వహించే ఉద్దేశంతో హసిరు దళ, అదమ్య చేతనతో పాటు 10 ఎన్‌జీఓ సంస్థలు జాగృతం చేస్తున్నాయి. సాయంత్రం 6 గంటలకు కెంపాబుదిచెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ మళ్లింపు :

లాల్‌బాగ్ పశ్చిమగేట్ ద్వారం వైపునుంచి వాణివిలాస్ రోడ్డు ద్వారా 5వ మెయిన్‌రోడ్డు చామరాజపేట, గాంధీబజార్ మెయిన్‌రోడ్డు వైపు నుంచి బుల్‌టెంపుల్‌రోడ్డు ద్వారా హనుమంతనగర వైపునకు వాహనాలు సంచరించాలి. బుల్‌టెంపుల్‌రోడ్డు రామకృష్ణ ఆశ్రమం సర్కిల్ కుడివైపు తీసుకుని హయవర్ధనరావ్ రోడ్డు ద్వారా గవిపురం 3వ క్రాస్ ద్వారా ముందుకు వెళ్లి మౌంట్ జాయ్‌రోడ్డు ద్వారా హనుమంతనగర చేరుకోవాలి. ఏపీఎస్‌కాలేజీ క్రీడామైదానం, ఎస్ఆర్. కాలనీ, హయవర్ధనరావ్ రోడ్డులోగల కోహినూరు క్రీడామైదానం, రామకృష్ణ ఆశ్రమజంక్షన్, ఉదయబాను క్రీడామైదానంలో పార్కింగ్‌కు అవకాశం కల్పించారు.



జాతరలో శనక్కాయలు కొంటున్న యువతులు



శనక్కాయల దుకాణాల వద్ద రద్దీ

వైభవంగా రథోత్సవం



తేరును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని నగరానికి సమీపంలోని కల్లంతరాయని గుట్టలో పురాతన కల్లినాథేశ్వరుని వార్షిక రథోత్సవం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. సోమవారం ఉత్సవ మూర్తులను తేరుపై అధిష్టించగా మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు.

రామలింగేశ్వర స్వామి తేరు ఉత్సవం



తేరు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గౌరిబిదనూరు: నగరానికి సమీపంలో వున్న హీరే బిదనూరులోని చివరి కార్తీక సోమవారం పురస్కరించుకొని రామలింగేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి శివశంకరరెడ్డి తన మద్దతుదారులతో కలిసి పూజలు చేశారు.

నాగేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బొమ్మనహళ్లి: బెంగళూరు దక్షిణ నియోజకవర్గంలోని బేగూరులో పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. నూతన అన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇకపైన ప్రతి సోమవారం భక్తులకు ఉచిత అన్నదానం జరుగుతుందని తెలిపారు. దాత హెచ్.శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జానపద కళలకు ప్రోత్సాహం అవసరం



జి బొమ్మసంద్ర గ్రామంలో జానపద నృత్యం

గౌరిబిదనూరు: గతంలో జానపద కళలకు రాజాశ్రయాలు లభించేది, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ వ్యవస్థలో ప్రభుత్వాలు జానపద కళాకారులను ఆదుకొని ప్రోత్సహించాలని తాలూకా (గదరె బొమ్మసంద్ర) జి బొమ్మసంద్ర గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు సరస్వతమ్మ తెలిపారు. సోమవారం సాధనా సాంస్కృతిక సామాజిక సంస్థ బెంగళూరు, తాలూకా వెళపి గ్రామంలోని సాంస్కృతిక, సామాజిక అభివృద్ధి సంఘం వారు చేరి జి బొమ్మసంద్ర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహించిన జానపద కళా సౌరభ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జానపద పాటల నుండి మన పూర్వీకుల జీవన విధానాలను, ఆహార పద్ధతులను మనం తెలుసుకొని అలవరచుకోవడానికి వీలుంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం రామకృష్ణ విద్యార్థులకు జానపద పాటలు నేర్పాల్సిన అవసరాన్ని తెలిపారు. కార్యక్రమంలో కోలాట, జానపద నృత్యం, పాటల ఆలాపన, బాల్య సార అసు కన్నడ సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో గౌరమ్మ, నాగభూషణరెడ్డి, శ్రీనాథరెడ్డి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతోనే ఆటో డ్రైవర్ హత్య



హత్యకు గురైన అరుణ్ (ఫైల్)

యశవంతపుర: పాతకక్షలతో ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన 11 మందిని బెంగళూరు బ్యాటరాయనపుర పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 5న రాత్రి బ్యాటరాయనపుర టింబర్ యార్డ్ లేఔట్‌లో అరుణ్ (24)ను హత్య చేశారు. హత్యకేసులో ప్రధాన నిందితులు హరీశ్, మధు, ప్రశాంత్‌లతో పాటు 11 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు హరీశ్ గతంలో జరిగిన హత్య కేసులో అరెస్ట్ కావటానికి అరుణ్ కారణం. అప్పటి నుంచి అరుణ్, హరీశ్‌ల మధ్య ద్వేషం ఏర్పడింది. హరీశ్ వ్యతిరేకులకు అరుణ్ సాయం చేసేవాడు. హరీశ్ ఇంటి వద్ద తిరుగుతూ అతడిపై లేనిపోని ఆరోపణలు చేసేవాడు. దీంతో అరుణ్‌ను ఎలాగైన హత్య చేయాలని ప్లాన్ వేసుకుని, ఈనెల 5న టింబర్ యార్డ్‌లేఔట్ రోడ్డులో ఇతరులతో కలిసి హత్య చేశాడు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు 11 మందిని అరెస్ట్ చేశారు.

యువతి, యువకుడిపై దాడి

యువతి, యువకుడిపై దాడి చేసి బెదిరించిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉప్పినంగడిలో జరిగింది. ఈ ఘటన నెల రోజుల క్రితం జరగ్గా అలస్యంగా వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. పరిచయం ఉన్న విద్యార్థినితో మరో విద్యార్థి వెళ్లతుండగా కొందరు యువకులు అడ్డగించి దాడి చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారటంతో ఉప్పినంగడి పోలీసులు యువకులపై కేసు నమోదు చేశారు. దాడి చేసిన యువకులు పరారీలో ఉన్నట్లు ఉప్పినంగడి ఎస్ఐ రాజేశ్ తెలిపారు. విద్యార్థులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వివాహిత దారుణ హత్య

యశవంతపుర: ఓ మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన ఆదివారం బెంగళూరులో జరిగింది. జేజేనగర నాలుగో క్రాస్‌కు చెందిన పర్వీన్ తాజ్ (33)ను మహమ్మద్ జునైద్ హత్య చేశాడు. జునైద్‌తో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య దూరం కావడంతో జునైద్ మానసికంగా దెబ్బతిన్నాడు. ఈ క్రమంలో తన సమీప బంధువైన పర్వీన్‌తాజ్‌కు దగ్గరయ్యాడు. ఇటీవల ఆమె జునైద్‌ను దూరం పెట్టింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి జునైద్, పర్వీన్ ఇంటికి వెళ్లి చాకుతో పొడిచి హత్య చేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఆస్పత్రి ముందు జనం ధర్నా



ఆస్పత్రి వద్ద గుమిగూడిన స్థానిక ప్రజలు

హోసూరు: ఆస్పత్రి వ్యర్థాలను, మురుగునీటిని ఇళ్ల మధ్యకు వదలడంపై ఆగ్రహానికి గురైన స్థానిక ప్రజలు ఆస్పత్రిని ముట్టడించారు. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని హడ్కో ప్రాంతంలో ప్రైవేట్ ఆస్పత్రి ఉండగా, ఆస్పత్రి నుంచి వెలువడే మురుగు నీటిని జనావాసాల్లోకి విడుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ ప్రాంత కార్పొరేటర్ కుబేరశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజలతో కలిసి ఆస్పత్రి వద్దకు చేరుకొన్న ఆయన డాక్టర్లతో చర్చించారు. కార్పొరేషన్ ద్వారా మురికి కాల్వ ఏర్పాటు చేయలేదని మురికి కాల్వ ఏర్పాటు చేసే వరకు ఇలాగే ఉంటుందని బదులివ్వడంతో ఆవేశానికి గురైన స్థానిక ప్రజలు ఆస్పత్రిని ముట్టడించారు. పట్టణ పోలీసులు చేరుకొని ఆందోళనకారులతో చర్చించి, కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

హోసూరు వార్తలు..

స్వయం ఉపాధి రుణాలు అందజేత



లబ్ధిదారులకు రాయితీ రుణాలను అందజేస్తున్న కలెక్టర్

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో స్వయం ఉపాధి రాయితీ రుణాలను కలెక్టర్ శరయు అందజేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాగునీరు, రోడ్ల వసతి, ఉచిత కుట్టు యంత్రాలు, వృద్ధాప్యపెన్షన్, ఆర్థిక సాయం, విద్యుత్ కనెక్షన్‌లు కోరుతూ 282 వినతులు అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్వయం ఉపాధి కోసం లబ్ధిదారులకు రాయితీ రుణాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, అధికారులు పన్నీర్‌సెల్వం, పద్మలత, రమేష్‌కుమార్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి ఇంట్లో చోరీ

హోసూరు: దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి, నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులను దోచుకెళ్లిన ఘటన పట్టణంలో జరిగింది. వివరాల మేరకు హోసూరు జలకంఠేశ్వర నగర్‌కు చెందిన పొన్నుస్వామి విద్యుత్ శాఖలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి క్రిష్ణగిరి సమీపంలోని బంధువుల ఇంటికెళ్లాడు. ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చిన ఇతనికి ఇంటిలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నీటిలో పడి పసిబిడ్డ మృతి

క్రిష్ణగిరి: ఇంటి ముందు ఆటలాడుకొంటున్న పసిపాప ఆకస్మాత్తుగా నీటితొట్టిలో పడి మృతి చెందిన ఘటన నాగరసంబట్టి వద్ద జరిగింది. వివరాలు.. కావేరిపట్టణం సమీపంలోని పేరుహళ్లికి చెందిన లారీ డ్రైవర్ వడివేల్, భార్య సంగీత. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. వడివేల్ కొత్తగా ఇంటిని కట్టిస్తున్నాడు. ఆదివారం ఇంటి వద్ద ఏడాదిన్నర కూతురిని వదిలి పనుల్లో ఉన్నారు. ఈ సమయంలో చిన్నారి నీటి తొట్టిలో పడింది. గమనించిన దంపతులు వెంటనే బాలికను బయటకు తీసి బారూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. నాగరసంబట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

టైర్ పేలి డివైడర్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

దొడ్డబళ్లాపురం: టైర్ పేలి కారు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన చెన్నపట్టణ తాలూకా భైరాపట్టణ వద్ద చోటుచేసుకుంది. మైసూరు నుండి బెంగళూరుకు వెళ్తున్న కారు భైరాపట్టణ వద్ద టైర్‌పేలి అదుపుతప్పి రోడ్డు పక్కన డివైడర్‌ను వేగంగా ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తక్షణం వారిని అంబులెన్సులో బెంగళూరు తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలిసిరాలేదు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డీఎంకే పార్టీలో చేరికలు



కొత్తగా చేరిన కార్యకర్తలతో హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్

హోసూరు: అన్నాడీఎంకే పార్టీ నుంచి బయటకొచ్చిన వంద మందికి పైగా కార్యకర్తలు డీఎంకే పార్టీలో చేరారు. అన్నాడీఎంకే పార్టీ నాయకుడు, మాజీ పంచాయతీ అధ్యక్షులు శంసుద్దీన్ నేతృత్వంలో సోమవారం డీఎంకే పార్టీలో చేరే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... డీఎంకే పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం నిర్విరామంగా పనిచేస్తోందని, మహిళా అభివృద్ధికి, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు పలు పథకాలను ప్రవేశపెడుతున్నారని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మురుగన్, డీఎంకే నాయకులు చిన్నతంబి, రఘునాథ్, కరుణాకరన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొనడంతో డిప్లమో విద్యార్థి మృతి చెందగా మిత్రుడికి తీవ్ర గాయాలేర్పడిన ఘటన మత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... చెన్నైకు చెందిన శక్తివేల్ కొడుకు ఆకాష్ (19). క్రిష్ణగిరిలో నివాసముంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ సంస్థలో డిప్లమో చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం మిత్రుడు సంతోష్‌కుమార్ (19)తో కలిసి ద్విచక్రవాహనంలో క్రిష్ణగిరి–తిరువణ్ణామలై రోడ్డుపై వెళ్లుతుండగా సోమర్‌హళ్లి వద్ద ఎదురుగా వెళ్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో ప్రమాదం ఏర్పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన ఇరువురిని స్థానికులు ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలితంలేక ఆదివారం రాత్రి ఆకాష్ మృతి చెందాడు. ఈ ఘటనపై మత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్..

కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో వైరింగ్ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైన ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి సమీపంలోని బి.జి.పుదూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ (18) క్రిష్ణగిరి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో వైరింగ్ పనులు చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వైరింగ్ చేస్తూ అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ లావణ్యమధు

క్రిష్ణగిరి: సూళగిరి సమితి సెంబరసనపల్లి పంచాయతీలో తారురోడ్డు నిర్మాణానికి సోమవారం యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తాలూకాలోని బేరికె రోడ్డు నుంచి బీళాలం గ్రామం వరకు రోడ్డు గుంతమయంగా మారింది. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నెల రోజుల క్రితం స్థానికులు చైర్‌పర్సన్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. విషయంపై స్పందించిన ఆమె సంబంధిత శాఖాధికార్లతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ. 23.10 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో తారురోడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ నాగేష్, ఇంజనీర్ వెంకటేష్, పంచాయతీ అధ్యక్షులు శ్రీనివాస్, యూనియన్ కౌన్సిలర్ భాగ్యవతి రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

యువతి, బాలిక అపహరణ

హోసూరు: హోసూరు, బర్గూరు ప్రాంతాల్లో యువతి, బాలిక కిడ్నాప్ అయినట్లు పోలీసులకు ఫిర్యాదులందాయి. వివరాల మేరకు హోసూరుకు చెందిన 20 ఏళ్ల యువతి గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. జాడ లేకపోవడంతో యువతి తండ్రి తన కూతురిని ఎవరో కిడ్నాప్ చేసినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రిష్ణగిరి జిల్లా బర్గూరు ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో తమ్మగొండనూరువాసి కాళిదాస్ కిడ్నాప్ చేశాడని బాలిక తండ్రి బర్గూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రెండు కేసుల్లోనూ విచారణ చేపట్టారు.

దుర్గమ్మ సేవలో తెలంగాణ మంత్రి పొంగులేటి



పొంగులేటి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సతీసమేతంగా తొలిసారి ఇంద్రకీలాద్రికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ నుంచి సాదరంగా స్వాగతం లభించింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మంత్రి దంపతులు దుర్గమ్మకు పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ చైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు. అలాగే, దుర్గమ్మను రాజంపేట ఎంపీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ మిథున్‌రెడ్డి కూడా దర్శించుకున్నారు.

వినాయకుని సేవలో సుధా నారాయణమూర్తి



సుధా నారాయణమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

యాదమరి: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఇన్ఫోసిస్ అధినేత భార్య డాక్టర్ సుధా నారాయణమూర్తి దర్శించుకున్నారు. సోమవారం ఆమె ఉదయం స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందించారు.

సముద్రంలో గల్లంతైన యువజంట

గత నెలలోనే వివాహం- అంతర్వేది వద్ద ఘటన



లక్ష్మీనారాయణ, గాయత్రి (ఫైల్)

సఖినేటిపల్లి: విహార యాత్రకు వచ్చిన ఓ యువ జంట సముద్రంలో గల్లంతైన విషాద ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ల మండలం జువ్వలపాలేనికి చెందిన రేలంగి లక్ష్మీనారాయణ (27)కు, ఏలూరు జిల్లా గురవయ్యపాలేనికి చెందిన గాయత్రి (23)కి గత 1వ తేదీన వివాహం జరిగింది. లక్ష్మీనారాయణ భీమవరంలోని ఒక ప్రైవేటు స్కూలులో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో దంపతులిద్దరూ మోటార్ సైకిల్‌పై బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి వచ్చారు. సాయంత్రం సమయంలో బీచ్‌కు దూరంగా సముద్రంలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కెరటాల ఉధృతికి వారు గల్లంతయ్యారు. ఎంతకూ ఒడ్డుకు తిరిగి రాకపోవడం గమనించిన స్థానికులు బీచ్ పహారాకు వచ్చిన పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే లక్ష్మీనారాయణ దంపతులు తిరిగి ఇంటికి చేరకపోవడంతో అప్పటికే వారి కుటుంబ సభ్యులు వీరికోసం ఆరా తీశారు. అదే సమయంలో పోలీసులిచ్చిన సమాచారంతో అంతర్వేదిలోని ఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మీనారాయణ తండ్రి బసవలింగం చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.రాము సోమవారం కేసు నమోదు చేసి, యువ దంపతుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, ఒక్కగానొక్క కొడుకు కనిపించకుండా పోయాడంటూ లక్ష్మీనారాయణ తండ్రి బసవలింగం భోరున విలపించారు. 40 రోజుల కిందటే అంగరంగ వైభవంగా వివాహం జరిపించామని, ఆ ఆనందం కళ్లెదుటే కరుమరుగవడం జీర్ణించుకోలేకపోతున్నామని యువజంట బంధువులు రోదించారు.

ప్రకృతిసేద్యమే అందరికి శ్రీరామరక్ష

పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్

సాక్షి సాగుబడి, హైదరాబాద్: భూతాపాన్ని అదుపుచేయాలన్నా, అందరూ ఆరోగ్యదాయకంగా జీవించాలన్నా, సకల మానవాళికి ఆహారభద్రత చేకూరాలన్నా ప్రకృతిసేద్యమే శ్రీరామరక్ష అని పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ అన్నారు. సోమవారం రామచంద్ర మిషన్‌లో జరిగిన ప్రకృతి వ్యవసాయ విస్తరణ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఎరువులు, పురుగుమందులు, కలుపుమందుల రసాయనిక అవశేషాల వల్ల మనుషులకు కేన్సర్, మధుమేహం, బీపీ వంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయని తెలిపారు. భూతాపం, వాయుకాలుష్యం, కుండపోత తుపాన్లు, తీవ్ర కరువులు, అధిక ఉష్ణోగ్రతలు అనూహ్య రీతిలో పెచ్చరిల్లుతున్న ఈ తరుణంలో రైతులు, వినియోగదారులు, వృత్తిదారులు, సాధారణ ప్రజలు కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. జీవవైవిధ్యాన్ని, భూమిలో సహజపోషక వ్యవస్థను పరిరక్షించుకునే దేశీ సంప్రదాయ ఆహార ఉత్పత్తి వ్యవస్థల ద్వారానే జీవరాశి మనుగడ సుభిక్షంగా విరాజిల్లుతుందని అందరూ గుర్తించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించని, ప్రోత్సహించనివారు ఆధ్యాత్మిక జీవులు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ప్రకృతి వ్యవసాయదారుడు విజయరామ్ మాట్లాడుతూ పన్నెండేళ్లుగా పాలేకర్ కాలికి బలపం కట్టుకొని నెలకు 25 రోజులు దేశవ్యాప్తంగా శిక్షణాశిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. లక్షలాది మందికి ప్రకృతి సేద్య తాత్వికతపై లోతైన అవగాహన కల్పించటం ద్వారా గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టిందన్నారు.

డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త జైతీర్థ్ జోషికి ఐఎన్‌ఏఈ ఫెలోషిప్

సాక్షి, హైదరాబాద్: నగరంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ (డీఆర్‌డీఎల్) ప్రోగ్రాం డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త జైతీర్థ్ ఆర్ జోషికి ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ (ఐఎన్ఏఈ) ఫెలోషిప్ దక్కింది. ఇంజినీరింగ్, టెక్నాలజీలో అగ్రశ్రేణి సంస్థల్లో ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ ఒకటి. జైతీర్థ్ దేశ క్షిపణి వ్యవస్థల ఉత్పత్తి, నాణ్యత మెరుగుపరచడంలో, ఎంఎస్ఎంఈ రంగానికి అపారమైన వ్యాపార సామర్థ్యాన్ని సృష్టించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో విశేష కృషి చేశారు. ఈ మేరకు సోమవారం భువనేశ్వర్‌లో శిక్షా అనుసంధాన్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఐఎన్ఏఈ వార్షిక కన్వెన్షన్-2023లో భాగంగా ఐఎన్ఏఈ అధ్యక్షుడు ఇంద్రనీల్ మన్నా చేతుల మీదుగా ఫెలోషిప్ అందుకున్నట్లు ఐఎన్ఏఈ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దేశ భద్రత, ఆర్థిక వృద్ధికి స్థిరమైన వ్యూహాత్మక వస్తు సరఫరాను నిర్ధారించడంలో 'నేషనల్ మెటీరియల్ పాలసీ' రూపొందించడంలో సభ్య కార్యదర్శిగా జైతీర్థ్ కీలకపాత్ర పోషించారు. దేశ క్షిపణి వ్యవస్థల అభివృద్ధికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా పలు సంస్థలు, వృత్తిపరమైన సంస్థల నుంచి ఆయనకు అనేక అవార్డులు లభించాయి.

ఆల్‌నైన్ @ రూ.17.35 లక్షలు

ఆర్టీఏ ఫ్యాన్సీ నంబర్లకు స్పందన

సాక్షి, హైదరాబాద్: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారులు మరోసారి తమ క్రేజ్‌ను చాటుకున్నారు. సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 'టీఎస్ 09 జీఈ 9999'నంబర్‌ను కీ స్టోన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ ఏకంగా రూ.17,35,000 చెల్లించి సొంతం చేసుకుంది. అలాగే 'టీఎస్ 09 జీఎఫ్ 0005'నంబర్‌కు లలిత జ్యువెలర్స్‌మార్ట్ రూ.3,75,000 చెల్లించింది. 'టీఎస్ 09 జీఎఫ్ 0001'నంబర్ కోసం ఎన్‌టీకే టాలెంట్ స్టూడియో అనే సంస్థ బిడ్డింగ్‌లో రూ.3,50,000 చెల్లించి సొంతం చేసుకుంది. అలాగే 'టీఎస్ 09 జీఎఫ్ 0099'నంబర్‌కు ద్యావ విరూధినిరెడ్డి అనే వాహనదారు రూ.2,31,999 'టీఎస్ 09 జీఎఫ్ 0111'నంబర్‌కు 99 వెంచర్స్ సంస్థ రూ.2,09,999 'టీఎస్ 09 జీఈ 0027'నంబర్ కోసం న్యూలాండ్ లేబొరేటరీస్ సంస్థ రూ.1,36,500 చెల్లించింది. 'టీఎస్ 09 జీఎఫ్ 0007'నంబర్‌ను హిల్ థియరీ ఐటీ సొల్యూషన్స్ రూ.1,01,999తో సొంతం చేసుకుంది. సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ప్రత్యేక నెంబర్లపై రూ.45,98,490 ఆదాయం లభించినట్లు జేటీసీ పాండు రంగ నాయక్ తెలిపారు.

కొత్తగా... 850 ఎంబీబీఎస్ సీట్లు

వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి..



- 5 కొత్త కళాశాలలు ప్రారంభించడం ద్వారా 750 సీట్లు
- అనంత, శ్రీకాకుళం, నెల్లూరు కళాశాలల్లో 100 సీట్ల పెంపునకు ఎన్ఎంసీకి దరఖాస్తు
- 2025-26లో మరో 7 వైద్య కళాశాలలు ప్రారంభించేలా ప్రణాళికలు

సాక్షి, అమరావతి : వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరో 850 వైద్య సీట్లను అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా 750 సీట్లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ చేయడంతో పాటు, మన విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు పెంచేలా ఏకంగా 17 కొత్త కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఐదు చోట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు, వైద్య కళాశాలలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 3,530 పోస్టులను మంజూరు చేశారు. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. వసతుల కల్పన వేగంగా కొనసాగుతోంది. ఒక్కోచోట 150 చొప్పున 750 సీట్ల కోసం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు దరఖాస్తు చేశారు. మరోవైపు అనంతపురం వైద్య కళాశాలలో 50, నెల్లూరు, శ్రీకాకుళం కళాశాలల్లో ఒక్కో చోట 25 చొప్పున 50 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం అనంతపురంలో 150, శ్రీకాకుళంలో 175, నెల్లూరులో 175 సీట్లున్నాయి. కాగా, ఒక్కో చోట 200 ఎంబీబీఎస్ సీట్లకు అనుగుణంగా బోధనాస్పత్రుల్లో పడకలు, వైద్యులు, సిబ్బంది, ఇతర వనరులున్నాయి. దీంతో 200 సీట్లను పెంచేలా ఎన్ఎంసీకి దరఖాస్తు చేశారు. నూతన వైద్య కళాశాలలతో పాటు, అనంత, శ్రీకాకుళం, నెల్లూరు కళాశాలల్లో ఎన్ఎంసీ బృందం త్వరలో ఇన్‌స్పెక్షన్‌కు రానుంది.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా..

ప్రతి కొత్త జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండేలా వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తోంది. తద్వారా ఏకంగా 2,550 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెస్తోంది. ఈ నేపథ్యంలో వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ విద్యా సంవత్సరంలో ఐదు కళాశాలలను ప్రారంభించడం ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం మరో ఐదు కళాశాలలు ప్రారంభించడం ద్వారా ఒక్కో చోట 150 చొప్పున 750 సీట్లు సమకూరనున్నాయి. ఇక మిగిలిన ఏడు వైద్య కళాశాలలను 2025–26 విద్యా సంవత్సరంలో ప్రారంభించేలా ప్రణాళికలు రచించారు.

నిబంధనలకనుగుణంగా వనరులు

ఐదు కొత్త కళాశాలలను ప్రారంభించడానికి వీలుగా అన్ని విధాలా సిద్ధమవుతున్నాం. ఇప్పటికే ఐదు చోట్ల అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లు, ఇతర పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కళాశాలలు, బోధనాస్పత్రుల్లో ఎన్ఎంసీ నిబంధనలకనుగుణంగా ఏపీఎంఎస్ఐడీసీ వనరులు సమకూరుస్తోంది. ఎన్ఎంసీ బృందం తనిఖీలకు రావాల్సి ఉంది.

– డాక్టర్ నరసింహం, డీఎంఈ

స్టీల్ ప్లాంట్ సీఎండీ, డీజీపీకి మానవ హక్కుల సంఘం నోటీసులు

అగనంపూడి(గాజువాక): విధి నిర్వహణలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగి నాత్ర తాతారావు ఇటీవల మృతి చెందారు. దీనిపై యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మృతుని భార్య బంగారమ్మ రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రతివాదులు ఉక్కు సీఎండీ, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, స్టీల్‌ప్లాంట్ పోలీసులు, జిల్లా కలెక్టర్, డీజీపీలకు నోటీసులు జారీ చేసినట్టు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు తెలిపారు. విధుల్లోనే తన భర్త మృతి చెందినా, నష్టపరిహారంతో పాటు మృతికి గల కారణాల నివేదిక విషయంలో కంపెనీ ద్వంద వైఖరి పట్ల పలుమార్లు బంగారమ్మ ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మృతుని భార్య మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు వచ్చే ఫిబ్రవరి 12న మానవ హక్కుల సంఘం ముందు వారు హాజరు కావాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

జీతాలతోపాటు అలవెన్సుల చెల్లింపు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. ఉద్యోగుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలతోపాటు అలవెన్సులు కూడా కలిపి చెల్లించాలని నిర్ణయించింది. ఈమేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. 'పే ఇన్ టు'లో డ్యూటీ బేస్డ్ అలవెన్సులను జీతాలతోపాటు కలిపి చెల్లించనుంది. ఈ మేరకు ఖజానా శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. 2024 జనవరి నుంచి ఈ విధానం అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. వచ్చే నెల నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఓవర్ టైమ్ అలవెన్సులను జీతాలతోపాటు చెల్లించనున్నారు. దాంతో దాదాపు 50వేలమంది ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత నైట్ అవుట్, డే అవుట్, ఓటీ అలవెన్సులు విడిగా చెల్లిస్తున్నారు. ఆ విధంగా కాకుండా విలీనానికి ముందు ఉన్నట్టుగానే జీతాలతోపాటు చెల్లించాలని ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం అలవెన్సులను జీతాలతోపాటు చెల్లించాలని నిర్ణయించింది. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్సీ బకాయిలు, ఎస్ఆర్‌బీఎస్ ట్రస్ట్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా త్వరలోనే దశలవారీగా చెల్లించాలని నిర్ణయించింది.

పదోన్నతులకు త్వరలో మార్గదర్శకాలు

ప్రభుత్వంలో విలీనానికి (2020 జనవరి 1కి) ముందు నుంచి ఆర్టీసీ ఉద్యోగులుగా ఉన్న వారికి పదోన్నతుల కల్పనకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ప్రభుత్వం త్వరలోనే జారీ చేయనుంది. ఆ వెంటనే రాష్ట్రవ్యాప్తంగా 1,026 మందికి పదోన్నతులు కల్పించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక ఆర్టీసీ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలపై అప్పీల్ చేసుకునేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని కూడా ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఆర్టీసీలో ఉద్యోగ నిర్వహణకు ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నిర్వహణకు ఉన్న వ్యత్యాసాలను పరిగణలోకి తీసుకోవాలని విన్నవించారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా క్రమశిక్షణ చర్యలు అమలు చేస్తే ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. క్రమశిక్షణ చర్యలపై ఆర్టీసీ ఉద్యోగులు అప్పీల్ చేసేందుకు.. తదనంతరం సత్వరం పరిష్కరించేలా విధి విధానాలను రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిపై రూపొందించిన ముసాయిదాను న్యాయశాఖ పరిశీలనకు పంపారు. త్వరలోనే క్రమశిక్షణ చర్యలపై ప్రత్యేకంగా అప్పీళ్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయనుంది.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలతోపాటు అలవెన్సులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. ఈ నిర్ణయంతో ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుంది. ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– పల్లిశెట్టి దామోదరరావు, రాష్ట్ర అధ్యక్షుడు, ఎంప్లాయీస్ యూనియన్

ఉద్యోగులకు ప్రయోజనకరం

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. డ్యూటీబేస్డ్ అలవెన్సులను ప్రతి నెల జీతాలతోపాటు చెల్లించడం ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– పీవీ రమణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, వై.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నేషనల్ మజ్దూర్ యూనియన్



నేత్ర శోభితం.. లక్ష దీపోత్సవం

ఘనంగా కార్తీకమాసం చివరి సోమవారం

శ్రీశైలం టెంపుల్: కార్తీక మాసం పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించిన లక్షదీపోత్సవం ఆధ్యాత్మికభరితంగా, నేత్ర శోభితంగా సాగింది. కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయ పుష్కరిణి వద్ద నిర్వహించిన లక్షదీపోత్సవంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6.30గంటలకు శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు విశేష పూజాధికాలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి ఉభయ దేవాలయాల అర్చకులు దశవిధ హారతులిచ్చారు. వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని నోట ఏయూ ఘనత

వికసిత్ భారత్ ప్రసంగంలో ప్రస్తావించిన మోదీ



గవర్నర్‌తో రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ) గురించి వికసిత్ భారత్ 2047–వాయిస్ ఆఫ్ యూత్ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ప్రస్తావించారు. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో ప్రధాని మోదీ దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశంలో ఏయూ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య ఉద్యమకారులను విశ్వవిద్యాలయాలు దేశానికి అందించాయని చెప్పారు. వీటిలో ఆంధ్ర వర్సిటీ కూడా ముఖ్యమైనదని పేర్కొన్నారు. న్యాక్ ఏ++, 3.74 గ్రేడ్ పాయింట్లు సాధించి.. దేశంలోని అత్యుత్తమ మూడు వర్సిటీల్లో ఒకటిగా నిలిచిన ఏయూ గురించి ప్రధాని మోదీ ప్రస్తావించడంపై వర్సిటీ అధికారులు, ఆచార్యులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ఏయూ అభివృద్ధిని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. సోమవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో వర్సిటీల అధికారులతో కలిసి వికసిత్ భారత్ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ఏయూ న్యాక్ గ్రేడింగ్ సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

సీఎల్‌ఏటీ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న లా యూనివర్సిటీల్లో ఐదేళ్ల లా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్ (సీఎల్ఏటీ)-2024 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అత్యధికంగా స్టేట్, ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమ విద్యార్థులు కె.వినోత్న స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎస్.సాయి రాహుల్ స్టేట్ 3 ర్యాంక్, షేక్ మహ్మద్ ఆసిఫ్ స్టేట్ 5 ర్యాంక్, ఎ.హర్షవర్ధన సాయి స్టేట్ 10 ర్యాంక్, కె.స్వరూప్ స్టేట్ 11 ర్యాంక్ వంటి టాప్-50 లోపు ర్యాంకులతో పాటు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో 85వ ర్యాంక్, 123వ ర్యాంక్ వంటి బెస్ట్ ర్యాంక్స్‌ను తమ విద్యార్థులు సాధించి నల్సార్ వంటి టాప్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందే అవకాశాన్ని పొందారని వెల్లడించారు. క్లాట్ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సుష్మ అభినందించారు.

నంది నాటకోత్సవాలకు 'రంగం' సిద్ధం



- 23 నుంచి గుంటూరులో ఏపీ 'నంది నాటకోత్సవాలు'
- వివిధ స్థాయిల్లో మొత్తం 74 అవార్డులు ప్రదానం
- ఎన్టీఆర్, వైఎస్సార్ రంగ స్థల పురస్కారాలకు నామినేషన్ల గడువు పొడిగింపు
- తెలుగు నాటక రంగ విస్తరణకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి

సాక్షి, అమరావతి: తెలుగు నాటక రంగ స్థలానికి పూర్వవైభవం తీసుకొచ్చే సంకల్పంతో ఈ నెల 23వతేదీ నుంచి 29 వరకు '22వ నంది నాటకోత్సవాల'ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నంది నాటకోత్సవాల ప్రాంగణానికి సత్యహరిశ్చంద్ర నాటక రచయిత, స్వాతంత్ర్య సమర యోధుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం పేరును పెట్టామన్నారు. ఐదు విభాగాలయిన పద్య, సాంఘిక నాటకాలు, నాటికలు, బాలల నాటిక, కళాశాల /వర్సిటీ నాటిక (ప్లేలెట్స్)కు 115 ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిల్లో ప్రాథమిక పరిశీలన అనంతరం 38 ప్రదర్శనలను తుది పోటీలకు ఎంపిక చేశామన్నారు. విమర్శలకు తావులేకుండా, పారదర్శకంగా ఐదు విభాగాల్లో 74 అవార్డులను అందజేయనున్నట్లు పోసాని వివరించారు.

లాటరీ ద్వారా షెడ్యూల్ ఖరారు

తుది ప్రదర్శనల్లో భాగంగా నాటక సమాజాల ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఆయా ప్రదర్శనల షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు కృష్ణమురళి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. ఐదు విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కో దానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని తెలిపారు. దీంతో పాటు 2022లో నాటక రంగంపై 'ఉత్తమ రచన గ్రంథం' ఎంపిక కోసం మరో ముగ్గురు జడ్జిలతో కమిటీని నియమించామన్నారు. 18 మంది నిపుణులు, కళాకారులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

నామినేషన్లకు గడువు పొడిగింపు

ప్రభుత్వం నాటక రంగ విస్తరణకు ఎనలేని ప్రోత్సాహమందిస్తోందన్నారు. నంది నాటకోత్సవాల వేదికపై 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం' పేరుతో నాటక రంగంలో వ్యక్తిగత విభాగంలో విశేష సేవలందించిన నటులు, కళాకారులకు రూ.1.50 లక్షల నగదు బహుమతిని ప్రదానం చేస్తోందన్నారు. దీంతో పాటు సమష్టి కృషితో పనిచేసిన నాటక సమాజాలకు, పరిషత్తులను ప్రోత్సహించేందుకు తొలిసారిగా వైఎస్సార్ రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేస్తూ.. రూ.5లక్షల బహుమతి, మెమోంటోతో సత్కరిస్తామన్నారు. ఈ అవార్డుల నామినేషన్ల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి బాలలు, కళాశాల విద్యార్థి నాటకాల విభాగాల్లోనూ వ్యక్తిగత బహుమతులను అందజేస్తామన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఏపీఎఫ్‌డీసీ ఎండీ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి, ఏపీఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్ ఎంవీఎల్ఎన్ శేషసాయి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా పీసీ రథ్

సాక్షి, హైదరాబాద్: అపోలో ఆస్పత్రుల సీనియర్ కార్డియాలజిస్ట్ పీసీ రథ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈ ఏడాది కాలానికి కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతాలో జరిగిన కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్లాటినం జూబ్లీ వార్షిక కాన్ఫరెన్స్ వేడుకలో రథ్‌కు ఈ గౌరవం దక్కింది. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా 4 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సొసైటీ అధ్యక్షుడిగా పీసీ రథ్ వివిధ రాష్ట్ర శాఖలు, ఇతర దేశాల్లోని వివిధ కార్డియోలాజికల్ సొసైటీలతో సమన్వయం చేసుకుంటారు. ఆయన ప్రభుత్వంతో కూడా సమన్వయం చేసుకుంటారు. పీసీ రథ్ నాయకత్వంలో కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా తదుపరి వార్షిక సమావేశం వచ్చే ఏడాది డిసెంబర్‌లో లక్నోలో జరుగుతుంది.

ముందస్తు బెయిల్ కోసం తలసాని ఓఎస్డీ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైళ్ల చోరీ ఉదంతంలో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మూడురోజుల క్రితం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైళ్లు మాయమైన విషయం తెలిసిందే. కార్యాలయం నుంచి పలు ఫైళ్లను తీసుకెళ్లారని, మిగతా ఫైళ్లను చిందరవందరగా పడేశారని, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చప్పగా సాగిన లోకేశ్ పాదయాత్ర

మరోసారి బయటపడ్డ పార్టీ వర్గవిభేదాలు



పాదయాత్రలో నారా లోకేశ్ బ్రాహ్మణి, ఇతర టీడీపీ నాయకులు

నక్కపల్లి/పాయకరావుపేట/తుని: తెలుగుదేశం నాయకుడు లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సోమవారం కాకినాడ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలోని పాయకరావుపేట గౌతం సెంటరుకు చేరుకున్న లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు, బైరి దిలీప్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. జనం లేక పాదయాత్ర వెలవెలబోయింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన భవననిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, షాపుల్లో పనిచేసేవారితోపాటు కొద్దిమంది టీడీపీ వర్గీయులు మాత్రమే కనిపించారు. ఈ పాదయాత్రలో పార్టీలో గ్రూపు విభేదాలు మరోసారి బయటపడ్డాయి. జీవీఆర్ నగర్ వద్ద పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు, తుని, పాయకరావుపేట పట్టణాల తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అనితకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను ఎందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనిత జోక్యం చేసుకుని సముదాయించినా సద్దుమణగలేదు. లోకేశ్ కల్పించుకుని ఈ విషయం తన దృష్టిలో ఉందని, త్వరలోనే అందరినీ కూర్చోబెట్టి మాట్లాడతానని చెప్పారు. అంతకుముందు కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట రాజులకొత్తూరు వద్ద పాదయాత్ర మూడువేల కిలోమీటర్లు అయిన సందర్భంగా లోకేశ్ పైలాన్‌ను ఆవిష్కరించారు.

చంద్రబాబు, లోకేశ్ ఉత్తరాంధ్ర ద్రోహులు



ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): చంద్రబాబు, లోకేశ్ ఉత్తరాంధ్ర ద్రోహులని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు విమర్శించారు. ఎస్.రాయవరం మండలంలోని అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడాన్ని వ్యతిరేకించి, అమరావతి ప్రాంత రైతులతో కోర్టుల్లో కేసులు వేయించి, నిరాహారదీక్షలు చేయించిన చంద్రబాబు, లోకేశ్‌లకు ఉత్తరాంధ్రలో అడుగుపెట్టే అర్హత లేదని చెప్పారు. ఉత్తరాంధ్రలో చెప్పుకోడానికి ఒక్క అభివృద్ధి పనికూడా చేయని నాయకుడికి పాదయాత్ర చేయడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల ముందు ఉత్తరాంధ్రకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం రాష్ట్రంలో మూడు ప్రాంతాలను అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో జగనన్న మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకువస్తే అడ్డుకుంటూ ఉత్తరాంధ్ర ద్రోహులుగా మిగిలిపోయారన్నారు. పరిపాలన రాజధానిగా విశాఖను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో, విశాఖకు ఏ అర్హత లేదో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ విసిరారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తమ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై లోకేశ్‌తో బహిరంగచర్చకు సిద్ధమన్నారు. నియోజకవర్గంలో 107 గ్రామాలకు తాగునీటి సమస్య తీర్చే ఉద్దండపురం వాటర్‌గ్రిడ్‌కు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.35 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఇటీవల జగనన్న మరో రూ.85 కోట్లు మంజూరు చేసి వాటర్‌గ్రిడ్ పూర్తి చేసేందుకు నిర్ణయించారని ఆయన చెప్పారు.



"నిర్దిష్టమైన లక్షణాలు, ముఖ కవళికలు అందాన్ని నిర్వచించలేవు. ఎందుకంటే జుట్టు ఉన్నా లేకపోయినా గుండెల్లో ఆత్మవిశ్వాసం... పెదవులపై చిరునవ్వూ ఉంటే అందంగానే ఉంటారు" అని నిరూపించి, ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది కేతకీ జానీ. నలభైఏళ్ల వయసులో అలోపేసియా వ్యాధితో కేతకీ జుట్టు రాలిపోయినప్పటికీ కృంగిపోకుండా హెయిర్‌లెస్ మోడల్‌గా రాణిస్తూనే అలోపేసియా బాధితులకు అవగాహన కల్పిస్తూ ధైర్యాన్ని నూరిపోస్తోంది.



రాలిపోని ఆత్మవిశ్వాసం

అహ్మదాబాద్‌లో పుట్టిన కేతకీ జానీ పుణెలో పెరిగింది. స్కూలు విద్యాభ్యాసం పూర్తయ్యాక బిఏ, బిఈడీ, ఎమ్‌ఏ చేసింది. మహారాష్ట్ర టెక్స్ట్‌బుక్ ప్రొడక్షన్‌లో ప్రత్యేక అధికారిగా పనిచేసేది. ఉన్నట్టుండి కేతకీ జుట్టు రాలిపోవడం మొదలైంది. అలా రాలిపోయిన ప్రదేశంలో కొత్త వెంట్రుకలు వచ్చేవి కావు. విచిత్రంగా అనిపించింది. జుట్టు ఇలా రాలిపోవడానికి అలోపేసియా అంటే పేనుకొరుకుడు వ్యాధి కారణమని డాక్టర్ చెప్పారు. ఈ సమస్యకు తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం లేదని తెలిసి కేతకి తీవ్రనిరాశకు గురైంది.

జుట్టు రాలిపోయి తను అసహ్యంగా మారిపోతుందేమో అని భయపడిపోయింది. ఒకపాప, బాబుకు తల్లి అయిన కేతకికి భర్త కూడా మద్దతుగా నిలవకపోవడం, బంధువులు, ఇరుగు పొరుగు క్యాన్సరా? అని అడగడం, అంతా అవహేళన మాటలు, చూపులు... దాంతో తీవ్ర మనస్తాపానికి గురై జీవితాన్ని త్యజించాలనుకుంది. కానీ తను లేకపోతే పిల్లల పరిస్థితి ఏమవుతుందో తలచుకుని తన నిర్ణయాన్ని మార్చుకుంది. వ్యాధితోనే పోరాడుతూ బతకాలని నిర్ణయించుకుంది. గుండులా మారిన తలపైన టాటూలతో అందంగా అలంకరించుకుని ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది.

యాడ్ చూసి...

ఒకరోజు మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ కాంపిటీషన్ యాడ్ చూసి కాంపిటీషన్‌లో పాల్గొంది. ఆ పోటీలో పాల్గొన్న తొలి అలోపేసియా బాధితురాలిగా నిలిచింది. ఆ తర్వాత మిసెస్ యూనివర్స్ కాన్ఫిడెంట్‌గా, మిసెస్ పూనె, మిస్ అండ్ మిసెస్ పూనే ఇంటర్నేషనల్, మిసెస్ పాపులర్ వంటి అనేక టైటిల్స్‌ను వరుసగా గెలుచుకుంటూ వస్తోంది. కొప్పున్నా లేకున్నా ఆత్మవిశ్వాసమే అందం అని నిరూపించింది. హెయిర్‌లెస్ మోడల్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కేతకి తనలా మరెవరూ బాధపడకూడదన్న ఉద్దేశ్యంతో అలోపేసియా గురించిన అవగాహన కల్పిస్తోంది. వివిధ కార్యక్రమాల ద్వారా ఎంతో మంది బాధితులకు ధైర్యాన్ని నూరిపోస్తోంది.



అవహేళన కాదు అండగా నిలవండి..

"ఎంతో ఒత్తుగా ఉండే నా జుట్టు 2010 నుంచి ఊడిపోవడం మొదలైంది. దీంతో తీవ్ర నిరాశలో కృంగిపోయాను. అందరూ నన్ను అదోరకంగా చూస్తుండడంతో ఆఫీసుకు త్వరగా వెళ్లి త్వరగా వచ్చేసేదాన్ని. ఇలా కొన్నాళ్లు భయంభయంగా గడిపాను. జుట్టు లేకపోతేనేం? గుండు మీద టాటూలు వేసుకుంటే అందంగా కనిపించవచ్చన్న ఆలోచన వచ్చింది. వెంటనే టాటూలు వేసుకున్నాను. ఫరవాలేదనిపించి ధైర్యంగా మోడలింగ్‌లో అడుగు పెట్టాను. అక్కడ దక్కిన గౌరవంతో హెయిర్‌లెస్ మోడల్‌గా ఎదిగాను. నాలో ఆత్మవిశ్వాసం పెరిగిన తరువాత... నాకున్న సమస్య గురించి వివరించి చెప్పడం మొదలు పెట్టాను. అలోపేసియా గురించి అవగాహన కలిగించి గుండెల్లో ధైర్యం నింపితే బాధితులకు ఊరటగా ఉంటుంది" అని కేతకీ జానీ కోరుతోంది.

హై మోటివేషన్

కొండంత ధైర్యంతో...



కెప్టెన్ ఫాతిమా వసీమ్



సియాచిన్ పేరు వినబడగానే ఒంట్లో చలితో పాటు మృత్యుభయం కూడా దూరుతుంది. శత్రువుల జాడను కనిపెట్టడం ఒక ఎత్తయితే, ప్రకృతే శత్రువుగా మారి ప్రాణాలు కబళించే ప్రమాదకర పరిస్థితి నుంచి బయట పడడం మరో ఎత్తు. దేశం కోసం కొండంత ధైర్యంతో సియాచిన్ గ్లాసియర్‌లో విధులు నిర్వహిస్తున్నారు మన సైనికులు. సియాచిన్ గ్లాసియర్‌లో విధులు నిర్వహించబోతున్న ఫస్ట్ ఉమన్ మెడికల్ ఆఫీసర్ (ఆపరేషనల్ పోస్ట్)గా ఫాతిమా వసీమ్ చరిత్ర సృష్టించింది...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం సియాచిన్ గ్లేసియర్. గడ్డకట్టే చలిలో మన సైనికుల సాహసం, అంకితభావం మాటలకు అందనివి. సముద్ర మట్టానికి 17,720 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్‌లో శీతాకాలంలో పగలు ఏడు గంటలు మాత్రమే ఉంటుంది. ఆక్సిజన్ లెవెల్స్ సరిగ్గా ఉండకపోవడంతో సైనికులు ఎక్కువ సమయం నిద్ర పోవడానికి వీలు కాదు. షేవింగ్ చేసుకోవాలన్నా కష్టమే. ఒకవేళ చర్మం తెగితే గాయం మానడానికి చాలా సమయం పడుతుంటుంది. స్నానం చేయాలన్న కష్టమే. ప్రత్యేక చీతా హెలికాప్టర్లు మాత్రమే ఇక్కడికి చేరుకోగలవు.



శిక్షణలో...

ఇక్కడ మూడు వేల మంది వరకు సైనికులు పనిచేస్తారు. ఒక్కో బెటాలియన్ మూడు నెలల వరకు గస్తీ విధులు నిర్వహిస్తుంది. మంచుకొండ చరియలు విరిగి పడడం ద్వారా ఎంతోమంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'ప్రతికూలత' గురించి తప్ప 'అనుకూలత' గురించి ఒక్క మాట కూడా వినిపించని మృత్యుక్షేత్రంలోకి మెడికల్ ఆఫీసర్‌గా అడుగు పెట్టనుంది కెప్టెన్ ఫాతిమా వసీమ్.

'సియాచిన్ బ్యాటిల్ స్కూల్'లో ఎన్నో నెలల పాటు కఠోరమైన శిక్షణ పొందింది ఫాతిమా.



వైద్య సేవలు అందిస్తూ

'సియాచిన్ గ్లేసియర్‌పై ఆపరేషనల్ పోస్ట్‌లో విధులు నిర్వహించబోతున్న తొలి మహిళా వైద్యాధికారిగా ఫాతిమా వసీమ్ ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చింది. ఇది చారిత్రక సందర్భం. కెప్టెన్ ఫాతిమా వసీమ్ ధైర్యసాహసాలు, అంకితభావాలకు అద్దం పట్టిన సందర్భం' అంటూ 'ఎక్స్'లో ఇండియన్ ఆర్మీ ఒక వీడియోను పోస్ట్ చేసింది.

'ఐసే జాగోరే సాథియో... దునియా సే జాకో బోలుదో' అనే పాట వినిపిస్తుండగా 'మీట్ కెప్టెన్ ఫాతిమా, ఏ సియాచిన్ వారియర్. ఉయ్ సెల్యూట్ హర్' అంటూ వీడియో మొదలవుతుంది. ఈ వీడియోలో 'సియాచిన్ బ్యాటిల్ స్కూల్'లో ఫాతిమా వసీమ్ శిక్షణ తీసుకుంటున్న, సైనికులకు వైద్యం చేస్తున్న దృశ్యాలు కనిపిస్తాయి.

విజేత

కాబోయే డాక్టరమ్మకు అందాల కిరీటం

'మిస్ ఇండియా యూఎస్ఏ' టైటిల్ గెలుచుకోవడానికి 25 రాష్ట్రాల నుంచి 57 మంది పోటీ పడ్డారు.

'వినయంతో, ఒకింత గర్వంతో నేను మిస్ ఇండియా యూఎస్‌ఏ 2023 అని చెబుతున్నాను. నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లేకపోతే ఈ విజయం సాధ్యం అయ్యేది కాదు. నా ప్రయాణంలో అడుగడుగునా స్నేహితులు అండగా నిలిచారు. విలువైన సూచనలు ఇచ్చారు' అంటుంది రిజుల్ మైని.

ఇరవై నాలుగు సంవత్సరాల ఇండియన్–అమెరికన్ రిజుల్ మైని తనను తాను మెడికల్ స్టూడెంట్, మోడల్‌గా పరిచయం చేసుకుంటుంది. సర్జన్ కావాలనేది తన లక్ష్యం.



అందాల కిరీటంతో రిజుల్ మైని

'అందమే ఆనందం' అనుకోవడంతో పాటు 'ఆనందమే అందం' అనుకునే రిజుల్ మైని మిచిగాన్ (యూఎస్)లో మెడికల్ స్టూడెంట్. ఈ ఇండో–అమెరికన్ స్టూడెంట్ మిస్ ఇండియా యూఎస్‌ఏ 2023 కిరీటాన్ని గెలుచుకుంది...



స్కూలు రోజుల నుంచి చదువుకు ఎంత ప్రాధాన్యత ఇచ్చేదో, కళలు, సాంస్కృతిక సంబంధిత కార్యక్రమాలకు అంతే ప్రాధాన్యత ఇచ్చేది రిజుల్. మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీలో 'హ్యూమన్ సైకాలజీ'లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన రిజుల్‌కు ఖాళీ సమయం అంటూ ఉండదు. ఎప్పుడూ సందడి సందడిగా ఉంటుంది. ఆమె హాబీల జాబితాలో పెయింటింగ్, కుకింగ్, గోల్ఫింగ్... ఇలా ఎన్నో ఉన్నాయి.

స్వచ్ఛంద కార్యక్రమాలలోనూ ముందుంటుంది. వైద్యానికి సంబంధించిన సరికొత్త విషయాలు, పుస్తకాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో ఇతరులతో పంచుకోవడం అంటే ఇష్టం.

'కళ అనేది మనసులోని మాలిన్యాన్ని శుభ్రం చేస్తుంది' అనే మాట రిజుల్ మైనికి ఇష్టం. అందుకేనేమో ఆమెకు కళలు అంటే అంత ఇష్టం. కళలు ఉన్నచోట వెలుగు ఉంటుంది. ఆ వెలుగే అందం. ఆనందం.

సాగుబడి

జ్యేష్ఠ కార్తె: డిసెంబర్ 15 వరకు
మూల కార్తె: 16 నుంచి

బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వాతో
కోళ్ల ఫారాల కాలుష్యానికి చెక్

- బీఎస్ఎఫ్ లార్వాతో కోళ్ల ఫారంలో ఉండే ఈగలు, దుర్వాసన, అనారోగ్య సమస్యలు దూరం



- కోళ్ల విసర్జితాలపై బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు చల్లక ముందు...
- విసర్జితాలను పిల్ల పురుగులు తిని ఎరువుగా మార్చిన తర్వాత..

కోళ్ల ఫారంలో కోళ్ల విసర్జితాల వల్ల కోళ్ల రైతులు, కార్మికులకే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలకు ఈగలు, దుర్వాసన పెద్ద సమస్యగా ఉంటుంది. కోళ్ల విసర్జితాలను ఆశించే ఈగలు మనుషులకు, కోళ్లకు ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. కోళ్ల విసర్జితాల నుంచి విడుదలయ్యే అమ్మోనియా వాయువు వల్ల కోళ్ల ఫారాల్లో పనిచేసే కార్మికులకు, రైతులకు కళ్ల మండటం, తలనొప్పి వంటి సమస్యలు రావటంతో పాటు కోళ్లకు సైతం తలనొప్పి, కంటి చూపు సమస్యలు తలెత్తుతూ ఉంటాయి.

లేయర్, బ్రీడర్ కోళ్ల ఫారాల కింద పోగుపడే కోళ్ల విసర్జితాల దుర్వాసన, ఈగల నివారణకు రసాయనాలు చల్లినప్పటికీ ఇది తీరని సమస్యగానే మిగిలిపోతోంది.

జనావాసాలకు దగ్గరగా ఉండే కోళ్ల ఫారాల దుర్గంధాన్ని, ఈగలను భరించలేని ప్రజలు వాటిని మూయించే పరిస్థితులు కూడా నెలకొంటూ ఉంటాయి. అయితే, ఈ సమస్యలను పర్యావరణహితంగా పరిష్కరించే ఓ మార్గాన్ని సూచిస్తున్నారు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఓ స్టార్టప్ వ్యవస్థాపకుడు యడ్లపాటి రమేష్.

బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) అనే హానికరం కాని ఈగకు చెందిన పిల్ల పురుగులను కోళ్ల ఫారంలోని విసర్జితాలపై వదిలితే కోళ్ల ఫారాల నుంచి దుర్వాసన సమస్య, విసర్జితాల యాజమాన్య సమస్యలు తీరిపోతాయని రమేష్ తెలిపారు. కోళ్ల వ్యర్థాలను – వర్మి కంపోస్ట్ ప్రక్రియ లాగా మారుస్తూ బిఎస్ఎఫ్ లార్వా (పిల్ల పురుగులు) పెరుగుతాయి. నెలకొక సారి వీటిని కోళ్ల ఫారంలో విసర్జితాలపై వేసుకుంటే చాలు. కోళ్ల ఫారాల నుంచి వ్యర్థాల దుర్వాసన నుంచి 95% పైగా విముక్తి కలిగించడానికి సహజ ప్రక్రియ అయిన బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వా ఒక మంచి పరిష్కారమని ఆయన చెబుతున్నారు. గత ఐదారేళ్లుగా బిఎస్ఎఫ్ లార్వా ఉత్పత్తిపై పనిచేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో కోళ్ల రైతులకు ఈ లార్వాను అందిస్తూ కాలుష్య నియంత్రణకు, ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

లార్వాను కోళ్ల విసర్జితాల (లిట్టర్)పై నెలకోసారి చల్లటం వల్ల ఉపయోగాలు:

- సాధారణ ఈగలు పూర్తిగా తగ్గిపోతాయి. కోళ్ల విసర్జితాలపై ఈగలు అరికట్టేందుకు ఉపయోగించే మందులు, అలాగే ఈగల లార్వాను నిర్మూలించడానికి, ఫీడ్‌లో ఇచ్చే మందులు అసలు అవసరం లేదు
- దుర్వాసన తగ్గుతుంది
- కోళ్ల విసర్జితాల నుంచి వెలువడే అమ్మోనియా తగ్గిపోతుంది. కోళ్ల ఫారంలో ఆక్సిజన్ స్థాయి పెరుగుతుంది. కళ్ళు మంటలు, సిఆర్‌డి సమస్య తగ్గుతుంది
- విసర్జితాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు ఎరువుగా మార్చే క్రమంలో, విసర్జితాల్లో తేమ తగ్గిపోయి, దుర్వాసన కూడా తగ్గుతుంది. సున్నం, బ్లీచింగ్ అవసరం ఉండదు. వీటి ఖర్చు తగ్గుతుంది.
- విసర్జితాల నిర్వహణకు కూలీలు, స్ప్రేయర్లు, మందుల ఖర్చు ఆదా అవుతుంది
- కోళ్ల విసర్జితాలపై ఉండే సాల్మొనెల్లా, ఈ–కొలి వంటి హానికారక సూక్ష్మక్రిములను అరికడతాయి
- ఆర్గానిక్ కంపోస్ట్‌గా మారిన కోళ్ల విసర్జితాలను రైతులు మంచి ధరకు విక్రయించుకోవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను విసర్జితాలపై చల్లటం అనే సహజ సిద్ధమైన ప్రక్రియ వల్ల.. కోళ్లకు, పనివారికి, చుట్టుపక్కల నివసించే ప్రజలకు ఇబ్బందులు తప్పటమే కాకుండా, పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది.
- చనిపోయిన కోళ్లను, పగిలిపోయిన గుడ్లను త్వరగా కుళ్ళబెట్టడానికి, దుర్వాసన, బాక్టీరియా తగ్గడానికి కూడా బిఎస్ఎఫ్ లార్వా ఉపయోగపడుతుంది
- కోళ్ల ఫారం పరిసర ప్రాంతాలు ఆరోగ్యకరంగా, కాలుష్యరహితంగా తయారై కోళ్ల ఆరోగ్యం బాగుంటుంది. ఉత్పాదకత 1–2 శాతం పెరుగుతుంది
- బిఎస్ఎఫ్ గుడ్డు నుంచి ఈగ వరకు జీవితకాలం మొత్తం 45 రోజులు. గుడ్డు నుంచి పిల్లలను ఉత్పత్తి చేయటం అనేది తక్కువ ఉష్ణోగ్రత, అధిక తేమ గల వాతావరణంలో జరగాల్సి ఉంటుంది.

మరోన్నో ఉపయోగాలు...

- 20 రోజుల వయసులో గోధుమ రంగులో ఉండే బిఎస్ఎఫ్ పురుగులు బతికి ఉండగానే లేయర్ కోళ్లకు, బ్రాయిలర్ కోళ్లకు, నాటు కోళ్లకు 10–20% మేరకు సాధారణ మేత తగ్గించి మేపవచ్చు
- వంటింటి వ్యర్థాలు, ఆహార వ్యర్థాలపై ఈ బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వేసి పెంచవచ్చు. 15 రోజుల తర్వాత ఆ లార్వాను పెంపుడు కుక్కలకు /పిల్లులకు /పక్షులకు మేతగా వేయొచ్చు.
- బతికి ఉన్న పురుగులు మేపవచ్చు. లేదా ఎండబెట్టి లేదా పొడిగా మార్చి కూడా వాడుకోవచ్చు
- ఆక్వా చెరువుల్లో రోజుకు మూడు సార్లు మేత వేస్తూ ఉంటారు. ఒక మేతను బిఎస్ఎఫ్ లార్వాను మేపవచ్చని రమేష్ చెబుతున్నారు. **వివరాలకు: 91541 60959**

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

కత్తిరిస్తుంది.. కట్టలు కడుతుంది!

- మల్బరీ తోటలో కొమ్మలు కత్తిరించి, మూట కట్టే పరికరాన్ని రూపొందించిన యువకుడు
- పట్టు పురుగులు పెంచే రైతులకు 90% కూలి ఖర్చులు ఆదా అవుతాయంటున్న ఆవిష్కర్త
- పత్తి, కంది కట్టెలను కత్తిరించి, కట్టలు కట్టడానికి కూడా పనికివస్తుందని ఆశాభావం
- త్వరగా, సులువుగా పని పూర్తవటంతో పాటు ఖర్చు తక్కువ



వ్యవసాయ పనుల్లో శారీరక శ్రమ తగ్గించే యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చిన కొద్దీ రైతులకు పని సులువు కావటంతో పాటు ఖర్చు కూడా తగ్గుతూ ఉంటుంది. పట్టు పురుగుల పెంపకంలో భాగంగా జరిగే మల్బరీ తోటలు సాగు చేసే రైతులు సాధారణంగా 28 రోజుల్లో ఒక విడత పట్టు గూళ్ల పెంపకం పని పూర్తి చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో మల్బరీ మొక్కల్ని పెంచి, కొమ్మల్ని కత్తిరించి వాటిని షెడ్‌లో పెరిగే పట్టు పురుగులకు ఆహారంగా వేస్తూ ఉంటారు. ఇప్పటి వరకు బ్రష్ కట్టర్‌తో వ్యవసాయ కార్మికుడు కొమ్మ కత్తిరిస్తే, ఆ కొమ్మలను మరో కార్మికుడు కట్టకట్టి షెడ్డుకు చేరుస్తూ ఉంటారు. ఈ ప్రక్రియలో మూడు దశల్లో కార్మికుల అవసరం ఉంటుంది. కూలీల కొరతతో కూలి పెరిగిపోవటం వల్ల ఖర్చు పెరిగింది. కొడవళ్లతో కొమ్మ కత్తిరింపు, సేకరణ అధిక శారీరక శ్రమతో కూడిన పని కావటంతో పెరిగిన దశలో పట్టు పురుగులు అధిక మొత్తంలో మల్బరీ ఆకులు మేపాల్సి ఉంటుంది.

ట్రాక్టరుకు జోడించి వాడే పరికరం

అయితే, గ్రామీణ ఆవిష్కర్త, రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెళ్ల గ్రామానికి చెందిన యువకుడు కొడిముంజ ప్రవీణ్ రూపొందించిన పరికరం ద్వారా సులువుగా, త్వరగా, తక్కువ మంది కూలీలతోనే ఏ రోజు కత్తిరించిన ఆకులను ఆ రోజు పురుగులకు మేపటం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రవీణ్ గత 12 ఏళ్లుగా రైతులకు ఉపయోగపడే పవర్ వీడర్లు, ట్రాక్టర్‌కు జోడించి ఉపయోగించే వ్యవసాయ పరికరాలను తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పట్టుపురుగుల పెంపకందారుల సూచన మేరకు 2023 ఆగస్టులో మల్బరీ కొమ్మలు కత్తిరించే ట్రాక్టర్ అటాచ్‌మెంట్‌ను తయారు చేశారు. 3 అడుగుల దూరంలో వరుసలుగా నాటిన మల్బరీ మొక్కలను నేల నుంచి 5 అంగుళాల ఎత్తులో కత్తిరించి పక్కకు పడేసేలా దీన్ని రూపొందించారు. సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లోని నలుగురు రైతులకు ఈ పరికరాలను విక్రయించారు.

పత్తి రైతులకూ ఉపయోగమే!

మల్బరీ కొమ్మల కత్తిరింపు, సేకరణకు సంబంధించి 5–6గురు కూలీలు చేసే పనిని 2–3గురు కూలీలతోనే సులువుగా చేసుకోవడానికి ఈ పరికరం ఉపయోగపడుతోందని రైతులు సంతోషంగా చెబుతున్నారు. మల్బరీకే కాకుండా పత్తి తీత పూర్తయిన తర్వాత పత్తి కట్టె కొట్టడానికి, కంది కట్టె కొట్టడానికి, పశుగ్రాసం కోయడానికి కూడా ఈ పరికరం ఉపయోగపడుతుందని రైతులు చెబుతుంటే సంతోషంగా ఉంది.



– కొడిముంజ ప్రవీణ్
(88863 81657),
మల్బరీ కత్తిరింపు పరికరం రూపకర్త, జిల్లెళ్ల గ్రామం, తంగళ్లపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా

పలమనేరు రైతుల సూచనలతో..

ప్రవీణ్ ఈ పరికరం గురించి పల్లె సృజన సంస్థకు తెలియజేయగా, మల్బరీ సాగు విస్తారంగా జరుగుతున్న చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంత రైతులకు ఈ పరికరాన్ని చూపించారు. కొమ్మ కత్తిరించటంతోపాటు కట్ట కట్టి పడేసేలా దీన్ని అభివృద్ధి చేస్తే కూలీల అవసరం బాగా తగ్గుతుందని రైతులు సూచించారు. ప్రవీణ్ రెండు నెలలు శ్రమించి ఈ పరికరాన్ని రైతుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయటంలో విజయం సాధించారు. నెల నెలా మల్బరీ కొమ్మ కత్తిరించడానికే కాకుండా.. ఏడాదికి, రెండేళ్లకోసారి మల్బరీ చెట్టు దుంప కొట్టడానికి కూడా ఈ పరికరం చక్కగా ఉపయోగపడుతోందని రైతులు సంతోషంగా చెబుతున్నారని ప్రవీణ్ తెలిపారు. బ్రష్ కట్టర్‌తో 8–9 గంటల్లో చేసిన పనిని తాను రూపొందించిన పరికరాన్ని ట్రాక్టర్‌కు జోడించి ఒక గంటలో పూర్తి చేయొచ్చని ప్రవీణ్ చెబుతున్నారు. 200 కిలోల బరువుండే ఈ పరికరాన్ని స్థానికంగా కొనుగోలు చేసిన ఇనుముతో తయారు చేయడానికి రూ. 1,65,000 వరకు ఖర్చయ్యింది. పెద్ద సంఖ్యలో తయారు చేస్తే 10–15% ఖర్చు తగ్గుతుందంటున్నారు ప్రవీణ్.

ప్రకృతి సేద్యానికి ప్రమాణాలు!

- ముసాయిదా విడుదల చేసిన బిఐఎస్
- డిసెంబర్ 26లోగా సవరణలు సూచించవచ్చు

మన దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, రైతులు చాలా సంవత్సరాలుగా విస్తృతంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నప్పటికీ నిర్దుష్ట ప్రమాణాలు లేవు. భారతీయ నమూనా ప్రకృతి సేద్యం అంతకంతకూ విస్తరించటం.. ఎఫ్.ఎ.ఓ. వంటి అనేక అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ప్రకృతి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు సహకార వ్యవస్థ ఏర్పాటవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయానికి, ఉత్పత్తుల లేబులింగ్‌కు భారతీయ ప్రమాణాలను నిర్వచించుకోవాల్సిన అవసరం వచ్చింది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఒక ముసాయిదా పత్రాన్ని వెలువరించింది. 27 పేజీల డ్రాఫ్ట్ స్టాండర్డ్స్‌ను వెబ్‌సైట్‌లో పెట్టింది. ప్రకృతి సాగు పద్ధతులు, ద్రావణాలు, కషాయాలు, అంతర పంటలు, మిశ్రమ పంటలు, ఆగ్రోఫారెస్ట్రీ.. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల బ్రాండింగ్, నిల్వ, ప్యాకేజింగ్‌తో పాటు.. సేంద్రియ–ప్రకృతి వ్యవసాయాల మధ్య వ్యత్యాసాలు ఇందులో ఉన్నాయి. శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, రైతు శాస్త్రవేత్తలు, ఆహార నిపుణులు, సంస్థలు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు కోరుతున్నది. తుది గడువు 2023 డిసెంబర్ 26 .

www.services.bis.gov.in ఈ వెబ్‌సైట్‌లోని ముసాయిదా ప్రమాణాల పీడీఎఫ్ కోసం ఈ క్యూ.ఆర్. కోడ్ స్కాన్ చేయండి.

14 నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

విశాఖపట్నంలో ఈ నెల 8–10 తేదీల్లో జరగాల్సిన ఆర్గానిక్ మేళా పెనుతుపాను కారణంగా ఈ నెల 14–17 తేదీలకు వాయిదా పడింది. గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ, సుస్థిర వ్యవసాయ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళా జరగనుంది. విశాఖలో జరుగుతున్న నాలుగో వార్షిక ఆర్గానిక్ మేళా ఇది. 14న ఉ. 10 గంటలకు సేంద్రియ/ప్రకృతి రైతులు– రైతు శ్రేయోభిలాషుల సమ్మేళనం, 15న గ్రాడ్యుయేట్ ప్రకృతి వ్యవసాయదారులు, విద్యార్థుల సదస్సు, 16న ఏపీ ఛాంబర్ ఆఫ్ ఆర్గానిక్స్ సమావేశం, 17న ఇంటిపంటలు/మిద్దెతోటలపై సదస్సు జరుగుతుందని నిర్వాహకులు కుమారస్వామి తెలిపారు. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 78934 56163, 86862 24466.



శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు ఆరో గెలుపు

ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఆరో విజయం సాధించింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 1-0తో ఢిల్లీ ఎఫ్‌సీపై గెలిచింది. ఆట 65వ నిమిషంలో ఢిల్లీ ప్లేయర్ గగన్‌దీప్ బాలి 'సెల్ఫ్ గోల్' చేశాడు. 13 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో ప్రస్తుతం 10 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 20 పాయింట్లతో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

నేడు క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్‌తో భారత్ 'ఢీ'

జూనియర్ పురుషుల అండర్-21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో నేడు భారత జట్టుకు కఠిన పరీక్ష ఎదురుకానుంది. కౌలాలంపూర్‌లో ఈరోజు జరిగే క్వార్టర్ ఫైనల్లో పటిష్టమైన నెదర్లాండ్స్‌తో భారత జట్టు తలపడనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం గం. 8:45 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. జూనియర్‌స్థాయిలో చివరిసారి 2005లో నెదర్లాండ్స్ జట్టుపై భారత్ గెలిచింది.



జైపూర్ గెలుపు బోణీ



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు తొలి విజయం సాధించింది. గుజరాత్ జెయింట్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 35-32తో గెలిచింది. విరామ సమయానికి 12-20తో వెనుకబడి ఉన్న జైపూర్ జట్టు రెండో అర్ధభాగంలో పుంజుకుంది. రెయిడర్ అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 15 పాయింట్లు స్కోరు చేసి జైపూర్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38-36తో యూపీ యోధాస్‌ను ఓడించి ఈ సీజన్‌లో ఐదో మ్యాచ్‌లో తొలి విజయాన్ని అందుకుంది. బెంగళూరు తరఫున వికాశ్, భరత్ 11 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. నేడు జరిగే మ్యాచ్‌లో పట్నా పైరేట్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడుతుంది.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
బెంగాల్ వారియర్స్	3	2	0	1	13
యూపీ యోధాస్	4	2	2	0	12
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
జైపూర్ పింక్ పాంథర్స్	3	1	1	1	9
బెంగళూరు బుల్స్	5	1	4	0	9
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	2	1	1	0	5
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

తొలి రోజు ఆట రద్దు

పాచెఫ్‌స్ట్రూమ్: భారత్ 'ఎ', దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య నాలుగు రోజుల తొలి అనధికారిక టెస్టు తొలి రోజు ఆట రద్దయింది. భారత 'ఎ' జట్టు కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. టాస్ ముగిశాక వర్షం మొదలై ఎంతకూ తగ్గకపోవడంతో సోమవారం ఒక్క బంతి ఆట కూడా సాధ్యపడలేదు.

వరుణుడు కరుణిస్తేనే...

- నేడు భారత్, దక్షిణాఫ్రికాల మధ్య రెండో టి20 మ్యాచ్
- పొంచి ఉన్న వానముప్పు
- రాత్రి గం.8:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్-1'లో ప్రత్యక్ష ప్రసారం



తిలక్, ఇషాన్, సూర్య, యశస్వి

పోర్ట్ ఎలిజబెత్: వచ్చే ఏడాది టి20 ప్రపంచకప్‌కు ముందు అందుబాటులో ఉన్న ఈ కొన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లతో జట్టును సిద్ధం చేసుకోవాలని ఇటు భారత్, అటు దక్షిణాఫ్రికాలు చూస్తుంటే ప్రతికూల వాతావరణం పెను సమస్యగా మారింది. తొలి మ్యాచ్ వర్షంలో కొట్టుకుపోగా... ఇప్పుడు రెండో టి20కి కూడా వానముప్పు ఉండటం ఇరు జట్లకు ఇబ్బందిగా మారింది. జట్లకే కాదు... మ్యాచ్‌ల్ని అస్వాదించాలనుకున్న అభిమానులకు, రూ.కోట్లు గడించాలనుకున్న దక్షిణాఫ్రికా బోర్డు (సీఎస్‌ఏ)కు కూడా ఈ వాతావరణ పరిస్థితులు కొత్త సమస్యలు తెచ్చిపెడతాయి. కాబట్టి ఆలస్యంగా మొదలవనున్న రెండో మ్యాచ్‌కు వర్షం తెరిపినివ్వాలని అంతా కోరుకుంటున్నారు. కనీసం కుదించిన ఓవర్ల మ్యాచ్ జరిగినా మెరుపుల టి20ని చూడొచ్చని ఆశిస్తున్నారు.

టాస్ పడితే...

డర్బన్‌లో కనీసం టాస్ కూడా పడలేదు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగబోయే జట్లు టాస్ పడి ఆటకు బాట పడాలని గట్టిగా కోరుకుంటున్నారు. ఆసీస్‌తో సొంతగడ్డపై యువభారత్‌ను నడిపించిన సూర్యకుమార్‌కు ఈ సిరీస్‌లో ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో పలువురు అనుభవజ్ఞులు శుబ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, సిరాజ్‌లు జతవడంతో టీమిండియా క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగింది. ఆస్ట్రేలియాపై అదరగొట్టిన రింకూ సింగ్, జితేశ్ శర్మ, రవి బిష్ణోయ్‌లు కూడా తమ ప్రదర్శన కొనసాగించాలనుకుంటున్నారు. కానీ వరుణుడు మాత్రం కరుణించడం లేదు. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు కొత్త ముఖాలు మాథ్యూ బ్రీట్జ్‌కె, బర్గర్‌లను పరీక్షించాలనుకుంటే కుదరడం లేదు. దీంతో బవుమా లేని జట్టులో మార్క్‌రమ్ తన మార్క్ చూపించేందుకు అవకాశం చిక్కడం లేదు. మ్యాచ్ రోజు వానపడినా... మ్యాచ్ సమయానికల్లా తెరిపినిస్తే బాగుంటుంది. ఇదే జరిగితే ఇరుజట్లలోని యువ ఆటగాళ్లంతా కొండంత ఊరట పొంది ఆటపై దృష్టిపెడతారు. తమ సత్తా చాటుకునేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, రుతురాజ్, శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్, జితేశ్ శర్మ, జడేజా, ముకేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్/రవి బిష్ణోయ్, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్. **దక్షిణాఫ్రికా:** మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రీట్జ్‌కె, స్టబ్స్/క్లాసెన్, మిల్లర్, ఫెరీరా, జాన్సెన్/ఫెలుక్‌వాయో, కేశవ్ మహరాజ్, కొయెట్జీ, బర్గర్, షమ్సీ.

అండర్-16 టోర్నీలో ద్రవిడ్ X సెహ్వాగ్

విజయ్ మర్చంట్ టోర్నీ బరిలో దిగ్గజాల కుమారులు



అన్వయ్



ఆర్యవీర్

సాక్షి, మంగళగిరి: సడెన్‌గా చూస్తే అండర్-16 టోర్నీ ఏంటి? ద్రవిడ్, సెహ్వాగ్‌లు ముఖాముఖిగా తలపడటం ఏంటనే సందేహాలు రావడం ఖాయం. కానీ ఇది దిగ్గజాల మధ్య సమరం కాదు. వారి తర్వాతి తరం పోటీపడుతున్న టోర్నీ సంగతి! టీమిండియాకు ఏళ్ల తరబడి రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ కలిసి టాపార్డర్‌ను నడిపించారు. గెలిపించారు. ఇప్పుడు బీసీసీఐ దేశవాళీ జూనియర్ టోర్నీ అయిన విజయ్ మర్చంట్ ట్రోఫీలో కర్ణాటక అండర్-16 జట్టు కెప్టెన్‌గా అన్వయ్ ద్రవిడ్ (ద్రవిడ్ రెండో కుమారుడు), ఢిల్లీ అండర్-16 జట్టు ఓపెనర్‌గా ఆర్యవీర్ సెహ్వాగ్ (సెహ్వాగ్ పెద్ద కుమారుడు) బరిలోకి దిగారు. దీంతో మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ వార్తల్లో విశేషంగా నిలిచింది. మూడు రోజుల ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 56.3 ఓవర్లలో 144 పరుగుల వద్ద ఆలౌటైంది. అయితే వికెట్ కీపర్, కెప్టెన్ అన్వయ్ (0) డకౌటయ్యాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఢిల్లీ 30 ఓవర్లలో వికెట్ నష్టానికి 107 పరుగులు చేసింది. ఆర్యవీర్ సెహ్వాగ్ (98 బంతుల్లో 50 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధసెంచరీ చేశాడు. తొలిరోజు ఆటను పరిశీలిస్తే... ఒక విధంగా టీనేజ్ ద్రవిడ్ టీమ్‌పై కుర్ర సెహ్వాగ్ పైచేయి సాధించాడు.

77 స్థానాలు... 333 ఆటగాళ్లు

19న దుబాయ్‌లో ఐపీఎల్ వేలం




న్యూఢిల్లీ: దుబాయ్‌లో ఐపీఎల్-2024 సీజన్ కోసం ఆటగాళ్ల వేలానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 19న వేలం కార్యక్రమం జరుగుతుంది. మొత్తం 1166 మంది ఆటగాళ్లు నమోదు చేసుకోగా... ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఫ్రాంచైజీలతో సంప్రదించాక 333 మందితో సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఇందులో 119 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాను విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించిన ట్రావిస్ హెడ్‌పై ఫ్రాంచైజీలన్నీ కన్నేశాయి. కమిన్స్, మిచెల్ స్టార్క్‌లు కూడా ఆసీస్ తరఫున హాట్ కేక్‌లు కానున్నారు. ప్రపంచకప్‌లో సెమీఫైనలిస్టుగా నిలిచిన న్యూజిలాండ్ తరఫున మెరిసిన రచిన్ రవీంద్రపై కూడా కోట్లు కురిసే అవకాశాలున్నాయి. ఇక ఫ్రాంచైజీల విషయానికొస్తే మొత్తం 10 జట్లకు కావాల్సింది 77 మంది ఆటగాళ్లయితే ఇందులో 30 విదేశీ బెర్తులున్నాయి. ఇందుకోసం రూ. 262.95 కోట్లు వెచ్చించాల్సి ఉంది. ఖాళీల పరంగా చూస్తే అత్యధికంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ 12 మందిని కొనుక్కోవాల్సి ఉండగా... ఆ జట్టు చేతిలో రూ. 32.70 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక అత్యధికమొత్తం రూ.38.15 కోట్లు గుజరాత్ వద్ద ఉంటే వారికి 8 మంది ఆటగాళ్లు కావాలి. కనిష్ట మొత్తం రూ. 13.15 కోట్లు లక్నో సూపర్ జెయింట్స్ ఖాతాలో ఉండగా... వారు ఆరు బెర్తుల్ని భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. ధోని టీమ్ చెన్నై ఖాతాలో రూ. 31.40 కోట్లు, కోహ్లి జట్టు బెంగళూరు ఖాతాలో రూ. 23.25 కోట్లు అందుబాటులో ఉండగా ఇరుజట్లకు ఆరుగురు చొప్పున ఖాళీలున్నాయి. హైదరాబాద్ నుంచి అభిషేక్ మురుగన్, రాహుల్ బుద్ధి, రోహిత్ రాయుడు, అనికేత్ రెడ్డి, రవితేజ, తనయ్ త్యాగరాజన్, అరవెల్లి అవినాశ్‌రావు, రక్షణ్ రెడ్డి, మనీశ్ రెడ్డి... ఆంధ్ర నుంచి కోన శ్రీకర్ భరత్, రికీ భుయ్, హనుమ విహారి, పృథ్వీరాజ్ వేలంలో ఉన్నారు.

జట్టు	ఖాళీల సంఖ్య	మిగిలిన మొత్తం
చెన్నై	6	రూ. 31.4 కోట్లు
ఢిల్లీ	9	రూ. 28.95 కోట్లు
గుజరాత్	8	రూ. 38.15 కోట్లు
కోల్‌కతా	12	రూ. 32.7 కోట్లు
లక్నో	6	రూ. 13.15 కోట్లు
ముంబై	8	రూ. 17.75 కోట్లు
పంజాబ్	8	రూ. 29.1 కోట్లు
బెంగళూరు	6	రూ. 23.25 కోట్లు
రాజస్తాన్	8	రూ. 14.5 కోట్లు
హైదరాబాద్	6	రూ. 34 కోట్లు
మొత్తం	77	రూ. 262.95 కోట్లు

ముగ్గురు కొత్తవారికి చోటు

భారత్‌తో టెస్టు సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టు ప్రకటన



అట్కిన్సన్

లండన్: వచ్చే నెలలో భారత్‌లో ఐదు టెస్టుల సిరీస్ కోసం పర్యటించే ఇంగ్లండ్ జట్టును సోమవారం ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన ఇంగ్లండ్ టెస్ట్ జట్టులో ముగ్గురు కొత్త ప్లేయర్లు గస్ అట్కిన్సన్, టామ్ హార్ట్‌లే, షోయబ్ బషీర్‌లకు తొలిసారి చోటు లభించింది. కౌంటీ క్రికెట్‌లో సర్రే క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించే 25 ఏళ్ల పేస్ బౌలర్ అట్కిన్సన్ ఇప్పటికే ఇంగ్లండ్ తరఫున తొమ్మిది వన్డేలు, రెండు టి20 మ్యాచ్‌లు ఆడాడు. ఇంగ్లండ్ బృందంలో నలుగురు స్పెషలిస్ట్ స్పిన్నర్లు రేహాన్ అహ్మద్, జాక్ లీచ్, హార్ట్‌లే, షోయబ్ బషీర్ ఉండటం విశేషం. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ జనవరి 25 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది. రెండో టెస్ట్ (ఫిబ్రవరి 2-6) విశాఖపట్నంలో, మూడో టెస్ట్ (ఫిబ్రవరి 15-19) రాజ్‌కోట్‌లో, నాలుగో టెస్ట్ (ఫిబ్రవరి 23-27) రాంచీలో, ఐదో టెస్ట్ (మార్చి 7-11) ధర్మశాలలో జరుగుతాయి.

ఇంగ్లండ్ టెస్ట్ జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), జో రూట్, బెయిర్‌స్టో, హ్యారీ బ్రూక్, జాక్ క్రాలీ, ఒలీ పోప్, జేమ్స్ అండర్సన్, బెన్ డకెట్, బెన్ ఫోక్స్, జాక్ లీచ్, ఒలీ రాబిన్సన్, మార్క్ వుడ్, రేహాన్ అహ్మద్, షోయబ్ బషీర్, టామ్ హార్ట్‌లే, జాక్ లీచ్, అట్కిన్సన్.

సెమీఫైనల్లో హరియాణా

రాజ్‌కోట్: లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చహల్ (4/37) మాయాజాలం... అంకిత్ కుమార్ (102; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకం... వెరసి విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో 12 ఏళ్ల తర్వాత హరియాణా జట్టు మళ్లీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బెంగాల్ జట్టుతో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బెంగాల్ 50 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. షహబాజ్ అహ్మద్ (100; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో రాణించాడు. అనంతరం హరియాణా 45.1 ఓవర్లలో 6 వికెట్లకు 226 పరుగులు సాధించి విజయం సాధించింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో రాజస్తాన్ 200 పరుగుల తేడాతో కేరళపై, కర్ణాటక ఏడు వికెట్ల తేడాతో విదర్భపై, తమిళనాడు ఏడు వికెట్ల తేడాతో ముంబైపై గెలుపొంది సెమీఫైనల్ చేరుకున్నాయి.

సినిమా

2023 రౌండప్

వెబ్‌లోకి వచ్చేశారు

సినిమా అంటే కొన్ని పరిమితులుంటాయి. వెబ్ సిరీస్‌లకు హద్దులు లేవు. రొమాన్స్, వయొలెన్స్, సెంటిమెంట్.. ఏదైనా కొంచెం ఓవర్‌గా చూపించొచ్చు. ఈ నేపథ్యంలో సినిమా స్టార్స్ తమ ఇమేజ్‌కి భిన్నమైన క్యారెక్టర్లు, కథలు ఒప్పుకుని వెబ్ వరల్డ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ ఏడాది వెబ్ వరల్డ్‌లోకి వేంచేసిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.




'దూత'లో నాగచైతన్య




'రానా నాయుడు'లో రానా, వెంకటేశ్

- ఫ్యామిలీ ఆడియన్స్ ఫేవరెట్ హీరోలలో ఒకరైన వెంకటేశ్ ఓటీటీ వరల్డ్ కోసం కొత్త ట్రాక్‌లోకి వచ్చారు. కాస్త అడల్ట్ కంటెంట్ ఉన్న 'రానా నాయుడు' వెబ్ సిరీస్ చేశారు. అమెరికన్ క్రైమ్ డ్రామా 'రే డోనోవన్' ఆధారంగా 'రానా నాయుడు' వెబ్ సిరీస్ తీశారు దర్శక ద్వయం సుపర్ణ్ వర్మ, కరణ్ అన్షుమాన్. వెంకటేశ్‌తో పాటు రానా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, సుచిత్రా పిళ్లై కీలక పాత్రలు చేశారు. కథ విషయానికొస్తే.. సెలబ్రిటీల సమస్యలను పరిష్కరించే రానా నాయుడు (రానా)కు అతని తండ్రి నాగ నాయుడు (వెంకటేశ్) అంటే ద్వేషం. పదిహేనేళ్ల జైలు జీవితం తర్వాత తిరిగొచ్చిన నాగ నాయుడుతో రానా నాయుడు తిరిగి కలుస్తాడా? నాగ నాయుడు ఎందుకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది? అనే అంశాలతో ఈ సిరీస్ సాగుతుంది. పది ఎపిసోడ్ల ఈ సిరీస్‌కి డైలాగ్స్ పరంగా విమర్శలు వచ్చినప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా ఈ ఏడాది మార్చి 10 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. 'రానా నాయుడు' సెకండ్ సీజన్ కూడా ఉంటుంది.
- 'దూత'గా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చారు నాగచైతన్య. ఆయన హీరోగా 'మనం', 'థ్యాంక్యూ' సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు విక్రమ్ కె. కుమార్ క్రైమ్ థ్రిల్లర్ జానర్ 'దూత'కు దర్శకుడు. ఎనిమిది ఎపిసోడ్స్‌గా సాగే ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియాభవానీ శంకర్, పశుపతి కీలక పాత్రలు పోషించారు. పాత్రికేయ విలువల కన్నా ధనమే ముఖ్యమని భావించే ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ సాగర్ వర్మ (నాగచైతన్య పాత్ర) 'సమాచార పత్రిక'కు చీఫ్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడు. సాగర్‌కు దొరికే పేపర్ క్లిప్పింగ్‌లో ఉన్నవారు చనిపోతుంటారు. ఇలా ఎందుకు జరుగుతుంది? సాగర్ ఏం చేశాడు? అన్నది 'దూత' సిరీస్‌లో చూడొచ్చు. డిసెంబరు 1 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది.
- 'హనుమాన్ జంక్షన్', 'స్వయంవరం', 'చిరునవ్వుతో..', 'చెప్పవే చిరుగాలి', 'గోపీ గోపికా గోదావరి' వంటి సినిమాల్లో నటించిన వేణు తొట్టెంపూడి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులే. వెండితెరపై కాస్త స్లో అయిన వేణు డిజిటల్ తెరపై సత్తా చాటాలని హారర్ థ్రిల్లర్ జానర్‌లో సాగే 'అతిథి' వెబ్ సిరీస్‌లో నటించారు. అవంతికా మిశ్రా, అదితీ గౌతమ్ కీలక పాత్రలు పోషించారు. వైజీ భరత్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఆరు ఎపిసోడ్స్‌గా సాగుతోంది. దెయ్యాలు ఉన్నాయని ప్రచారం సాగే దెయ్యాల మిట్ట అనే ప్రాంతానికి సమీపాన సంధ్య నిలయం అనే పెద్ద భవంతిలో రచయిత రవివర్మ (వేణు తొట్టెంపూడి), అతని భార్య సంధ్య (అదితీ గౌతమ్) నివసిస్తుంటారు. అయితే దెయ్యాలు లేవని నమ్మే యూట్యూబర్ సవారి (వెంకటేశ్ కాకుమాను) అక్కడికి వెళ్తాడు. అక్కడ జరిగిన కొన్ని ఘటనలకు భయపడి సంధ్య నిలయంకు వెళ్తాడు. తన కంటే ముందే సంధ్య నిలయంకు వచ్చిన మాయ (అవంతిక మిశ్రా) చనిపోతుందని తెలుసుకుంటాడు సవారి. మరి.. ప్రచారంలో ఉన్నట్లుగా దెయ్యాల మిట్టలో దెయ్యాల సంచారం ఉందా? మాయ చావుకు కారణం ఎవరు? ఫైనల్‌గా సవారి ఏం తెలుసుకుంటాడు? అన్నది క్లుప్తంగా 'అతిథి' సిరీస్ కథ. ఈ ఏడాది సెప్టెంబరు 10 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది.



'అతిథి'లో వేణు



'పులి మేక'లో ఆది



'దయా'లో జేడీ చక్రవర్తి

- నటుడు, దర్శకుడు జేడీ చక్రవర్తి గురించి ప్రత్యేకించి పరిచయం అక్కర్లేదు. ఈ ఏడాది వెబ్ వరల్డ్‌లో డబుల్ ధమాకా ఇచ్చారు జేడీ. ఆయన టైటిల్ రోల్ చేసిన వెబ్ సిరీస్ 'దయా'. ఈ సిరీస్‌కు పవన్ సాధినేని దర్శకుడు. ఈషా రెబ్బా, పృథ్వీరాజ్, రమ్యా నంబీసన్, కమల్ కామరాజు కీలక పాత్రలు పోషించారు. చేపలు ట్రాన్స్‌పోర్ట్ చేసే ఫ్రీజర్ వ్యాన్ డ్రైవర్ దయా (జేడీ చక్రవర్తి). అతని భార్య అలివేలు (ఈషా రెబ్బా) నిండు గర్భిణి. ఓ రోజు దయా పని మీద కాకినాడకు బయలుదేరతాడు. అయితే తన వ్యాన్‌లో శవం ఉందని తెలుసుకుని షాక్ అవుతాడు. ఆ శవం దయా బండిలోకి ఎందుకు వచ్చింది. ఈ ఘటనకు, జర్నలిస్ట్ కవిత (రమ్యా నంబీసన్)కు సంబంధం ఏంటి? అనేది సిరీస్‌లో చూడాలి. ఎనిమిది ఎపిసోడ్స్‌గా ఈ సిరీస్ ఆగస్టు 4 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అలాగే జేడీ చక్రవర్తి ఓ ముఖ్య పాత్రలో నటించిన మరో వెబ్ సిరీస్ 'తాజా ఖబర్' జనవరి 5 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.
- ఆది సాయికుమార్ నటించిన వెబ్ సిరీస్ 'పులిమేక'. ఈ సిరీస్‌కు కె. చక్రవర్తి రెడ్డి దర్శకుడు. లావణ్యా త్రిపాఠి ఓ లీడ్ రోల్ చేశారు. కథ విషయానికొస్తే...హైదరాబాద్‌లో జరుగుతున్న పోలీసుల వరుస హత్యల మిస్టరీని చేధించేందుకు రంగంలోకి దిగుతారు కిరణ్ ప్రభ (లావణ్యా త్రిపాఠి). ఫోరెన్సిక్ హెడ్ ప్రభాకర్ శర్మగా పోలీసులకు హెల్ప్ చేస్తుంటాడు ఆది సాయికుమార్. మరి.. కిల్లర్‌ను కిరణ్ ప్రభ పట్టుకున్నారా? అతను పోలీసులనే ఎందుకు టార్గెట్ చేస్తున్నాడు? అనేది 'పులి మేక' సిరీస్ కథాంశం. ఎనిమిది ఎపిసోడ్స్‌గా ఈ సిరీస్ ఫిబ్రవరి 24 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

ఆపరేషన్ వాలెంటైన్ డేట్ ఫిక్స్

వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ పైలట్‌గా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషీ చిల్లర్ నటిస్తున్నారు. శక్తీ ప్రతాప్ సింగ్ హడాని దర్శకునిగా పరిచయం చేస్తూ సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ పై సందీప్ ముద్దా నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. తెలుగు, హిందీ భాషల్లో 2024 ఫిబ్రవరి 16న చిత్రాన్ని, త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సోమవారం యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్ ఒక అతి పెద్ద వైమానిక దాడిని ఎదుర్కోడానికి సిద్ధం అయ్యే విజువల్స్‌ని గ్లింప్స్‌గా విడుదల చేశారు. ''దేశభక్తి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో మన వైమానిక దళ వీరుల అసమానమైన ధైర్య సాహసాలను, దేశాన్ని రక్షించడానికి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను చూపిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాతలు: నందకుమార్ అబ్బినేని, వకీల్ ఖాన్.



వరుణ్ తేజ్

టీజర్ బాగుంది.. సినిమా హిట్టవ్వాలి

- డైరెక్టర్ అనిల్ రావిపూడి



మేఘా లేఖ, అనిల్ రావిపూడి, సోహైల్

''బిగ్ బాస్' షో నుంచి సోహైల్ నాకు తెలుసు. తను ప్రతి సినిమాకి చాలా కష్టపడుతున్నాడు. 'బూట్ కట్ బాలరాజు'తో తనకి మంచి విజయం రావాలి. ఈ మూవీ టీజర్ చాలా వినోదాత్మకంగా ఉంది.. సినిమా పెద్ద హిట్ కావాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. సోహైల్ హీరోగా శ్రీ కోనేటి దర్శకత్వం వహించిన చిత్రం 'బూట్ కట్ బాలరాజు'. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషించారు. గ్లోబల్ ఫిలిమ్స్-కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. సోహైల్ మాట్లాడుతూ-''శ్రీ కోనేటిగారు అన్ని జాగ్రత్తలు తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాషాగారు ఎక్కడా రాజీపడకుండా క్వాలిటీతో ఈ సినిమాని తీశారు'' అన్నారు. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది. కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. ''అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది'' అన్నారు శ్రీ కోనేటి. ''ఇది నా తొలి చిత్రం. ప్రేక్షకులు సపోర్ట్ చేసి మరిన్ని సినిమాలు నిర్మించే అవకాశం కల్పించాలి'' అన్నారు ఎండీ పాషా. ''మంచి కథ ఉన్న చిత్రమిది'' అన్నారు నటి ఇంద్రజ.

గాజు భవంతిలో స్పై



అడివి శేష్

అడివి శేష్ గూఢచారిగా మారిపోయారు. దేశం కోసం పోరాడడానికి దేశం వెలుపల ఒక మిషన్ మీద ఉన్నారు. ప్రధానంగా ఓ ఐదంతస్తుల గాజు భవంతి నుంచి తన కార్యకలాపాలను నిర్వర్తిస్తుంటారు ఈ గూఢచారి. అడివి శేష్ హీరోగా నటించిన సంచలన విజయం 'గూఢచారి' ఫ్రాంచైజీలోని 'జీ 2' ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ కోసం హైదరాబాద్‌లో ఐదంతస్తుల గాజు భవంతి సెట్‌ని తయారు చేయించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు. బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

భయపెట్టే పిండం



శ్రీరామ్, ఖుషీ రవి

''పిండం' సినిమా ఏంటి అనేది ఈ నెల 15న తెలుస్తుంది. ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూడటానికి నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ మూవీ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని హీరో శ్రీరామ్ అన్నారు. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ- ''మా సినిమా టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వస్తోంది. సినిమాకి కూడా అదే స్పందన వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''నేనెప్పుడూ మంచి యూనిట్‌తో పని చేయాలని కోరుకుంటాను. 'పిండం'తో అది నెరవేరింది'' అన్నారు ఖుషీ రవి. ''మా సినిమా చూసి ప్రేక్షకులు కచ్చితంగా భయపడతారు'' అన్నారు సాయికిరణ్ దైదా. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, రచయిత కవి సిద్ధార్థ, కెమెరామేన్ సతీష్ మనోహర్ మాట్లాడారు.

వినోదాల ఆలంబన

దర్శకుడు కోదండ రామిరెడ్డి తనయుడు వైభవ్ హీరోగా నటించిన చిత్రం 'ఆలంబన'. పారి కె. విజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పార్వతీ నాయర్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రలో నటించారు. తమిళంలో రూపొందిన ఈ చిత్రాన్ని గంగ ఎంటర్‌టైన్మెంట్స్‌పై మహేశ్వర్ రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 15న తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. సోమవారం 'ఆలంబన' తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం వైభవ్ మాట్లాడుతూ- ''ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. ఆ కామెడీని థియేటర్లలో బాగా ఎంజాయ్ చేస్తారు. తెలుగులో నేను గ్యాప్ తీసుకోలేదు.. గ్యాప్ వచ్చిందంతే. తెలుగులో మంచి పాత్రలు వచ్చినా చేయలేకపోయాను'' అన్నారు. ''ఈ సినిమాని యూనివర్సల్ కాన్సెప్ట్‌తో చేశాను'' అన్నారు పారి కె. విజయ్. ''శివ కార్తికేయన్ 'వరుణ్ డాక్టర్' తర్వాత తెలుగులో మేం రిలీజ్ చేస్తున్న చిత్రం 'ఆలంబన'. ఈ మూవీ ప్రేక్షకులందర్నీ నవ్విస్తుంది'' అన్నారు మహేశ్వర్ రెడ్డి.



వైభవ్, పార్వతీ నాయర్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
103	28
69,929	20,997

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,387	▼	17
డోజోన్స్	36,333	▲	85
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,545	▼	10
డాక్స్	16,794	▲	35
షాంఘై	2,991	▲	22
నికాయ్	32,791	▲	484

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,452
బంగారం (99.5 స్వచ్ఛత)	61,206
వెండి (కేజీ)	71,402

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.98	84.00
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.45	106.00
€	యూరో	ఎస్‌బీఐ	88.71	91.06
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.81	58.11
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.83	55.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.38	63.37
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.81	23.60
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.50	12.57

70,000 వాలా!

కొత్త శిఖరంపై సెన్సెక్స్

- కొనసాగిన రికార్డుల ర్యాలీ..
- 21 వేల చేరువలో నిఫ్టీ ముగింపు
- రాణించిన మెటల్, ఐటీ షేర్లు



ముంబై: స్టాక్ మార్కెట్ రికార్డు ర్యాలీలో భాగంగా సెన్సెక్స్ సరికొత్త మైలురాయిని తాకింది. 44 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో తొలిసారి 70,000 పాయింట్లను తాకింది. మరో సూచీ నిఫ్టీ 21,000 శిఖరానికి కేవలం 3 పాయింట్ల దూరంలో నిలిచింది. కొంతకాలంగా విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది., ఆర్‌బీఐ వరుసగా అయిదోసారి వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడంతో పాటు దేశీయ వృద్ధి అవుట్‌లుక్‌ను పెంచింది. అయిదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 3 రాష్ట్రాల్లో గెలుపుతో రాజకీయ స్థిరత్వం రావొచ్చనే ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. ప్రాథమిక మార్కెట్లు ఐపీఓలతో కళకళలాడుతున్నాయి. దీంతో కొన్ని వారాలుగా దలాల్ స్ట్రీట్‌లో కొనుగోళ్ల పర్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో సెన్సెక్స్ నిఫ్టీలు కొత్త రికార్డుల దిశగా సాగుతున్నాయి. యూఎస్ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్ఓఎంసీ) నిర్ణయాలు బుధవారం వెలువడనున్న నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్తబ్దుగా ట్రేడవుతున్నాయి.

ఒడిదుడుకులున్నా.., సరికొత్త శిఖరాలకు ....

ఆసియా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 100 పాయింట్లు పెరిగి 69,926 వద్ద, నిఫ్టీ నాలుగు పాయింట్లు నష్టపోయి 20,965 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. బ్యాంకింగ్, ఐటీ, మెటల్ షేర్లకు రాణించడంతో ప్రథమార్ధంలోనే 232 పాయింట్లు పెరిగి 70,000 స్థాయిపై 70,058 వద్ద, నిఫ్టీ 57 పాయింట్లు బలపడి 21,026 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అయితే ద్వితీయార్ధంలో రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో సూచీలు కొంతమేర లాభాలు కోల్పోయాయి. చివరికి సెన్సెక్స్ 103 పాయింట్ల లాభంతో 69,929 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు బలపడి 21,000 శిఖరానికి కేవలం 3 పాయింట్ల దూరంలో 20,997 నిలిచింది.

''కొత్త ఏడాదికి సరిగ్గా 20 రోజుల ముందు సెన్సెక్స్ 70 వేల పాయింట్ల ధమాకా ఇచ్చింది. అయితే నేడు(మంగళవారం) అమెరికా, భారత్‌ల నవంబర్ ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ)డేటా వెల్లడి నేపథ్యంలో అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. మరో ఏడాది కాలంలో సెన్సెక్స్ 80 వేల స్థాయిని అందుకునేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా మౌలిక, ప్రభుత్వ రంగాల షేర్లు ర్యాలీకి ప్రాతినిథ్యం వహించవచ్చు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల ప్రభావంతో ఈక్విటీ మార్కెట్లో కొంత అస్థిరతర ఉండొచ్చు.'' అని మార్కెట్ నిపుణుడు విజయ్ కేడియా తెలిపారు.

- సెన్సెక్స్ 65,000 స్థాయి నుంచి 70,000 పాయింట్లకు చేరేందుకు కేవలం 110 రోజుల సమయం పట్టింది.
- 1979లో 100 పాయింట్ల వద్ద తన ప్రయాణాన్ని ప్రారంభించిన సెన్సెక్స్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 వేల స్థాయికి చేరుకుంది. అంటే 44 ఏళ్లలో సెన్సెక్స్ ఇన్వెస్టర్లకు 700 రెట్ల లాభాలు పంచింది.
- సెన్సెక్స్ కొత్త రికార్డు స్థాయి నెలకొల్పడంతో సోమవారం రూ.1.85 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.351.09 లక్షల కోట్లకు చేరింది.



సెన్సెక్స్ జర్నీ..

మైలురాయి	అందుకున్న తేది
50,000	ఫిబ్రవరి 3, 2021
55,000	ఆగస్టు 13, 2021
60,000	సెప్టెంబర్ 24, 2021
65,000	జూలై 3, 2023
70,000	డిసెంబర్ 11, 2023

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నిధుల సమీకరణ, ఎన్ఎస్ఈ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ ప్రణాళికల నేపథ్యంలో స్పైస్‌జెట్ షేరు బీఎస్ఈలో 10%పైగా లాభపడి రూ.60.57 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 16% ఎగసి రూ.63.69 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- అమెరికా నియంత్రణ సంస్థ హైదరాబాద్ రీసెర్చ్ ఫ్యాకల్టీ యూనిట్‌కు 3 అభ్యంతరాలు జారీ చేయడంతో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ 5% నష్టపోయి రూ.5,473 వద్ద స్థిరపడింది.
- ఓఎన్‌జీసీ నుంచి రూ.1,145 కోట్ల ఆర్డరు దక్కించుకోవడంతో మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ షేరు 3% పెరిగి రూ.2118 వద్ద నిలిచింది.

టాటా పవర్, ఐవోసీ జట్టు

దేశవ్యాప్తంగా 500 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 500 ఫాస్ట్, అల్ట్రా ఫాస్ట్ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసే దిశగా టాటా పవర్ ఈవీ చార్జింగ్ సొల్యూషన్స్, ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) చేతులు కలిపాయి. ఇందుకు సంబంధించి కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం (ఎంవోయూ) ఐవోసీ రిటైల్ అవుట్‌లెట్స్‌లో టాటా పవర్ చార్జింగ్ పాయింట్లను ఇన్‌స్టాల్ చేస్తుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు వంటి పెద్ద నగరాలతో పాటు గుంటూరు–చెన్నై హైవే, సేలం–కొచ్చి హైవే వంటి జాతీయ రహదారుల వెంట వీటిని నెలకొల్పుతుంది. దీనితో సుదూర ప్రయాణాలు చేసే ఎలక్ట్రిక్ వాహనదారులు రేంజి (మైలేజి)పరంగా ఆందోళన చెందాల్సిన అవసరం తప్పుతుందని టాటా పవర్ హెడ్ (బిజినెస్ డెవలప్‌మెంట్ – ఈవీ చార్జింగ్) వీరేంద్ర గోయల్ తెలిపారు. చార్జర్ల లభ్యత గురించి టాటా పవర్ ఈజెడ్ చార్జ్, ఇండియన్ ఆయిల్ ఈ–చార్జ్ మొబైల్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. 2024 నాటికి 10,000 పైచిలుకు ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఐవోసీ ఈడీ సౌమిత్ర శ్రీవాస్తవ పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీకి ఊతం

- కొత్త పథకాలపై కేంద్రం కసరత్తు
- ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కృష్ణన్

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీని దేశీయంగా పెంచేందుకు ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలను (పీఎల్ఐ) ప్రకటించిన కేంద్ర సర్కారు.. ఇప్పుడు ఎలక్ట్రానిక్ విడిభాగాల స్థానిక తయారీని సైతం ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించి కొత్త పథకాలపై కసరత్తు చేస్తున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సెక్రటరీ ఎస్.కృష్ణన్ వెల్లడించారు. సీఐఐ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశ మొబైల్ ఫోన్ల మార్కెట్లో 99% స్థానికంగానే తయారవుతున్నట్లు చెప్పారు. ''అసెంబ్లీ యూనిట్లకు అదనంగా 10–15 శాతం విలువ జోడింపుపైనే ఆధారపడకూడదు. మనం ఇంకా ఏమి చేయగలమో, విలువ ఆధారిత సరఫరాలో మరింత ముందుకు ఎలా వెళ్లగలమో ఆలోచించాలి''అని సూచించారు. ఏ దేశం కూడా మొత్తం వ్యాల్యూచైన్‌లో ఆధిపత్యం చూపించలేదన్నారు. చైనా విషయానికొస్తే వ్యాల్యూచైన్‌లో 40–45% వాటా కలిగి ఉన్నట్లు చెప్పారు. భారత్ 35–40% సొంతం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని పరిశ్రమకు సూచించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల విడిభాగాలకు సంబంధించి రెండో విడత పీఎల్ఐ పథకాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు.



ఇంధనంపై ఎక్సైజ్ సుంకాలు తగ్గవు..!



న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్‌పై పన్నుల్లో కోత విధించే అవకాశం లేదని ఆర్థికశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధరలు ఇప్పటికే తగ్గాయని, ఈ నేపథ్యంలో ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే పరిస్థితి లేదని చెప్పారు. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతానికి దిగుమతులపై ఆధారపడి ఉన్న సంగతి తెలిసిందే. ''ముడి చమురు ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు, కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. ధరలు ఇప్పటికే తగ్గినప్పుడు, ఇక పన్ను తగ్గింపు ప్రశ్న ఉత్పన్నం కాదు. మీరు పెట్రోల్, డీజిల్ ధర తగ్గింపు కోసం అడగవచ్చు, కానీ పన్నుల తగ్గింపు గురించి ఇప్పుడు ప్రశ్నించడం సరికాదు'' అని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని చివరిసారిగా మే 2022లో తగ్గించారు. ఈ నిర్ణయం మేరకు పెట్రోల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ లీటర్‌కు రూ.8 తగ్గింది. డీజిల్‌పై రూ.6 తగ్గించడం జరిగింది.

రూ.33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్లే లక్ష్యం!

బడ్జెట్ సవరిత అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రూ. 33.61 లక్షల కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని శాఖ సీనియర్ అధికారి తెలిపారు.

బీఎండబ్ల్యూ కార్లు ప్రియం



న్యూఢిల్లీ: బీఎండబ్ల్యూ అన్ని మోడళ్ల ధరలను 2% వరకు పెంచుతోంది. జనవరి 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ సోమవారం ప్రకటించింది. విదేశీ మారకపు రేట్లు, పెరుగుతున్న తయారీ ఖర్చులలో హెచ్చుతగ్గుల ప్రతికూల ప్రభావాలను పాక్షికంగా భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఎండబ్ల్యూ వెల్లడించింది. ఇప్పటికే మారుతీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా, ఆడి తదితర కంపెనీలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి.

'రుణమాఫీ' ఆఫర్లపై.. తస్మాత్ జాగ్రత్త: ఆర్‌బీఐ



న్యూఢిల్లీ: ప్రింట్ మీడియాతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో 'రుణమాఫీ' ఆఫర్లకు సంబంధించిన తప్పుదోవ పట్టించే ప్రకటనల బారిన పడవద్దని రిజర్వ్ బ్యాంక్ ప్రజలను హెచ్చరించింది. రుణమాఫీని ఆఫర్ చేస్తూ రుణగ్రహీతలను ప్రలోభపెట్టే కొన్ని తప్పుదోవ పట్టించే ప్రకటనలను గమనించినట్లు బ్యాంకింగ్ రెగ్యులేటర్ ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని సంస్థలు, ప్రింట్ మీడియాతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఇలాంటి పలు ప్రచారాలు చురుకుగా చేస్తున్నట్లు కనిపిస్తోందని పేర్కొంది. అటువంటి సంస్థలు ఎలాంటి అధికారం లేకుండా 'రుణ మాఫీ సర్టిఫికెట్లు' జారీ చేయడానికి సేవా/చట్టపరమైన రుసుము వసూలు చేస్తున్నాయని కూడా వార్తలు వస్తున్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కొంతమంది వ్యక్తులు రుణ గ్రహీతలను తప్పుదారిపట్టించే విధంగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. అలాంటి సంస్థలతో లావాదేవీలు నెరపితే ఆర్థిక నష్టాలు తప్పవని వినియోగదారులకు హెచ్చరించింది. ''బ్యాంకులతోసహా ఆర్థిక సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని అటువంటి సంస్థలు లేదా వ్యక్తులు తప్పుగా సూచిస్తున్నారు. తద్వారా బ్యాంకింగ్ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. ఇటువంటి కార్యకలాపాలు ఆర్థిక సంస్థల స్థిరత్వాన్ని, ముఖ్యంగా డిపాజిటర్ల ప్రయోజనాలను దెబ్బతీస్తాయి' అని ఆర్‌బీఐ ప్రకటన వివరించింది. ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మి నష్టపోవద్దని, ఈ తరహా తప్పుడు ప్రచారం తమ దృష్టికి వస్తే, విచారణా సంస్థల దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేసింది.

ప్రధాని మోదీతో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. సోమవారం పార్లమెంట్‌లోని ప్రధానమంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు అంశాలపై చర్చించారు. 'ప్రధానమంత్రి మోదీని కలుసుకోవడం గౌరవంగా భావిస్తున్నా. ఏపీ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఫలవంతమైన సహకారం ఆశిస్తున్నాం' అని ఎంపీ విజయసాయిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'ప్రసాద్' పనులు ప్రారంభం కాలేదు

పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని రామప్ప, భద్రాచలం క్షేత్రాల అభివృద్ధికి ప్రసాద్ పథకంలో భాగంగా 2022–23లో ఎంపిక చేశామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రామప్ప క్షేత్రానికి రూ.62 కోట్లు, భద్రాచలం క్షేత్రానికి రూ.41.38 కోట్లు నిధులు ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు సోమవారం సమాధానంగా చెప్పారు. ఏపీలోని సింహాచల క్షేత్రం అభివృద్ధికి రూ.54.04 కోట్లు ఆమోదం తెలిపినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ పథకం కింద అమరావతి పట్టణ అభివృద్ధి, శ్రీశైలం ఆలయ అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తి కాగా.. అన్నవరం, నెల్లూరులోని వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాలను సైతం ప్రసాద్ పథకంలో చేర్చామన్నారు.

కశ్మీరీ శరణార్థులకు ఎట్టకేలకు న్యాయం

కేంద్రానికి వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి సూచన

రాజ్యసభలో అభినందించిన హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ సభ్యులు

పీవోకేలో నామినేషన్ పద్ధతిలో ఎమ్మెల్యేలను చేయండి

సాక్షి, న్యూఢిల్లీ: దశాబ్దాల తరువాత కశ్మీరీ శరణార్థులకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించారు. సోమవారం రాజ్యసభలో జమ్మూ కశ్మీర్ రిజర్వేషన్, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. తరతరాలుగా అక్కడి వారికి జరుగుతున్న అన్యాయాలను ఈ బిల్లుల ద్వారా సరిదిద్దగల అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. కశ్మీర్ చరిత్రలో అత్యంత దుర్మార్గుడైన పాలకుడి చేతిలో కనీవినీ ఎరుగని మారణకాండను ఎదుర్కొని.. అరాచకాలు, అకృత్యాలు, నిర్బంధాల పాలై సర్వస్వం కోల్పోయిన కశ్మీర్ శరణార్థుల జీవితాలకు భరోసా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లుల్ని ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. తరతరాలుగా అక్కడి వారికి జరుగుతున్న అన్యాయాలను ఈ బిల్లుల ద్వారా సరిదిద్దగల అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. వలసపోయిన కశ్మీరీ పండిట్ల కుటుంబాలకు ఇస్తున్న రూ.13 వేల భత్యాన్ని రూ.20 వేలకు పెంచాలని సూచించారు.



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతానికి కేటాయించిన 24 స్థానాల్లో ఎన్నికలు జరిగే అవకాశం లేనందున ఆయా సీట్లు నామినేషన్ ప్రాతిపదికపై ఎమ్మెల్యేలను భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ విజయసాయిరెడ్డి సూచించారు. ఆయా సీట్లు పీవోకే ప్రాంతంలోని వారితోనే భర్తీ చేయాలన్నారు. 1389–1413 మధ్య పర్షియన్‌రాజు సుల్తాన్ సికిందర్ పాలనలో జరిగిన అకృత్యాలను వివరించారు. అతడి పాలనలో కశ్మీరీ ప్రజలు పెద్దఎత్తున వలసపోయారని.. అప్పట్లో సికిందర్ సాగించిన దుర్మార్గాలు, దారుణాలు మాటలకు అందనివని చెప్పారు. అణచివేత, అకృత్యాలకు భయపడి కశ్మీరీలు పారిపోయే క్రమంలో లక్షమంది దాల్ సరస్సులో మునిగి దుర్మరణం పాలయ్యారని గుర్తు చేశారు. నిస్సహాయులైన మహిళలు మానభంగాలకు గురయ్యారన్నారు. పారిపోలేని వారిని అక్కడికక్కడే హతమార్చారని వివరించారు. జమ్మూ కశ్మీర్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేసే లక్ష్యంతో మొదలైన ఉగ్రవాదం రాజకీయ హింసకు అంకురార్పణ చేసిందని పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్ చేజారిపోవడానికి కాంగ్రెస్ చేసిన ఐదు చారిత్రక తప్పిదాలే కారణమన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ అవలంభించిన బూటకపు సెక్యులరిజమ్ కారణంగానే కశ్మీర్ సమస్య అనేక దశాబ్దాలపాటు రావణకాష్టంలా రగులుతూ వచ్చిందన్నారు. కశ్మీర్ సమస్యను ఐక్యరాజ్య సమితికి తీసుకువెళ్లడం ద్వారా నెహ్రూ పెద్ద పొరపాటు చేశారన్నారు. ఈ పరిస్థితి 1949లో రాజ్యాంగంలో ఆర్టికల్ 370 ప్రవేశపెట్టడానికి కారణమైందని.. ఇది జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసే ప్రక్రియకు తీవ్ర అవరోధంగా నిలిచిందని చెప్పారు. పలు సందర్భాల్లో పీవోకేను ఆక్రమించుకునే అవకాశం వచ్చినా వినియోగించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం బంగారు పళ్లెంలో పెట్టి పాకిస్తాన్‌కు అప్పగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు ప్రధానులు, రెండు గుర్తుల స్థానంలో ఒకే ప్రధాని, ఒకే గుర్తు అనే విధానాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం అవలంభించడం అభినందనీయమన్నారు. గడచిన నాలుగేళ్లుగా ఆ ప్రాంతంలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలు కూడా తగ్గుముఖం పట్టి శాంతి భద్రతలు మెరుగుపడ్డాయని తెలిపారు. ఎంపీ విజయసాయిరెడ్డి ప్రసంగం పట్ల పలువురు కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపినప్పటికీ.. ఆయన చేసిన సూచనలకు హోంమంత్రి అమిత్ షా, బీజేపీ సభ్యులు బల్లలు చరిచి అభినందనలు తెలిపారు.

ఈసారి మరిన్ని స్వచ్ఛ నగరాలు

ముందు వరుసలో తిరుపతి, విశాఖ, విజయవాడ, కాకినాడ

సాక్షి, అమరావతి: నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో (పట్టణ స్థానిక సంస్థల్లో–యూఎల్బీల్లో) పారిశుద్ధ్య పనుల తీరుపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే రాష్ట్రంలో కొనసాగుతోంది. ఇప్పటి వరకు 37 యూఎల్బీల్లో సర్వే పూర్తవగా, మరో 42 యూఎల్బీల్లో సర్వే చేయాల్సి ఉంది. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) జాతీయస్థాయిలో గతేడాది నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో ఏపీ టాప్ ర్యాంకు సాధించడమేగాక, వివిధ కేటగిరీల్లో 11 అవార్డులను సాధించింది. ఈ ఏడాది కూడా మొదటి ర్యాంకును నిలబెట్టుకోవడమేగాక ఎక్కువ అవార్డులు వస్తాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా బహిరంగ మలమూత్ర విసర్జనను నిర్మూలించడంలోను, టాయిలెట్లను ప్రోత్సహించడంలోను గతం కంటే మెరుగైన పరిస్థితులున్నాయి. దీంతోపాటు పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో మున్సిపాలిటీలు విజయవంతమయ్యాయి. ఇంటింటికి చెత్త డబ్బాలను అందజేయడంతోపాటు రోజూ ఇంటికే వచ్చి చెత్త సేకరించడం, వీధుల్లో చెత్త డబ్బాలు లేకుండా చేయడంతో ప్రజల సహకారం పెరిగింది. దీంతో ఇప్పటికే సర్వే పూర్తయిన 37 యూఎల్బీల్లోను మంచి ఫలితాలు కనిపించాయి. 2022 స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో జాతీయస్థాయిలో అత్యుత్తమ పారిశుధ్య కార్మిక విధానాలు పాటిస్తున్నందుకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌కు సఫాయిమిత్ర సురక్షాసెహర్ అవార్డు దక్కింది. విశాఖ మహానగరపాలక సంస్థ (జీవీఎంసీ) క్లీన్ బిగ్ సిటీ అవార్డు సాధించగా, విజయవాడ స్వచ్ఛ రాజధాని నగరంగా గుర్తింపు పొందింది. ఇవి ఐదు స్టార్ల రేటింగ్‌ను కూడా సొంతం చేసుకున్నాయి. పుంగనూరు ప్రజాభిప్రాయం విభాగంలోను, పులివెందుల, సాలూరు ఇన్నోవేషన్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ విభాగంలోను అవార్డులు పొందగా, శ్రీకాకుళం, పాదిలి ప్రత్యేక కేటగిరీలో పురస్కారాలు దక్కించుకున్నాయి. ఇప్పటికే పూర్తయిన బహిరంగ మల విసర్జన రహిత (ఓడీఎఫ్) సర్వేలో రాష్ట్రంలో పెద్ద కార్పొరేషన్లు అయిన విశాఖ, తిరుపతి, విజయవాడ, కాకినాడతో పాటు దాదాపు 20 వరకు యూఎల్బీలు ఉత్తమ పనితీరుతో ముందున్నట్లు గుర్తించారు. అన్ని నగరాలు, పట్టణాల్లో సర్వే పూర్తయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రజాభిప్రాయమే ప్రాతిపదికగా..

కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సిబ్బంది రాష్ట్రంలోని పట్టణాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే నిర్వహిస్తున్నారు. దేశంలోని అన్ని పట్టణాలను పరిశుభ్రమైనవిగా మార్చాలన్న లక్ష్యంతో 2017 నుంచి ఏటా సర్వే చేసి, ఉత్తమ పనితీరు కనబరిచిన పట్టణాలకు అక్టోబర్ 2వ తేదీన అవార్డులు ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సర్వేలో పట్టణాల్లోని పారిశుధ్య ప్రమాణాలను పరిశీలిస్తారు. ఇంటింటి చెత్తసేకరణ ఎలా ఉంది, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా.. లేదా, రోడ్లను రోజూ శుభ్రం చేయడం, చెత్తబుట్టల ఏర్పాటు, ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే హోటళ్లు, కార్యాలయాలు, కంపెనీలు సొంతంగా ప్రాసెసింగ్ చేస్తున్నాయా వంటి అంశాలపై సర్వే జరుగుతుంది. క్యూసీఐ సిబ్బంది పట్టణాల్లోని కొందరికి ఫోన్‌చేసి, పరిస్థితిని తెలుసుకుంటారు.

రాజ్యసభ | **ఏపీ ఇన్ పార్లమెంట్**

ఏపీలో రూ.6,865 కోట్లతో స్మార్ట్ సిటీ పనులు

సాక్షి, న్యూఢిల్లీ: స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపికైన తిరుపతి, విశాఖపట్నం, కాకినాడ, అమరావతి నగరాల్లో రూ.6,865 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ప్రశ్నకు సోమవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఎంపికైన 4 నగరాల్లో మొత్తం 283 అభివృద్ధి ప్రాజెక్టులు కేటాయించినట్టు తెలిపారు. ఇందులో రూ.4,742.43 కోట్ల వ్యయంతో చేపట్టిన 224 పనులు ఇప్పటికే పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. రూ.2,122.98 కోట్లతో చేపట్టిన మిగిలిన 52 ప్రాజెక్టు పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని వివరించారు.

మరీ అంత పాతవేం కాదు



కేజీ బేసిన్ ఏర్పాటు చేసిన పైపులైన్లు నాలుగు దశాబ్దాల నాటివేం కాదని కేంద్ర పెట్రోలియం సహజ వనరుల శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. సాధారణంగా నిబంధనల మేరకు తయారైన పైపులైన్లకు 25 ఏళ్లపాటు లైఫ్‌లైన్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

కడప విమానాశ్రయానికి ఎఫ్‌టీవో

కడప విమానాశ్రయానికి జూన్ 2022లోనే ఫ్లెయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీవో)ను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేటాయించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పక్షులు ఢీకొట్టిన ఘటనలు ఢిల్లీలోనే ఎక్కువ

మూడేళ్లలో ఢిల్లీ విమానాశ్రయంలోనే అత్యధికంగా పక్షులు విమానాలను ఢీకొట్టిన ఘటనలు నమోదయ్యాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ తెలిపారు.

లోక్ సభ

విపత్తు నిధులు అదనంగా ఇవ్వండి

కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు




సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు విపత్తు నిధులు అదనంగా కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. సోమవారం లోక్‌సభలో సప్లిమెంటరీ గ్రాంట్ డిమాండ్లపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. ఏపీలో ఇటీవల తుపాను కారణంగా 8 జిల్లాల్లో సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఏపీకి విపత్తు నిధులు రూ.400 కోట్లు కేటాయించారని.. ఆ మొత్తాన్ని రూ.2వేల కోట్లకు పెంచాలని కోరారు. మూలధన వ్యయం కింద మిగిలిన రూ.4.43 లక్షల కోట్లు వినియోగించాల్సి ఉందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి పని దినాలు పెంచాలన్నారు. గోదావరి–పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్ట్‌లో పురోగతి లేదని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ అభివృద్ధిని కేంద్రం విస్మరిస్తోందని, పెండింగ్ నిధులు రూ.2,937 కోట్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్న అదనపు నిధులు, పునరావాస నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీకి ఇచ్చిన విద్యా సంస్థలను అభివృద్ధి బాట పట్టించాలని కోరారు. రాష్ట్రం ప్రతిపాదించిన 13 కొత్త వైద్య కళాశాలల్లో 3 మెడికల్ కాలేజీలు మాత్రమే మంజూరయ్యాయని, మిగిలిన వాటిని వెంటనే మంజూరు చేయాలన్నారు. రైల్వే జోన్, లైన్ల అభివృద్ధిపై ప్రశ్నిస్తుంటే భూ కేటాయింపులు చేయలేదని కుంటిసాకులు చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఆర్థిక పరిస్థితి కేంద్రానికి తెలియదా అని ప్రశ్నించారు. భారతమాలలో ప్రతిపాదించిన ఏడు రహదారి ప్రాజెక్టులు త్వరగాపూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రజలు పదేళ్లుగా కోరుతున్న ప్రత్యేక హోదా డిమాండ్ నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తు చేశారు. కాగా.. శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)లో పల్నాడుకు చెందిన 5,936 మంది ఎన్‌రోల్ చేసుకున్నారని తెలిపారు.

రూ.1.60 లక్షల వరకూ పూచీకత్తు అవసరం లేదు



రైతుల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.1.60 లక్షల రుణం వరకూ ఎలాంటి పూచీకత్తు అవసరం లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్ తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. అంతకు మించి రుణం కావాలంటే పూచీకత్తు అవసరమన్నారు.

కరువుపై తక్షణ చర్యలు అవసరం



కరువు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలను ఆదుకోవడానికి తక్షణ చర్యలు అవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్. రెడ్డెప్ప కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. కరువును ప్రకటించడానికి రాష్ట్రాల ప్రస్తుత ప్రమాణాలను కేంద్రం పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కరువు నివారణకు ఇటీవల ఆర్థిక సాయం తగ్గించడం కూడా ఆందోళనకరమైన విషయమన్నారు. ఏపీలోని జిల్లాల్లో ప్రధాన పంటల దిగుబడి తగ్గి ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడిందని ఎంపీ రెడ్డెప్ప సభ దృష్టికి తీసుకొచ్చారు. కాగా.. ఎంపీ రెడ్డెప్ప అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్‌చౌబే లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఏనుగులు సంచరించే రాష్ట్రాల్లో 159 ఎలిఫెంట్ కారిడార్లపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తున్నట్టు తెలిపారు.

కశింకోటలో ఫుట్ బ్రిడ్జి పూర్తి చేయండి



అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట ప్రజలు వర్షాకాలంలో శారదా నదిని దాటడానికి ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి సోమవారం లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చారు. రూ.2.85 కోట్లు అనుమతించి త్వరితగతిన ఫుట్ బ్రిడ్జిని పూర్తి చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు.

కేవీ, జేఎన్‌వీల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు

ఏపీలోని 28 కేంద్రీయ విద్యాలయాల్లో 402 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, 15 జవహర్ నవోదయ విద్యాలయాల్లో 63 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అమలులో ఉన్నాయని కేంద్ర సహాయ మంత్రి అన్నపూర్ణ దేవి తెలిపారు.

క్లుప్తంగా...

2047 నాటికి అగ్రరాజ్యంగా భారత్

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: భారత్‌ను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దడంలో యువత కీలక భూమిక పోషించాలని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వర్సిటీ, ఐఐటీలు, ఐఐఎంలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల వీసీలు, రిజిస్ట్రార్లు, డీన్‌లతో 'వికసిత్ భారత్' పేరిట ఢిల్లీ నుంచి సోమవారం నిర్వహించిన సదస్సులో విజయవాడలోని రాజ్‌భవన్ నుంచి గవర్నర్, ఇతర ఉన్నతాధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సదస్సును ఉద్దేశించి ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగిస్తూ 2047కి భారత్ అగ్రరాజ్యంగా ఆవిర్భవించడం ఖాయమని అన్నారు. సగటున 29 ఏళ్ల వయసుతో ఉన్న 144 కోట్ల జనాభానే దేశ అభివృద్ధికి ప్రధాన వనరు అని పేర్కొన్నారు. వికసిత్ భారత్ పేరుతో కేంద్రం దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం'పై హైకోర్టుకు వెళ్లండి

- కేంద్రానికి సూచించిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన కేసులో హైకోర్టుకు వెళ్లాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పూర్తి ఖర్చు కేంద్రమే భరించాలని, త్వరితగతిన పూర్తి చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ కాంగ్రెస్ మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ఏపీ హైకోర్టును 2017లో ఆశ్రయించారు. ఈ కేసును ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం 2019లో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషన్‌ను ఏపీ హైకోర్టు నుంచి బదిలీ చేయాలని కేంద్రం తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. దీనికి నిరాకరించిన ధర్మాసనం హైకోర్టుకు వెళ్లాలని కేంద్రానికి సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

నగరి కోర్టుకు హాజరైన సినీనటి జీవిత

నగరి (చిత్తూరు జిల్లా): సినీ నటి, దర్శకురాలు జీవిత రాజశేఖర్ సోమవారం నగరి కోర్టుకు హాజరయ్యారు. గరుడవేగ చిత్ర నిర్మాణానికి గాను జరిగిన ఆర్థిక లావాదేవీల్లో ఆమె ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయంటూ నగరి నియోజకవర్గం మహారాజపురంలోని సాయిశక్తి ఇంజినీరింగ్ కళాశాల యజమాని కోటీశ్వర్‌రాజు భార్య హేమరాజు నగరి కోర్టులో కేసు వేశారు. ఈ కేసు రెండేళ్లుగా నగరి కోర్టులో నడుస్తోంది. కేసును పునర్విచారించాలంటూ జీవిత వేసిన రీకాల్ పిటిషన్‌ను సోమవారం జడ్జి విష్ణువర్మ డిస్మిస్ చేశారు. అలాగే, అయిన ఖర్చులకుగాను రూ.10 వేలు కట్టాలని ఆదేశించినట్లు హేమరాజు తరఫు న్యాయవాది మురళీధర్ పేర్కొన్నారు. సాక్షిగా తనను విచారించాలని జీవిత కోరడంతో కేసును ఈనెల 18కి వాయిదా వేశారు.

'మార్గదర్శి' ఆస్తుల అటాచ్‌మెంట్ చెల్లదు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల కేసులో ఆ సంస్థ ఆస్తులను అటాచ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను గుంటూరు జిల్లా న్యాయస్థానం తోసిపుచ్చింది. సీఐడీ ప్రతిపాదన మేరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన మూడురకాల ఆస్తుల జప్తునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనిపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ గుంటూరు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆస్తుల అటాచ్‌మెంట్ చెల్లదని సోమవారం తీర్పు ఇచ్చిందని సీఐడీ అదనపు డీజీ సంజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జమ్మూ కశ్మీర్‌కు హోదా తొలగింపు ఏపీకి నష్టమే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను సైతం తొలగించడం విచారకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సుప్రీం తీర్పు జమ్మూ కశ్మీర్‌కు మాత్రమే కాదని, ఏపీకి కూడా తీరని నష్టం చేస్తుందని పేర్కొన్నారు. సుప్రీం తీర్పును అడ్డుపెట్టుకుని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రం దగా చేయనుందని శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఆదాయ వార్షిక నివేదిక (ఏఆర్ఆర్), బహుళ వార్షిక కాల వ్యవధి (ఎంవైటీ)లపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కాకుండా భౌతికంగా నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జునరెడ్డికి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



విజయనగరం జిల్లా బొప్పడాం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం నెలవంకలో పార్టీ జెండా ఎగురవేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తాటిపర్తిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు

డూప్లి'కేట్స్'..!

టీడీపీ సానుభూతిపరులకు పలు చోట్ల ఓట్లు



నెల్లూరు జిల్లా వరికుంటపాడు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధు పామూరుపల్లికి చెందిన వ్యక్తి. ఆయన కుటుంబ సభ్యుల పేర్లు 8 చోట్ల డబుల్ ఎంట్రీ అయ్యాయి. వీరంతా ఇటు పామూరుపల్లిలోను అటు కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం మండలం రాచెరువురాజుపాలెం గ్రామంలోనూ ఓటర్లుగా నమోదయ్యారు. పామూరుపల్లిలోనే మరో నలుగురు స్థానికంగానూ, హైదరాబాద్‌లోనూ ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పామూరుపల్లి సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేవలం ఒక్క ఓటుతో గెలవడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ ఎంతో కీలకం! ఒకే ఒక్క ఓటు సైతం అభ్యర్థుల తలరాతలను తారుమారు చేస్తుంది! గెలుపోటములను నిర్దేశిస్తుంది! ఒకపక్క ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ గగ్గోలు పెడుతున్న విపక్ష టీడీపీ మరోపక్క చాపకింద నీరులా దొంగ ఓట్ల నమోదుకు బరి తెగించింది. తాజాగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారుల దొంగ ఓట్ల బాగోతం బహిర్గతమైంది. పలువురు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల్లోనూ ఓటర్లుగా నమోదైనట్లు గుర్తించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఓటర్ల జాబితా పరిశీలన, నమోదు, తొలగింపు, సవరణ లాంటి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో టీడీపీకి చెందిన పలువురు రెండు చోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు బయటపడింది.

అక్కడా ఉంటారు.. ఇక్కడా ఉంటారు!

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలంలోని పామూరుపల్లి 300 ఓటర్లు ఉండే చిన్న గ్రామం. అక్కడ టీడీపీ మద్దతుదారులకు సంబంధించి 30 ఓట్ల డబుల్ ఎంట్రీ వ్యవహారం తాజాగా బయటపడింది. గ్రామంలో ఓటు హక్కు ఉన్న చింతగుంపల ప్రసాద్, చింతగుంపల అరుణ, చింతగుంపల ముఖేష్‌కు కందుకూరు నియోజకవర్గం లింగసముద్రం మండలం రాచెరువు రాజుపాలెం గ్రామంలోనూ ఓటర్లుగా నమోదయ్యారు. చంద్ర చలపతిరావు, చంద్ర సరళకు పామూరుపల్లిలో పాటు తెనాలిలోనూ ఓట్లు ఉన్నాయి. చంద్ర ఈశ్వరమ్మకు వరికుంటపాడులోనే రెండు చోట్ల ఓట్లు ఉండటం గమనార్హం. వివాహమై అత్తారింటికి వెళ్లిన కొందరు మహిళలకు అటు మెట్టినింట్లోను, ఇటు పుట్టింటిలోనూ 2 చోట్ల ఓట్లున్నాయి.

సోమిరెడ్డి - నారాయణ కుట్రలు

- సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలలో 11,291 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు మాజీ మంత్రి సోమిరెడ్డి తన అనుచరులతో ఫారం-7 ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయించారు. వెరిఫికేషన్ సమయంలో అనుమానం రావడంతో పరిశీలించగా టీడీపీ నేతలు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది.
- ఇదే తరహాలో నెల్లూరు నగరంలో దాదాపు 12 వేల ఓట్లను తొలగించేందుకు మాజీ మంత్రి పొంగూరు నారాయణ టీమ్ ప్రయత్నించింది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను ఆన్‌లైన్‌లో ఫారం-7 ద్వారా తొలగించేందుకు దరఖాస్తు చేయించారు. అయితే నెల్లూరు కార్పొరేషన్ నుంచి సంబంధిత ఓటర్లకు సమాచారం వెళ్లడంతో ఈ కుట్రలు విఫలమయ్యాయి. నెల్లూరు నగర నియోజకవర్గం జనార్దన్‌రెడ్డి కాలనీ పోలింగ్ బూత్ నెంబర్ 10లో గౌస్‌బాషా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కావడంతో అతడి ఓటును తొలగించేందుకు ఎల్లో గ్యాంగ్ ఆన్‌లైన్‌లో ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసింది. బూత్ నెంబర్ 9లో ఎస్ మస్తాన్, పెల్లగిరి దేవయానం మృతి చెందినట్లు పేర్కొంటూ ఓటర్లుగా తొలగించేందుకు ఫారం-7 ద్వారా దరఖాస్తు చేశారు.

సుమోటోగా విచారించాలి

- కొల్లు కుటుంబ సభ్యులకు 2 బూత్‌లలో ఓట్లు: పేర్ని నాని
- తెలంగాణలో ఓటు వేసిన జిల్లా వాసులు 11,154 మంది



ఓటర్ల జాబితా అవకతవకలపై కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు అందజేస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని చిత్రంలో ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీ తదితరులు

చిలకలపూడి (మచిలీపట్నం): ఓటర్ల జాబితాలకు సంబంధించి తాము ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ సుమోటోగా విచారణ జరపాలని బందరు శాసన సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) కోరారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై సోమవారం ఆయన కలెక్టర్ పి.రాజాబాబుకు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 2019కి ముందు ఉన్న ఓటర్ల జాబితానే ప్రస్తుతం కొనసాగుతోందన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు కూడా కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో ఓటు వేసిన 11,154 మంది జిల్లాల్లో కూడా ఓటర్లుగా కొనసాగుతున్నట్లు పార్టీ సేకరించిన సమాచారం ప్రకారం తేలిందన్నారు. ఇలాంటి వారు ఇంకా చాలా మంది ఉన్నారని, వారందరినీ జాబితా నుంచి తొలగించాలన్నారు. డబ్లింగ్ ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు మూడు ఓట్లు ఉండటం లాంటి అవకతవకలు ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్నాయన్నారు.

కొల్లు కుటుంబానికి రెండు బూత్‌ల్లో ఓట్లు

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులు మచిలీపట్నంలోని 116, 107 పోలింగ్ బూత్‌లలో రెండు చోట్లా ఓటర్లుగా నమోదు కావడం పట్ల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్న కొల్లు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పేర్ని నాని వెంట ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, సింహాద్రి రమేష్ తదితరులున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంపిక పరీక్షలు వాయిదా



సాక్షి, అమరావతి: ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు, వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన నిర్వహించాల్సిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంపిక పరీక్షలను వాయిదా వేసినట్టు ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీ జె.ప్రదీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాలతో పరీక్షలను వాయిదా వేసినట్టు వివరించారు. పరీక్షలు తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామన్న దానిపై త్వరలో ప్రకటన జారీ చేస్తామన్నారు.

వ్యవసాయంపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

టెక్కలి: 'టీడీపీ పాలనలో వ్యవసాయ అభివృద్ధి సూచీ మైనస్ 4 ఉండేది. ఇప్పుడది ప్లస్ 6కు చేరింది. గతంలో విత్తనాల కోసం క్యూ కట్టేవారు. ఇప్పుడు ఆ అవస్థే లేదు. జాతీయస్థాయిలో అన్ని రకాల అభివృద్ధి సూచికల్లో ఆంధ్రా అగ్రస్థానంలో ఉంది. రైతులకు ఉచిత విద్యుత్ సాధ్యం కాదని చంద్రబాబు విమర్శిస్తే.. అప్పట్లో వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇచ్చి చూపించారు' అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన సోమవారం నందిగాంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల ప్రయోజనం కోసం ఏనాడూ ఆలోచన చేయని చంద్రబాబు, ఆ పార్టీ నాయకులకు వ్యవసాయంపై మాట్లాడే అర్హత లేదన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన చంద్రబాబు.. రైతు కష్టాల గురించి మాట్లాడడం విడ్డూరమని విమర్శించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న నేరడి బ్యారేజీ నిర్మాణంపై సీఎం వైఎస్ జగన్ ఒడిశా సీఎంతో కూడా మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పుడు గొట్టా బ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని, మరో ఆరు నెలల్లో 19 టీఎంసీల సాగునీరు అందుతుందని వెల్లడించారు. వంశధార ప్రధాన కాలువలను పూర్తిగా సిమెంట్ లైనింగ్ చేయాల్సి ఉందని, కరువు మండలాల ఎంపిక దేశవ్యాప్తంగా ఒకే ప్రాతిపదికన ఉంటుందని వివరించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా ఆలోచన చేస్తున్నారన్నారు.

కోర్టు అనుమతి రాగానే పోలీస్ నియామకాలు

- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

రాయచోటి: రాష్ట్రంలో 6,500 మంది పోలీసుల నియామకానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. ఇందుకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయని, కోర్టు నుంచి సానుకూలత రాగానే కార్యాచరణ మొదలవుతుందన్నారు. త్వరలో ఎస్ఐ నియామక తుది ఫలితాలు విడుదల చేస్తామన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో రూ. 3.50 కోట్లతో నిర్మించిన డీఎస్పీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల భవనాల ప్రారంభోత్సవానికి డీజీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలు పటిష్టంగా అమలవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో నేరాలు, ఘోరాలు పెరిగిపోయాయంటూ కొన్ని పత్రికలలో వస్తున్న సమాచారం వాస్తవం కాదన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో క్రైమ్ రేట్ బాగా తగ్గిందన్నారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలు సైతం తగ్గుముఖం పట్టాయన్నారు. దిశ యాప్ ద్వారా మహిళలకు భద్రత కల్పించగలిగామన్నారు. కడపలో సీఐపై జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కర్నూలు డీఐజీ సెంథిల్ కుమార్ పాల్గొన్నారు.

కుట్ర బుద్ధితో కుంగిపోయారు

- రాష్ట్రంలో 88.09% పెరిగిన కూరగాయల ఉత్పాదకత
- 42 లక్షల టన్నుల నుంచి పదేళ్లలో 79 లక్షల టన్నులకు దిగుబడులు
- ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి
- తోటబడులతో రైతులకు నిరంతర శిక్షణ కార్యక్రమాలు
- అన్నదాతకు పంట నష్టపరిహారం, పంటల బీమా పరిహారం


కూరగాయల్లోనూ
కుంగిపోయాం!



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూరగాయల ఉత్పాదకత ఏటా పెరుగుతూనే ఉన్నా పెత్తందారులు మాత్రం ఒప్పుకునేది లేదంటున్నారు! 'కూరగాయల్లోనూ కుంగి పోయాం' అంటూ కాకి లెక్కలు కడుతున్నారు! రాష్ట్రంలో ఉద్యాన పంటల దిగుబడుల్లో 20.9 శాతం వృద్ధి రేటు సాధించగా కూరగాయల దిగుబడుల్లో 12.88 శాతం నమోదైంది. కూరగాయల దిగుబడులను పరిశీలిస్తే 2014-15లో 42.61 లక్షల టన్నులు ఉండగా ప్రస్తుతం 79.06 లక్షల టన్నులకు పెరిగింది. అంటే పదేళ్లలో 88.09 శాతం పెరిగింది. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో సగటు దిగుబడులు 63.61 లక్షల టన్నులు ఉండగా గత నాలుగున్నరేళ్లలో 74 లక్షల టన్నులుగా ఉంది. టీడీపీ హయాంలో సగటు ఉత్పాదకత 7.48 శాతం ఉంటే ప్రస్తుతం 12.88 శాతంగా ఉంది. దిగుబడులు పెరిగాయో తగ్గాయో చెప్పేందుకు ఈ గణాంకాలు చాలు. కంటి చూపు మందగించిన పెత్తందారులకు ఇవేమీ కానరాక కూరగాయల దిగుబడుల్లో ఆంధ్రప్రదేశ్ నేలచూపులు చూస్తోందంటూ అబద్ధాలు అచ్చేశారు.

ఎగుమతులు కనిపించవా?

పంట ఉత్పత్తులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సీజన్‌లో వస్తాయి. మన రాష్ట్రంలో పంట సాగు దశలో ఉన్న సమయంలో నాసిక్ నుంచి ఉల్లి తెచ్చుకుంటాం. మన దగ్గర ఉత్పత్తి ప్రారంభం కాగానే మన ఉల్లిని మహారాష్ట్రకు పంపుతుంటాం. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే టమాటాలో ఏటా మూడొంతులు పొరుగు రాష్ట్రాలకే ఎగుమతి అవుతుంది. వంగ, బీర, సొర, దొండ, బెండ లాంటి కూరగాయలు సైతం పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాదిలోని పలు ప్రముఖ నగరాలకు నిత్యం సరఫరా అవుతాయి. పట్టణీకరణ వల్ల కొంత విస్తీర్ణం తగ్గినా దిగుబడులు మాత్రం రికార్డు స్థాయిలో ఏటా పెరుగుతూనే ఉన్నాయి.

నాడు పంటల బీమా రక్షణ ఏది?

సీఎం జగన్ వివిధ పథకాల కింద కూరగాయలు సాగు చేసే 1.42 లక్షల మందికి రూ.140.58 కోట్ల సబ్సిడీని అందించారు. నాలుగున్నరేళ్లలో హెక్టార్‌కు రూ.80 వేల సబ్సిడీతో 6.75 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలకు బిందు, తుంపర పరికరాలు అమర్చారు. వాటిలో కూరగాయలు సాగయ్యే విస్తీర్ణం 3.50 లక్షల ఎకరాలకు పైనే ఉంది. టీడీపీ హయాంలో కూరగాయల పంటలకు బీమా రక్షణే లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నోటిఫై చేసిన కూరగాయల పంటలకు సైతం ఉచిత పంటల బీమాను వర్తింప చేస్తోంది. నాలుగున్నరేళ్లలో 10,87,608 హెక్టార్లలో సాగైన పంటలకు సంబంధించి 5,35,554 మంది రైతులకు రూ.1,409.57 కోట్ల పంటల బీమా పరిహారాన్ని జమ చేసింది.

రాయితీలు.. ప్రోత్సాహకాలు

సాగులో మెళకువలు, చీడపీడల నియంత్రణ, కొత్త సాంకేతిక పద్ధతులు ఆర్బీకేల ద్వారా నిర్వహిస్తున్న తోటబడుల ఫలితంగా నాణ్యతతో పాటు దిగుబడులు కూడా గణనీయంగా పెరిగాయి. తీగ జాతి కూరగాయలను పెంచేందుకు శాశ్వత పందిళ్లు, టమోటా నాణ్యత పెంచేందుకు ట్రెల్లీస్ పద్ధతిలో నాటటాన్ని ప్రోత్సహిస్తున్నారు. కూరగాయల సాగుకు షేడ్ నెట్ హౌస్, పాలీ హౌస్, ప్లాస్టిక్ మల్చింగుకు ప్రభుత్వం సబ్సిడీతో ప్రోత్సహిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కొత్తగా తెచ్చిన గ్రాఫ్టింగ్ విధానంలో ఉత్పత్తి చేస్తున్న టమాటా, వంగ, బీర, సొర మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఏటా 15-20 లక్షల గ్రాఫ్టెడ్ మొక్కల పంపిణీ ఫలితంగా దిగుబడులు 3-4 రెట్లు వస్తున్నాయి. టీడీపీ హయాంలో హెక్టార్‌కు 15-20 టన్నులకు మించి రాని టమాటాలు ప్రస్తుతం 35-40 టన్నుల దిగుబడులు వస్తున్నాయి. గతేడాది వర్షాలకు నీరు నిలిచినా తట్టుకొని మంచి దిగుబడులొచ్చాయి. గతంలో 10 టన్నులకు మించని వంగ ప్రస్తుతం 25 టన్నులు వస్తోంది.

నేడు మిన్నగా పంట నష్టపరిహారం

టీడీపీ సర్కారు ఐదేళ్లలో 3.34 లక్షల మంది రైతులకు రూ.387.33 కోట్ల పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇవ్వగా సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో 3.84 లక్షల మంది రైతులకు రూ.449.34 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని చెల్లించారు. ఈ ఏడాది 17,992 మంది ఉద్యాన రైతులకు రూ.19.56 కోట్ల కరువు సాయం విడుదలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఉద్యాన పంటల విస్తరణ పథకాల కింద షేడ్‌నెట్స్, పాలీహౌస్‌లకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పెద్ద ఎత్తున రాయితీలను అందించారు.

కడప ఘటనలో ఇరువర్గాలపై కేసు

- చట్టం దృష్టిలో అంతా సమానమే: డీఎస్పీ షరీఫ్



మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప అర్బన్: కడప నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీ రాధాకృష్ణనగర్‌లో ఈ నెల 9న ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ సహా ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. పోలీసు శాఖపై ఎవరూ అపోహ పడాల్సిన పనిలేదని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాధాకృష్ణ నగర్‌లో అన్నమయ్య జిల్లా ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.అనిల్‌కుమార్ నివాసం ఉంటున్నారన్నారు. ఆయన ఇంటికి సమీపంలోనే ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు యువకులు గదులను అద్దెకు తీసుకుని రాత్రి వేళల్లో విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పారు. వారు పగటిపూట సమీపంలోని నెహ్రూ పార్క్ ఎదురుగా గల మయూర గార్డెనియాలో పనిచేస్తుంటారన్నారు. శనివారం రాత్రి హోటల్‌లో పని ముగించుకుని వెళ్లే క్రమంలో వారంతా న్యూసెన్స్ చేస్తున్నారని ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వారితో వాగ్వాదానికి దిగారన్నారు. యువకులు ఇన్‌స్పెక్టర్ మాట్లాడే మాటలను అర్థం చేసుకోలేక వారు కూడా వాగ్వాదానికి దిగి, చివరకు తాము పనిచేస్తున్న హోటల్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారన్నారు. ఈ ఘటన చివరకు పరస్పరం దాడికి దారితీసిందన్నారు. వన్‌టౌన్ పోలీసులకు, రక్షక్‌కు, బ్లూకోల్ట్స్ సిబ్బందికి వెంటనే సమాచారం రావడంతో మూడు నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకున్నారన్నారు. అక్కడున్న వారిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారన్నారు. ఇరువైపులా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పరస్పరం కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రాథమిక విచారణ చేసేందుకు మాత్రమే ఆలస్యమైందని, మరే ఇతర కారణాలు కాదని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కారపురెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అవ్వారు గురుప్రసాద్, మజ్జారి వెంకటరమణ మరికొందరు యువకులు నిందితులుగా ఉన్నారని చెప్పారు. కారపురెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.అనిల్‌కుమార్‌తో పాటు, మరో ఇన్‌స్పెక్టర్, ఎస్ఐని నిందితులుగా చేర్చామన్నారు.

తెలంగాణ

కేసీఆర్‌ను పరామర్శించిన బాబు, చిరంజీవి





సాక్షి, హైదరాబాద్: యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావును సోమవారం పలువురు ప్రముఖులు కలిసి పరామర్శించారు. ఏపీ మాజీ సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు హాస్పిటల్‌కు వచ్చి చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను కలిసి జరిగిన ప్రమాదం, సర్జరీ గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన మాజీ మంత్రి కేటీఆర్, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌తో మాట్లాడాలనిపించి వచ్చినట్లు చెప్పారు. కోలుకోవడానికి ఆరువారాల సమయం పడుతుందని వైద్యులు చెప్పారని ఆయన తెలిపారు. కేసీఆర్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను కలిసి మాట్లాడిన భట్టి వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కాగా, కేసీఆర్‌ను సినీనటుడు చిరంజీవి పరామర్శించారు. ఆయన్ను కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత స్వయంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్లారు. కేసీఆర్‌తో కరచాలనం చేసిన చిరంజీవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్ ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. కాగా, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాజీ మంత్రి కేటీ రామారావుకు ఫోన్ చేసి ఆరా తీశారు. కేసీఆర్‌కు జరిగిన ప్రమాదం, శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న తీరు గురించి కేటీఆర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

18వ రోజుకు చేరిన రైతుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న రైతులు

కంప్లి: మల్లప్పనకెరె చెరువు భూములను వాటిని సాగు చేసుకుంటున్న రైతులకు అప్పగించాలని ఒత్తిడి చేస్తూ కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో కురుగోడు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రైతులు చేపట్టిన నిరవధిక ధర్నా 18వ రోజుకు చేరుకుంది. మల్లప్పనకెరె అనే పేరును ప్రభుత్వం మార్చడం తగదని, ప్రస్తుతం బెళగావిలో జరుగుతున్న సమావేశాల్లో మల్లప్పనకెరె భూముల విషయంపై చర్చించాలని ఆందోళనకారులు ఒత్తిడి చేశారు.

పార్కింగ్ స్థలాల పరిశీలన



బెంగళూరు రోడ్డులో పార్కింగ్ స్లాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

బళ్లారిఅర్బన్: నగరంలో రోజురోజు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల సంఖ్య కూడా పెరగడంతో ప్రధాన రోడ్లపై ఇరుకైన చోట్ల పార్కింగ్ చేస్తూ ఇబ్బందులు కలిగించడం వల్ల సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, డీఎస్పీ, ట్రాఫిక్ సీఐ అయ్యనగౌడ పాటిల్ నగరంలోని బెంగళూరు రోడ్డు, బండిమోట్, కురికమేలా, ఏపీఎంసీ, కారు వీధి, మోతీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, రాయల్ సర్కిల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు వాహనాల నిలుపుదలపై కూడా సమీక్షించారు. రోడ్డుకు ఇరువైపుల ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపరాదని, పార్కింగ్‌కు కేటాయించిన చోటే వాహనాలను నిలపాలని సూచించారు. పరిశీలించిన అనంతరం వాహనాల నిలుపుదల ప్రాంతాలకు పార్కింగ్ బోర్డులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇష్టానుసారంగా వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తే జరిమానాతో పాటు చర్యలు తప్పవన్నారు.

అక్రమార్కులపై విచారణకు డిమాండ్



ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై విచారణ చేపట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమానంద యాదవ్ మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఓడించడానికి ఎంపీ, ఎమ్మెల్యేల నివాసంలో రూ.కోట్లాది నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయన్నారు. అక్రమ సంపాదనపై విచారణ జరిపి నిందితులపై చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేశారు.

పోస్టర్ల విడుదల

హుబ్లీ: నగరంలో కరియప్ప శిరహట్టి సేవా సంస్థ హసిదవర అన్నజోళిగి ద్వారా విశేష సేవలు అందిస్తోందని మాజీ ఎమ్మెల్యే వీరభద్రప్ప హాలరివి తెలిపారు. ఆయన సోమవారం పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. కరియప్ప దంపతులు నిరాశ్రయులకు ఆపన్నహస్తం అందిస్తూ అందరికీ ఆదర్శప్రాయం అయ్యారన్నారు. కార్యక్రమంలో శివన్న చిక్కన్నవర, మంజునాథ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల మహిళా రైతుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న మహిళా రైతు

హుబ్లీ: గదగ్ జిల్లా ముళగుందకు చెందిన వ్యవసాయ ప్రగతిశీల మహిళా రైతు మంగళ కే.నీలగుందకు 2023వ సంవత్సరానికి గాను మిలీనియం ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డును కేంద్ర ప్రజా పనుల శాఖ మంత్రి నితీన్ గడ్కరి ప్రదానం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేంద్ర ట్రాక్టర్స్ ప్రాయోజకత్వం, కృషి జాగరణ పత్రిక సారథ్యంలో న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ మిలీనియం ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. కాగా ఈమె గత దశాబ్ద కాలంగా మెరుగైన వ్యవసాయ పద్ధతులను అనుసరించి విజయం సాధించిన నేపథ్యంలో హులకోటి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. మహిళా రైతు చుట్టు పక్కల జిల్లాల్లోని రైతులకు సోషల్ మీడియా ద్వారా సాగులో మెలకువల గురించి ముఖ్యంగా ఆధునిక సాగు పద్ధతులు, క్రిమిసంహారక మందులు తక్కువగా వాడటం వంటి కీలక అంశాల గురించి రైతులకు వివరిస్తున్నారు.

అద్దె భవనంలోనే ఎన్‌సీసీ

- స్వంత కట్టడం లేని కార్యాలయం
- సంస్థ కార్యకలాపాలకు ఇబ్బంది



అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కార్యాలయం ఇదే

కోలారు: యువతలో నాయకత్వ లక్షణాలను పెంచి, వారిని సైనికులుగా తయారుచేసే ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) కార్యాలయానికి స్వంత భవనం లేక గత 60 ఏళ్లుగా అద్దె భవనంలోనే నడుస్తోంది. దీని వల్ల ఎన్‌సీసీ కార్యకలాపాలకు వెనకడుగు పడుతోంది. 1953లో మైసూరులో ప్రారంభమైన ఎన్‌సీసీ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను తన కార్యాలయాలను స్థాపించి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. జిల్లాలో 1964లో కర్ణాటక ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయాన్ని నగరంలో ప్రారంభించి 59 సంవత్సరాలు దాటింది. కార్యాలయాన్ని ప్రారంభించి దశాబ్దాలు గడిచినా నేటికీ కార్యాలయాన్ని బాడుగ భవనంలోనే నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో ఫైనాన్స్ విభాగం, కమాండెంట్ అధికారి కార్యాలయం, ఇలా వివిధ కార్యాలయాలు ఒకే భవనంలో నిర్వహిస్తుండడం వల్ల ఇబ్బంది కలుగుతోంది.

ప్రభుత్వాలు మారినా ప్రయోజనం సున్నా

ప్రభుత్వాలు మారినా ఎన్‌సీసీ కార్యాలయానికి ఒక స్వంత భవనం నిర్మించాలనే ఆలోచన రాకపోవడం శోచనీయం. జిల్లా కార్యాలయం నుంచి ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, రక్షణ శాఖలో సేవలందించడానికి వెళ్లే వారికి అవసరమైన శిక్షణను అందిస్తోంది. డిగ్రీ, ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అదనపు శిక్షణ నివ్వడానికి సరైన స్థలం కోసం జిల్లా యంత్రాంగానికి, జిల్లా పంచాయతీకి పలుమార్లు మనవి సమర్పించినా స్పందన లభించలేదు. ఎన్‌సీసీ కార్యాలయం కోసం 8 ఎకరాల స్థలం మంజూరు చేయాలని జెడ్పీ, జిల్లా యంత్రాంగానికి మనవి చేసినా ఇంతవరకు స్పందన కనిపించలేదు. ఈ కారణంగా కార్యాలయాన్ని వేరే జిల్లాకు తరలిస్తారేమోననే అనుమానాలు జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

కుంటుపడుతున్న కేడెట్ల శిక్షణ

2024 జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో బెంగళూరులోని మాణిక్‌షా పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి కోలారు ఎన్‌సీసీ కార్యాలయానికి అవకాశం లభించలేదు. ఎన్‌సీసీ కేడెట్‌లకు తగిన శిక్షణ అందించకపోవడమే కారణమని అంటున్నారు. కళాశాలల్లో ఎన్‌సీసీ బృందాలను రచించడం, శిక్షణా కార్యక్రమాలు, క్యాంప్‌లు నిర్వహించడం వంటివి సకాలంలో జరగాలి. ప్రతి శనివారం కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ నివ్వడానికి ఎన్‌సీసీ నుంచే కమాండెంట్‌లు వస్తారు. ఇవన్నీ సక్రమంగా జరగడానికి ఎన్‌సీసీలో పలు సమస్యలు వేధిస్తున్నాయి.

రిపబ్లిక్ వేడుకలకు దూరం బాధాకరం

సౌకర్యాల కొరత వల్ల ఎన్‌సీసీ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించడానికి సాధ్యం కావడం లేదు. ఇతర జిల్లాలతో పోలిస్తే కోలారు జిల్లాలో ఎన్‌సీసీ కార్యకలాపాలు వెనుకంజలో ఉన్నాయి. వచ్చే రిపబ్లిక్ దినోత్సవ వేడుకలకు జిల్లా ఎన్‌సీసీ ట్రూప్ ఎంపిక కాకపోవడం బాధగా ఉంది. ఈ కార్యకలాపాలు అన్ని సక్రమంగా నిర్వహించడానికి స్వంత భవనం, స్థలం అవసరం.

–వికాస్ శుక్లా, కమాండెంట్ అధికారి, కోలారు

ఎన్‌సీసీని అభివృద్ధి చేయాలి

ఎన్‌సీసీని అభివృద్ధి చేయడానికి రాజకీయ నాయకులకు శ్రద్ధ లేదు. అధికారుల్లో కూడా తగినంత ఆసక్తి కనిపించడం లేదు. యువకుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని నింపే ఎన్‌సీసీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

–వీకే రాజేష్, నగసభ మాజీ ఉపాధ్యక్షుడు

భోజనం వికటించి విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హంపయ్య నాయక్, అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా సాంఘీక సంక్షేమ శాఖ హాస్టల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి 200 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు..ఆదివారం మధ్యాహ్నం విద్యార్థులకు పలావ్, కోడిగుడ్డు, అరటి పండును వడ్డించారు. భోజనం తిన్న విద్యార్థులు అనారోగ్యానికి గురవడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఇద్దరు బాలికలను రిమ్స్‌కు తరలించారు. సోమవారం ఎమ్మెల్యే హంపయ్య నాయక్, కాంగ్రెస్ నాయకుడు రవి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్రబాబు, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి మహేష్, హాస్టల్ వార్డెన్ల నుంచి వివరాలను సేకరించారు.

సౌకర్యాల కల్పనకు ఒత్తిడి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని నమ్మ కర్ణాటక సేన డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు కొండప్ప మాట్లాడారు. నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

మౌలిక వసతుల కల్పన ప్రధాన లక్ష్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరికీ మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత మానవ హక్కుల సంఘం ప్రధాన లక్ష్యమని జిల్లా అదనపు ప్రధాన న్యాయమూర్తి దయానంద బేలూరు పిలుపు ఇచ్చారు. ఆదివారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. మనిషికి జీవించే హక్కు ఎలా ఉందో కూడు, గూడు, గుడ్డ కూడా ప్రాథమిక హక్కు అన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నబీ రసూల్, మానవ హక్కుల అవినీతి నిర్మూలన సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావ్ నలవాడె, జిల్లాధ్యక్షుడు సాదిక్, కార్యదర్శి మన్సూర్, ఉపాధ్యక్షురాలు రజియా, ఎస్ఐ బసవరాజ్ నాయక్, జ్యోతి, వందన, సుజాతలున్నారు. అనంతరం సమాజంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డులను అందించి సన్మానించారు.

పీడీఓలను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



ఆందోళనలో పాల్గొన్న పీడీఓలు

రాయచూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(నరేగ) పథకం నిధులను స్వాహా చేసిన నలుగురు పీడీఓలను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని జీపీ అభివృద్ధి అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు తిమ్మప్ప నాయక్ మాట్లాడారు. దేవదుర్గ తాలూకాలో కాంట్రాక్ట్ ఉద్యోగులైన జాలహళ్లి పీడీఓ పత్యప్ప రాథోడ్, గాణదాళ పీడీఓ మల్లప్ప, కొత్తదొడ్డి పీడీఓ సి.బి.పాటిల్, శావంతగేర పీడీఓ గురుస్వామిలను ఎలాంటి విచారణ జరపకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఒత్తిడి చేశారు. రాష్ట్ర స్థాయి అధికారులు జెడ్పీ అధికారుల వివరణ కోరకుండా నేరుగా ఫిర్యాదు స్వీకరించి తీసుకున్న నిర్ణయాలను పున: పరిశీలించాలని కోరుతూ జెడ్పీ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఎంపీ అక్రమ ఆస్తులపై దర్యాప్తు చేపట్టాలి



రాయల్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తోన్న బీజేపీ నాయకులు

బళ్లారిటౌన్: ఒడిశాలో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు వద్ద లభించిన అక్రమ నోట్ల కట్టలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సోమవారం రాయల్ సర్కిల్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రస్తుతం రూ.351 కోట్లకు పైగా అక్రమ సొమ్ము లభించిందని, మూడు రోజుల నుంచి లెక్క పెడుతున్నా సమయం చాలడం లేదన్నారు. ఇక కాంగ్రెస్ రాజా మాత పుత్రుడు, అల్లుడి వద్ద ఇంకా ఎంత డబ్బు ఉండవచ్చో ఆలోచించాల్సిన విషయం అన్నారు. రైతు మోర్చా ప్రధాన కార్యదర్శి గురులింగనగౌడ, నేతలు గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, అలివేలమ్మ, సుగుణమ్మ, వెంకటేశ్వర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులను శిక్షించరూ..

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా మద్లాపూర్‌లో ప్రసాద్ అనే దళిత నేతను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ డిమాండ్ చేసింది. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షుడు నరసప్ప మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి రోజు దళితులపై దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మద్లాపూర్ ఘటనలో బాధిత కుటుంబాలకు రక్షణ, పరిహారం అందించాలని, కేసును సీఐడీ దర్యాప్తునకు అప్పగించాలని, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కాటికాపరులకు కనీస వేతనాలు చెల్లించాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాటికాపరులకు కనీస వేతనాలు చెల్లించాలని కాటికాపరుల సంఘం అధ్యక్షుడు బసవరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటికాపరులను స్థానిక సంస్థల ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. నగరసభ, కార్పొరేషన్ పరిధిలో కాటికాపరులకు రూ.15 వేలు, తాలూకా స్థాయిలో రూ.13 వేలు, పంచాయతీలో రూ.10 వేలు చొప్పున వేతనాలు ఇవ్వాలని, పింఛన్ కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామన్నారు.

ఆ గోదామును తరలించండి



వినతిపత్రం సమర్పిస్తున్న భరత్ తదితరులు

రాయచూరు రూరల్: పేలుడు వస్తువులను నిల్వ ఉంచిన గోదామును వేరే చోటకు తరలించాలని మూల నివాసి అంబేడ్కర్ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు భరత్ మాట్లాడారు. తాలూకాలో కర్నూలు రహదారిలోని కొత్తదొడ్డి వద్ద ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన పేలుడు పదార్థాలను నిల్వ ఉంచే గోదామును తొలగించి, లైసెన్సును రద్దు చేయాలని కోరుతూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

జనవరి 28న సాహిత్య, సాంస్కృతిక కళా ఉత్సవం



మాట్లాడుతున్న అలెమారి సంఘం నేత రవీంద్రశెట్టి

బళ్లారిఅర్బన్: మైసూరులోని పురభవనలో జనవరి 28న సంచార జాతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కర్ణాటక రాష్ట్ర అలెమారి, అరె అలెమారి అభివృద్ధి నిగమ ఆధ్వర్యంలో సాహిత్య, సాంస్కృతిక కళా ఉత్సవం, ప్రతిభా పురస్కారాలు, సాధకులకు సన్మానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కే.రవీంద్రశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024 మార్చి 1 నాటికి 2 వసంతాలు పూర్తి చేసుకొనే శుభవేళ ఈ సంఘం ఆధ్వర్యంలో ఆ రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సాహిత్యం, సాంస్కృతిక కళా ఉత్సవాలు, ప్రతిభా పురస్కారాలు, సాధనకులకు సన్మానం, చర్చాగోష్ఠులు, సంచార జాతుల మనుగడపై నాడు, నేడు, ఇక ముందు అనే ప్రత్యేక చర్చాగోష్ఠిని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కీలక నిర్ణయాలతో పాటు ప్రాధాన్యత మేరకు సంచార జాతుల అభ్యున్నతి సంక్షేమం కోసం కీలక తీర్మానాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. తమ సమాఖ్యలో బైరాగి, బాలసంతోషి, బాజిగర్, బుడబుడకి, జోశి, గోంధళి, చార, గొల్ల, నాయ్డు తదితర వర్గాల సంక్షేమం కోసం తమ సంఘం పాటుపడుతుందన్నారు. అలెమారి అభివృద్ధి నిగమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంత కృష్ణ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయర్ వెంకటేష్, జిల్లా అధ్యక్షులు పూజారి గాదెప్ప, ప్రముఖులు నారాయణస్వామి, హుల్లప్ప, అప్పన్న, ప్రతాప్ కుమార్ జోగి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన ఇద్దరు అరెస్టు

శ్రీనివాసపురం: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని డ్రాప్ అడిగి మధ్యలో అతని కంటిపై బూడిద చల్లి దొంగతనం చేయడానికి ప్రయత్నించిన ఇద్దరిని స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించిన ఘటన తాలూకాలోని తొట్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా పామిడి సమీపంలోని కొండాపురం గ్రామానికి చెందిన గణేష్, మరో మైనర్ బాలుడిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. వద్దరపాళ్యకు చెందిన వెంకటేష్ గ్రామం నుంచి టీపీ కార్యాలయానికి వచ్చి తన ద్విచక్రవాహనంలో ఉదయం వెళుతుండగా అయ్యప్ప స్వామి మాల వేసుకున్న ఓ వ్యక్తి తొట్లి గ్రామం వద్ద డ్రాప్ అడిగాడు. బైక్ నిలబెట్టగానే వెంకటేష్ ముఖంపై బూడిద లాంటి పదార్థాన్ని చల్లాడు. వెంకటేష్ స్పృహ కోల్పోగానే అతని వద్ద ఉన్న రూ.700 నగదు, మొబైల్‌ను దోచుకుని పరారయ్యారు. 20 నిమిషాల అనంతరం వెంకటేష్‌కు స్పృహ రావడంతో జరిగిన విషయాన్ని తొట్లి గ్రామస్తులకు తెలిపాడు. అంతలో గ్రామస్తులు అనుమానంగా ఉన్న వ్యక్తిని నిలదీసి ప్రశ్నించడంతో విషయం బయట పడింది. అతనితో పాటు ఉన్న మరో వ్యక్తి వివరాలు తెలుసుకుని అతనిని కూడా రప్పించారు. కాగా అతను మైనర్. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



కురుగోడులో దొడ్డ బసవేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కంప్లి: కురుగోడులో వెలిసిన భక్తుల కొంగు బంగారం దొడ్డబసవేశ్వర స్వామికి బళ్లారికి చెందిన ప్రముఖులు పోలా బసవరాజ శెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేక పూజలను బెల్దోన వేదమూర్తి వేణుగోపాల స్వామి అర్చకత్వంలో భక్తిశ్రద్ధలతో నెరవేర్చారు. పోలా బసవరాజ శెట్టి కుటుంబ సంకల్పం మేరకు దొడ్డబసవేశ్వర స్వామికి 13 విధాలైన పాలు, నెయ్యి, చక్కెర, బెల్లం, ఫలపుష్పాలు తదితరాలతో ఏకాదశ రుద్రాభిషేకాన్ని భక్తిప్రపత్తులతో నెరవేర్చామన్నారు. పూజలో సత్యనారాయణ, బసవరాజ, అనిత, ప్రసన్నకుమార్, ప్రజ్వల్, గోల్డ్ శ్రీనివాస్, రత్నయ్య శెట్టి, దేవదాయ శాఖ సహాయకులు బీ.చంద్రప్ప, ప్రభుస్వామితో పాటు పోలా సమస్త కుటుంబ సభ్యులు, విశేషంగా భక్తులు పాల్గొన్నారు. చివరిగా అన్నదానాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు యోగా శిక్షణ




విద్యార్థులకు యోగా పాఠాలు బోధిస్తున్న దృశ్యం

కంప్లి: యోగా మనసు, దేహాన్ని హుషారుగా ఉంచే ప్రాచీన కళ అని, భారతదేశం ప్రపంచానికి అందించిన ఒక అపార కానుక అని యోగా కేంద్ర ప్రముఖులు గోవిందరాజు తెలిపారు. సోమవారం కొళగల్లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యోగా శిక్షణను అందించి ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాల మెరుగునకు యోగా ఎంతో అవసరం అన్నారు. నిత్యం వయస్సుతో సంబంధం లేకుండా యోగా కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

కంప్లి: సండూరులోని ధర్మాపురకు ఆనుకొని ఉన్న గండి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో కార్తీక ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పాల్గొని స్వామి వారి విశేష అభిషేక పూజల్లో, దీపోత్సవంలో పాల్గొన్నారు. ఇక ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల పరిశీలన



ఆధునీకరణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలో కేంద్ర ప్రభుత్వ అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రూ.16 కోట్ల వ్యయంతో చేపట్టిన రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను సంబంధిత రైల్వే అధికారులు, స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు సంయుక్తంగా సోమవారం పరిశీలించారు. జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధిగా స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు టీ.శ్రీనివాసరావ్ మీడియాతో మాట్లాడారు. రైల్వే స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫాంలు, పురుషులు మహిళల వెయిటింగ్ రూంలు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో ఆధుకరిస్తారన్నారు. అంతేగాక ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ ప్రారంభంపై కూడా సమావేశంలో చర్చించామన్నారు. 1వ ప్లాట్‌ఫాంలో ప్రయాణికులు ఎక్కడానికి దిగడానికి అవసరమైన ఎస్కలేటర్ వ్యవస్థతో పాటు రెండు అదనంగా ఎస్కలేటర్లను నిర్మించాలని నిర్ణయించామన్నారు. సాధారణ టికెట్ కౌంటర్ సమీపంలో కార్ పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటుపై కూడా నిర్ణయించామన్నారు. స్పాట్ రిజర్వేషన్ సౌకర్యం హంపీ, అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఉండేలా చూస్తామన్నారు. దీనికి ఓ గంట ముందుగా వచ్చి రిజర్వేషన్ చేసుకోవచ్చని, దీన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ నాగేష్ బాబు శర్మ, కమర్షియల్ అధికారి హొన్నూరు స్వామి, ముఖ్య ఆరోగ్య అధికారి షరీఫ్, జిల్లా వాణిజ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రాజేష్, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల కొరత.. పనుల నిలిపివేత



నిధులు లేక నిలిచి పోయిన భవన నిర్మాణ పనులు

కంప్లి: హంపీ కన్నడ విశ్వవిద్యాలయం స్థాపించి 25 ఏళ్లు నిండిన జ్ఞాపకార్థం రూ.20 కోట్ల ఖర్చుతో ఏడేళ్ల క్రితం ప్రారంభించిన వర్సిటీ భవన నిర్మాణ పనులు నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికీ పనులు 40 శాతం పూర్తి కాలేదని ఎన్ని సార్లు మనవి చేసిన ప్రభుత్వం బాకీ సొమ్ములు విడుదల చేయడం లేదని వర్సిటీ వర్గాలు తెలిపాయి.

నిర్లక్ష్యంగా కరెంటు స్తంభాల నిర్వహణ



డివైడర్లపై సిమెంట్ తొలిగి బయట పడిన విద్యుత్ వైర్ పైపులు



బయటికి కనబడుతున్న వీధి దీప స్తంభాల్లోని విద్యుత్ వైర్లు

సిరుగుప్ప: నగరంలోని బళ్లారి, ఆదోని, సింధనూరు ప్రధాన రోడ్లలో డివైడర్లపై అమర్చిన వీధి దీప స్తంభాల నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. స్తంభాలకు అమర్చిన విద్యుత్ వైర్లు బయటికి వచ్చినా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నగరంలో పొట్టు లారీలు, గడ్డి ట్రాక్టర్ల రాకపోకలతో వీధి దీపాలకు, స్తంభాలకు తగలడంతో వంగిపోయి ముక్కలయ్యాయి. చెడిపోయిన విద్యుత్ దీపాల పైపులు విరిగిపోయి గాలిలో వేలాడుతూ ఎప్పుడు ఎవరి మీద పడి అపాయం సంభవిస్తుందో తెలియదు. కొన్ని వార్డుల్లో పగలు రాత్రి అనే తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నా, పేదలు నివాసముంటున్న డ్రైవర్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో వీధి దీపాలు లేక కటిక చీకటిలో మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇంటికి చేరుకోవాలంటే కష్టకరంగా ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని నివాసులు నాగేంద్రప్ప, రామప్ప తదితరులు అన్నారు.